# లోకానికి నేనే వెలుగు

## దివ్యబలిపూజ సాధారణ నియమావళి క్రమము

(General Instruction of the Roman Missal)



సంపుటి : 48 ఏప్రిల్ - జూన్ 2025 సంచిక : 2

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం, హైదరాబాదు

### ప్రచురణ
**భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయ ప్రచురణలు**
**రామాంతపురం, హైదరాబాదు.**

### సంపాదక వర్గం :
**ఫాదర్ పిల్లి అంతోని దాస్**
**ఫాదర్ సగినాల ప్రకాష్**
**ఫాదర్ దొడ్డ రాజా**
**ఫాదర్ మెడంకి ఆనంద్ అంద్రూ**

### గురు విద్యార్థుల బృందం :
**బ్రదర్ చాట్ల అలెగ్జాండర్**
**బ్రదర్ నెకూరి జాయ్ చందు**
**బ్రదర్ పెందేల ఉమేష్ చంద్ర**
**బ్రదర్ వంపుగుళ్ళ ప్రదీప్‌కుమార్**
**బ్రదర్ పచ్చిగొర్ల ఒబేజ్**
**బ్రదర్ పగుర్ల భానుప్రసాద్**
**బ్రదర్ పెంటారెడ్డి బాల సంజయ్**
**బ్రదర్ బడిపాటి జాకబ్**
**బ్రదర్ అరికోట్ల భరత్ కుమార్**
**బ్రదర్ బాలసాని ప్రభు దాస్**
**బ్రదర్ దొప్పలపూడి రవీంద్ర**
**బ్రదర్ గొన్నాబత్తుల హేమంత్**
**బ్రదర్ కాకుమాను జాన్‌రాజు**
**బ్రదర్ కొట్టె అరవింద్**
**బ్రదర్ తుడుం సంపత్**
**బ్రదర్ తురకా మహేష్**


## చందా వివరములు
**సంవత్సరానికి మీ చందాను రూ॥ 100/- యం.ఓ., డి.డి.ల ద్వారా**
**St. John's Regional Seminary Society, Hyderabad**
**పేరున పంపించి మమ్మల్ని ప్రోత్సహించమనవి. అన్ని సంప్రదింపులకు**
**మరియు మీ విరాళము పంపవలసిన అడ్రస్:**


## St. John's Regional Seminary
Ramanthapur, Hyderabad - 500 013.
Ph: 91-040-29561761, 29561762
e-mail: stjohnshyd2@gmail.com

# లోకానికి నేనే వెలుగు

సంపుటి : 48 ఏప్రిల్ - జూన్ 2025 సంచిక : 2

## దివ్యబలిపూజ సాధారణ నియమావళి క్రమము

## (General Instruction of the Roman Missal)

**ఫాదర్ మెడంకి ఆనంద్ ఆంధ్రు**

సంచిక సంపాదకులు

**ఫాదర్ సగినాల ప్రకాష్**

ప్రధాన సంపాదకులు

భక్త యోహాను ప్రచురణలు, భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం

రామాంతపురం, హైదరాబాదు-500 013.

ఫోన్ : 91-040-29561761, 29561762

E-mail : stjohnshyd2@gmail.com

Website : stjohnseminaryhyd.org

# విషయసూచిక

**సంపాదకీయం**

*– ఫాదర్ మెదంకి ఆనంద్ ఆంధ్రు*.............................. **05**

**1. ప్రారంభ సాంగ్యము**

*– బ్రదర్ అలజంగి దీపక్, బ్రదర్ సింగారెడ్డి అనురాగ్,*

*బ్రదర్ దొప్పలపూడి రవీంద్ర*.................................... **10**

**2. దైవవాక్యార్చన**

*– బ్రదర్ గొన్నాబత్తుల హేమంత్, బ్రదర్ సంజీత్ ఉత్థాన్ సింగ్,*

*బ్రదర్ శానాపతి ఆనంద్*...................................... **40**

**3. కానుకలను సిద్ధపరచుట**

*– బ్రదర్ అరికోట్ల భరత్ కుమార్, బ్రదర్ కండి రవీంద్ర*

*బ్రదర్ గోవిందు అఖిల్ జోసఫ్* ................................ **58**

**4. కృతజ్ఞత ప్రార్థన యొక్క చరిత్ర**

*– బ్రదర్ ఫేబియన్ సెబాస్టిన్, బ్రదర్ కుంచపు వినోద్*

*బ్రదర్ విన్‌సెంట్ రాజ్ ఎడ్విన్ మోజెస్*.......................... **69**

**5. కృతజ్ఞత ప్రార్థన**

*– బ్రదర్ బట్టు అజయ్, బ్రదర్ ఆరుగుళ్ళ రాజేంద్ర*

*బ్రదర్ బొమ్ము ఫ్రాన్సిస్*........................................ **88**

**6. సత్ప్రసాద క్రమము**

*– బ్రదర్ బాసాని ధీరజ్, బ్రదర్ చాట్రగడ్డ కళ్యాణ్,*

*బ్రదర్ కొలకాని జయ ప్రకాష్* .............................. **102**

**7. దివ్యసత్ప్రసాదము స్వీకరించు క్రమము**

*– బ్రదర్ బలసాని ప్రభుదాస్, బ్రదర్ పసల కళ్యాణ్ కుమార్*

*బ్రదర్ ఆవుల రవి కిశోర్*.................................. **112**

**8. దివ్యబలిపూజ ముగింపు క్రమము**

*– బ్రదర్ తిప్పాన యువ చైతన్య, బ్రదర్ చింతా జార్జ్*......... **126**



# సంపాదకీయం



దివ్యబలి ఒక మహా మాధుర్యం. ఈ మాధుర్య ఘట్టం చూడగలిగిన కంటికి కాదు, వినగలిగిన చెవికి కాదు, భక్తిగా ఎదురుచూసే హృదయానికే తెలుస్తుంది. దివ్యబలిపూజలో యేసు తానే బలి వస్తువుగా, తానే గురువుగా, తానే బలిపీఠంగా పరిపూర్ణంగా తనను తాను వ్యక్తపరచుకుంటూన్నారు. ఇది ఒక స్మృతిచిత్రం కాదు, ఇది యథార్ధంగా  జరుగుతున్న రక్షణ ఘట్టం. ఇది ఒక సభ లేదా కూడిక కాదు. ఇది ఈ భూలోకంలోనే పరలోక అనుభూతి అందిస్తుంది (SC 3). ఈ దివ్యబలిలో పాల్గొంటున్న ప్రతి క్రైస్తవుడు కూడా తండ్రికి తన జీవితాన్ని సమర్పించే పిలుపు పొందుతాడు. మన ప్రార్థనలు, బాధలు, సేవలు ఇవన్నీ ఒక ఆత్మీయ బలిగా మారతాయి. క్రీస్తులో భాగస్వాములమవడం ద్వారా మనం కూడా ఒక పరోక్ష యాజకత్వాన్ని స్వీకరిస్తాం. ఈ సమర్పణలో మనకు కూడా స్థానం ఉంది. యేసు ప్రభువు దివ్యబలిపూజ ద్వారా తన ప్రధాన యాజకత్వాన్ని తన సేవకులైన గురువుల ద్వారా కొనసాగిస్తున్నారు. బలిపీఠంపై నిలిచే గురువు, క్రీస్తుకు ప్రతినిధి. ఆయన చేతుల ద్వారా అర్పణ జరిగిందంటే, క్రీస్తే తనను తాను తండ్రికి తిరిగి సమర్పిస్తున్నాడని అర్థం. మన కనులకు కనిపించేది గురువు అయినా, మన ఆత్మకు హత్తుకునేది యేసు క్రీస్తు చేసిన అర్పణే. ఈ దివ్యబలిలో ప్రతి పదం, ప్రతి చర్య, ప్రతి మౌనం ప్రభువు యొక్క మధ్యవర్తిత్వాన్ని మనకు తెలియజేస్తుంది. దివ్యబలిలో మనం దేవుని ప్రేమను తాకుతాం, మన పాపాలకు క్షమాభిక్ష పొందుతాం, పరలోక అనుభవాన్ని పొందుతాం. ఈ బలి లేకుండా క్రైస్తవ జీవితం అసంపూర్ణం. "ప్రపంచం సూర్యుడు లేకుండా

కొనసాగగలేదేమో కానీ దివ్యబలిపూజ లేకుండా మనుగుడ సాగించలేదు.” అని పునీత పాద్రె పియో గారు పలుకుతున్నారు. అందుకే, ఈ దివ్యబలిని మనం గౌరవంగా, ప్రేమగా, మరియు పూర్ణ భక్తితో గ్రహించాలి. దివ్యబలిపూజ యొక్క ప్రారంభ మూలాలను మనము యేసుక్రీస్తు తన అపోస్తులులతో మొదటి పవిత్ర గురువారం రాత్రిన కడరా భోజనం కోసం సమావేశమైన మేడ గదిలో కనుగొనవచ్చు. కాని ఆయన కడరా భోజనంలో స్థాపించిన ఈ దైవార్చనకు ఆయన పేరును సూచించ లేదు. ఆ మొదటి దివ్య సత్ప్రసాద స్థాపనకు లేదా దివ్యబలిపూజకు సువార్తలు ఇచ్చే ఏకైక పదం: “దీన్ని నా జ్ఞాపకార్థం చేయండి” (లూకా 22:19). కతోలిక శ్రీసభలో కడరా భోజన జ్ఞాపకర్ధ బలి యొక్క అధికారిక ప్రార్ధనను దివ్యబలిపూజ అని పిలుస్తారు. ఈ పేరు కాలక్రమేణా అభివృద్ధి చెందింది. కానీ దివ్యబలిపూజ యొక్క ముఖ్యమైన అంశాలు మరియు దివ్యబలిలో వాడే పవిత్ర సామాగ్రి శతాబ్దాలుగా కతోలిక మరియు తూర్పు కతోలిక శ్రీసభలలో స్థిరంగా, మారకుండా మరియు చెక్కు చెదరకుండా సంరక్షింపబడింది. ఈ పురాతన ప్రార్ధనా విధానమును మనము అపోస్తులుల కార్యములలోను మరియు పౌలు గారి లేఖనాలలో, అలాగే పన్నెండు మంది అపోస్తులుల బోధన (Didache), పునీత వేదసాక్షి జస్టిన్ మొదటి విశ్వాస పరిరక్షణ సిద్ధాంతంలో (AD 155) మరియు పునీత హిప్పోలిటస్ అపోస్టోలిక్ సంప్రదాయంలో (AD 215) కనుగొనవచ్చు. 1969లో పునీత ఆరవ పౌలు పాపుగారు మనకు ఇప్పుడు ఉన్న దివ్యబలిపూజ రూపాన్ని ఆమోదించారు. దీనికి ముందు, కతోలికులు దివ్యబలిపూజను లతీనులో మాత్రమే జరుపుకునేవారు. కతోలికులుగా మనకు అనేకమైన క్రొత్త మరియు విశేషమైన పదాలు మరియు పదబంధాలు కలవు. వీటిని చాలా మంది కతోలికేతరులు అర్థం చేసుకోలేరు. దైవార్చన బలి కోసం లతీను పదం దివ్యబలిపూజను ఆరు లేదా ఏడవ శతాబ్దం నుండి ఉపయోగిస్తున్నారు. ‘సామూహిక సమావేశం’ లేదా ‘సామూహిక ప్రార్థన’ అనేది దీనిని నిర్వచనం కాదు. దీనికి బదులుగా, ఇటే మిస్సా ఎస్ట్ (*ite missa est*) అనే లతీను పూజ ముగింపు సూత్రం నుండి

ఉద్భవించింది: దివ్యబలిపూజ సమాప్తమైనది. వెళ్ళి క్రీస్తు ప్రేమలో సేవలో జీవించండి. లతీను పదం మిస్సా (*missa*) అంటే పంపి వేయడం, యేసుక్రీస్తు తన శిష్యులను ప్రపంచ నలుదిశలా సువార్తను వ్యాప్తి చేయడానికి పంపించడాన్ని సూచిస్తున్నది. ఈ పదం క్రైస్తవులు అందరూ నిర్వహించాల్సిన ప్రేషిత కార్యాన్ని సూచిస్తుంది, అది ఏమన సమాజములోనికి వెళ్లి మన మంచి కార్యాల ద్వారా ఇతరులకు సువార్తను వ్యాప్తి చేయడం. పునీత ఆంబ్రోస్ తన సోదరి మార్సెలినాకు రాసిన లేఖలో దివ్యబలిపూజ అనే పదాన్ని మొదట ఉపయోగించాడు. సుమ్మ థియోలాజియేలో, పునీత థామస్ అక్వినాస్ ఇలా వివరించారు, వెళ్ళు, అది పంపబడింది... మరియు దీని నుండి, దివ్యబలిపూజ అనే పదము నిర్వచింపబడినది. దివ్యబలిపూజ చివరిలో *Ite missa est* అని చెప్పడం ద్వారా ప్రజలంతా ప్రేషిత కార్యానికై 'పంపబడుతున్నారు'.

దివ్యపూజ గ్రంథ సాధారణ నియమావళి (GIRM) ద్వారా దివ్యబలిపూజ యొక్క మొత్తం నిర్మాణం స్పష్టంగా మరియు అందంగా వ్యక్తీకరించబడింది: దివ్యబలిపూజ, దైవవాక్యార్చన, కృతజ్ఞతార్చన అను రెండు భాగములను కలిగియున్నది. ఈ రెండును ఒకే ఒక ఆరాధన క్రమమును రూపొందించు విధముగా ఒక దానితో నొకటి సమ్మేళనమై యున్నవి. ఎందుకన, దివ్యబలిపూజలో క్రీస్తు వాక్కుతోను, శరీరముతోను రూపొందిన దివ్యవిందు నుండి విశ్వాసులు బోధనమును, పోషణను పొందుచున్నారు." దివ్యబలిపూజ విధానమును ప్రారంభించి, ముగించు కొన్ని ప్రత్యేక నియమములు కూడ ఉన్నవి (GIRM, దివ్యపూజ గ్రంథ సాధారణ నియమావళి నెంబరు. 28). క్రైస్తవ విశ్వాస సమాజం పాస్క పరమ రహస్యాన్ని అర్థవంతమైన రీతిలో స్మరించుకునే విధంగా మరియు దేవుని వాక్యాన్ని క్రమబద్ధంగా వినడానికి అవకాశం ఉండే విధంగా సాంగ్యములు ఏర్పాటు చేయబడ్డాయి. ఈ బోధన నిర్మాణం, బోధనా మరియు మత విశ్వాసుల సంక్షేమ సంబంధమైన లక్షణాన్ని కలిగి ఉంది. ఇందులో పాల్గొనే వారికి దేవుని వాక్యాన్ని బోధించడానికి మరియు క్రీస్తు పాస్క పరమ రహస్యాన్ని అర్థం చేసుకోవడానికి మరియు జరుపుకోవడానికి, వారికి ఉపకరిస్తుంది. ఇది దేవుని

ప్రజలు ఒక విశ్వాసుల సమాజంగా కలిసి చేసే బహిరంగ ఆరాధన, దీనిలో దేవుని స్తుతించి మహిమ పరుచుటను మరియు శ్రీసభ విశ్వాసుల శుద్ధీకరణను వివిధ సంకేతాలు మరియు చిహ్నాల ద్వారా జరుగుతాయి (SC 10). కాబట్టి, విశ్వాసులను సంపూర్ణంగా, ఇష్టపూర్తిగా, స్పృహతో, చురుకుగా మరియు చైతన్య వంతముగా దైవర్చనలో పాల్గొనెలా నడిపించడం యాజకుని బాధ్యత. దివ్యబలిపూజ యొక్క విశేష స్వభావాన్ని, దాని మూల అర్థాన్ని మరియు ఉద్దేశ్యాన్ని అర్థం చేసుకోవడం ద్వారా మనకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. పరిశుద్ధ ఫ్రాన్సిస్ పాపుగారు జూన్ 29, 2022వ సంవత్సరంలో దైవ ప్రజల దైవార్చన తర్ఫీదుకు సంబంధించి విడుదల చేసిన అపోస్తలిక అధికార లేఖ ***Desiderio Desideravi***లో సువార్త పరిచర్యను మరియు ఉత్థాన క్రీస్తును అనుభవాన్ని అందించలేని దైవార్చన వేడుక యధార్థమైనదిగా పరిగణించలేము. ఎందుకన అది ఒక మ్రోగెడి కంచుతోను ఘన ఘన లాడెదు తాళముతోను సమానము (1 కొరింతీ 13:1) అని జగద్గురువులు నొక్కి వక్కాణించారు.

దివ్యబలి సంస్కారాన్ని సాక్షాత్తు మన రక్షకుడైన క్రీస్తు ప్రభువే స్థాపించారు. ఆయన అప్పగింపబడునున్న రాత్రి, కడరా భోజన సందర్భంలో, తన శరీర రక్తాలతో దివ్యబలిని స్థాపన చేశారు. సిలువపై తాను సమర్పించిన లోక రక్షణ బలిని తరతరాల వరకు, తాను మరలా వచ్చు వరకు కొనసాగించడానికి వీలుగానే ప్రభువు ఈ దివ్య సంస్కారాన్ని స్థాపించారు. అలాగే- తన మరణ పునరుత్థానాలకు జ్ఞాపికగా ఈ దివ్య సంస్కారాన్ని కొనసాగించే బాధ్యతను తన ప్రియ వధువు శ్రీసభకు అప్పగించారు. విశేష అనుగ్రహాలకు ప్రతీకైన దివ్యబలిపూజను అర్థము చేసుకోవటం ప్రతి ఒక్క కతోలికుని బాధ్యత. దివ్యబలిలో పాల్గొనే క్రైస్తవ విశ్వాసులు అపరిచితులుగానో, మౌన ప్రేక్షకులుగానో ఉండరాదు. వాళ్లు పాల్గొనే దివ్యబలిపూజ యొక్క విశిష్టతను, గొప్పతనాన్ని, ఔన్నత్యాన్ని తెలుసుకోవలెను. దివ్యబలిలోని అంతరార్థాలను తెలుసుకొని భక్తి భావముతో దివ్యబలిలో పాల్గొంటూ, పుణ్య ఫలాలను అందుకోవాలని శ్రీసభ కోరుతుంది. దివ్యబలిపూజలో ప్రతి సాంగ్యమును విశ్వాసులు అర్థం

చేసుకోగలగాలి, అర్థవంతంగా ప్రార్థన చేయగలగాలి, ప్రతి సాంగ్యములోనూ భక్తి ప్రపత్తులతో పాల్గొనగలగాలి అనే ఉద్దేశంతో దివ్యబలిపూజ యొక్క విశిష్టతను తెలియజేస్తూ, ప్రతి సాంగ్యములోని మూల భావాలను వ్యక్తపరుస్తూ పవిత్ర గ్రంథ ఆధారాలతో మా గురు విద్యార్థులు పరిశోధించి, రచించిన వ్యాసాలను ఈ సంచికలో ప్రత్యేకంగా మీకు అందించుచున్నాము. వీరు అపోస్తలుల బోధయందును, వారి సహవాసమందును, రొట్టెను త్రుంచుటయందును, ప్రార్థించుటయందును ఎడతెగక ఉండిరి (అ.చ. 2:42). వీటిని మీరు పఠించుటవలన దివ్యబలిపూజలోని నిగూడార్థాలను గ్రహించగలరు. మీ సందేహాలను నివృత్తి చేసుకొనగలరు మరియు ఇతరుల సందేహాలను నివృత్తి చేయగలరు. మరి ముఖ్యంగా దివ్యబలిపూజలో మరింత శ్రద్ధగా పాల్గొని, దేవునితో మీ సంబంధాలను పటిష్ట పరుచుకొని ఆ దేవునికి ప్రియమైన బిడ్డలుగా జీవించగలరు.

ప్రభూ సేవలో.....

**ఫాదర్ మెడంకి ఆనంద్ ఆంద్రు**

సంచిక సంపాదకులు

# 1. ప్రారంభ సాంగ్యము

– బ్రదర్ అలజంగి దీపక్, బ్రదర్ సింగారెడ్డి అనురాగ్,
– బ్రదర్ దొప్పలపుడి రవీంద్ర

## ఉపోద్ఘాతము

దివ్యబలిపూజ అనేది క్రైస్తవ విశ్వాసుల జీవితానికి కేంద్ర బిందువు. దివ్యబలిపూజలోని నిగూఢ అర్థాలను, గొప్పతనాన్ని, ఔన్నత్యాన్ని మన పంచేంద్రియములతో కానీ, మన మేధస్సుతో కానీ, ఎప్పటికీ పరిపూర్ణంగా అర్థం చేసుకోలేనప్పటికీ, మనం ఎల్లప్పుడూ దాని గురించి మరింత తెలుసుకునే ప్రయత్నం చేయవచ్చు. తద్వారా మనం ప్రభువుకు మరియు మన సహోదరులకు దగ్గర అవ్వగలము. దివ్యబలిపూజ ద్వారా ప్రభువుతో, మన పొరుగువారితో మరియు సృష్టి అంతటితో మన ఆధ్యాత్మిక బంధంలో లోతుగా ఎదగగలము.

కతోలికులను దివ్యబలిపూజలో క్రీస్తు ఎక్కడ ఉన్నాడని అడిగినప్పుడు, వారు సాధారణంగా ఇచ్చే సమాధానం "దివ్య సత్ప్రసాదములో". ఇది సరైన సమాధానం అయినప్పటికీ, ఇది అసంపూర్ణ సమాధానం కూడా. వాస్తవానికి, దివ్య పూజ సమయంలో క్రీస్తు నాలుగు విధాలుగా మనతో వాసం చేస్తారు. ఈ వ్యాసములో, మనం దివ్య బలిపూజలోని మనం క్రీస్తును మొట్టమొదటిసారిగా కలుసుకొని అనుభవించే ప్రధాన మార్గముపై దృష్టి సారించుదాం. యేసు తన శిష్యులకు ఇలా వివరించారు: "ఎక్కడ ఇద్దరు లేదా ముగ్గురు నా పేరట కూడుదురో అక్కడ నేను వారి మధ్య ఉన్నాను" (మత్తయి 18:20). దివ్యబలిపూజ యొక్క ప్రారంభ సాంగ్యము వ్యక్తుల సముదాయాన్ని ఒక సంఘంగా ఏర్పరుస్తుంది. మనం దివ్యబలిపూజ ప్రారంభ సాంగ్యమును జరుపుకుంటున్నప్పుడు ఒక సమాజంగా మనల్ని మనం పునర్నిర్మించు కుంటున్నప్పుడు, క్రీస్తు మన మధ్య ఉన్నాడు అనే అంశాన్ని మనం గుర్తించాలి.

నేటి విశ్వాసుల సంఘంలో అత్యంత నిర్లక్ష్యం చేయబడుతున్న సాంగ్యము, ఈ ప్రారంభ సాంగ్యమే. ఈ సాంగ్యములోని గొప్పతనాన్ని విశ్వాసులు గ్రహించక, ఈ సాంగ్యము మధ్యలో కానీ లేదా ఈ సాంగ్యము ముగిసిన తర్వాత కాని దివ్యబలిపూజలో పాల్గొను విశ్వాసుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతున్నది. కావున ఈ వ్యాసము ద్వారా ప్రారంభ సాంగ్యపు ఔన్నత్యాన్ని, గొప్పతనాన్ని, నిగూఢ అర్ధాన్ని, దైవ గ్రంథ ఆధారాలను తెలుసుకొన ప్రయత్నం చేద్దాం. తెలుసుకొని మన జీవితాలకు అన్వయింప చేసుకుందాం.

## 1. ప్రారంభ సాంగ్యము యొక్క ఉద్దేశము

దివ్యబలిపూజలోని ప్రారంభ సాంగ్యము యొక్క ముఖ్య ఉద్దేశము: ఒకటిగా సమావేశమైన విశ్వాసులను దేవుని వాక్యము వినుటకు, యోగ్యముగా దివ్య బలిపూజను కొనియాడుటకు వారిని సంసిద్ధ పరచుటయే. ఇదియే ఈ సాంగ్యము యొక్క ప్రధాన ఉద్దేశం.

దైవ వాక్యార్చనకు ముందుగా ప్రారంభ సాంగ్యము వచ్చును. దీనిలోని భాగములు: ప్రవేశము, శుభ వచనములు, పశ్చాతాప క్రియ, ప్రభువా దయ చూపుము, మహిమ గీతము, సంఘ ప్రార్థన ఇవన్నీ పూజకు ప్రారంభముగాను, ఉపోద్ఘాతముగాను దోహదపడుచున్నవి.

## *1.1 Populo Congregatio*

*"Populo Congregatio"* అంటే ప్రజలు సమావేశమైన తర్వాత అని అర్థం. దేవుని స్వంత ప్రజలుగా ఉండటానికి సమావేశమై దేవాలయానికి వచ్చే విశ్వాసులందరూ ఒకటిగా ఐక్యమవుతారు అనే భావాన్ని ఈ పదం వ్యక్తపరుస్తుంది (1 పేతురు 2:9-10): "ఎందుకంటే ఇద్దరు లేదా ముగ్గురు నా నామంలో ఎక్కడ సమావేశమవుతారో, అక్కడ నేను వారి మధ్యలో ఉంటాను" (మత్తయి 18:20). దివ్యబలిపూజలో జరిగే మొదటి చర్య: దేవుని ఆహ్వానము యొక్క మొదటి ప్రతిస్పందన "సమావేశం అవడం". ఈ సమావేశాన్ని మొదటి శతాబ్దంలో విమోచించబడిన శ్రీసభ యొక్క ముఖచిత్రంగా చూడవచ్చు, ఇది ఒక రొట్టెగా మారిన అనేక గోధుమ గింజలను సూచిస్తుంది.

### 1.1.1 దివ్యబలిపూజకు సమావేశమైన విశ్వాసుల స్వభావం

దివ్యబలిపూజకు హాజరయ్యే విశ్వాసుల స్వభావాలు చాలా వైవిధ్యంగా ఉంటాయి. జీవితంలోని విభిన్న వర్గాలకు, అనుభవాలకు, సమాజంలోని వివిధ స్థాయిలకు చెందిన, వివిధ రకాల వ్యక్తులు ఒకే ఉద్దేశ్యంతో దేవాలయానికి వస్తారు. ఆ ఉద్దేశమే దేవుని ఆరాధించడం. దివ్యపూజాబలిలో, ఈ సమావేశం వైవిధ్యాన్ని సూచిస్తుంది. దివ్యబలిపూజలో పాల్గొనడానికి వచ్చిన ప్రజలు వివిధ జీవిత పరిస్థితుల నుండి వస్తారు. అందులో ధనికులు, బీదవారు, విద్యావంతులు, అంతగా చదువు రానివారు, ఆరోగ్యవంతులు, అనారోగ్యవంతులు, మానసికంగా ఆరోగ్యవంతులు, మానసికంగా కృంగిపోయిన వారు, పెద్దలు, పిల్లలు, స్త్రీలు, పురుషులు, యువకులు, యువతులు ఇలా ఎందరో దివ్యబలిపూజలో పాల్గొంటారు. ఇలా ఆరాధనలో పాల్గొనే ప్రతి ఒక్కరినీ సోదరులు లేదా సోదరీమణులుగా గుర్తించి స్వీకరించాలి.

పునీత పౌలు గారు తెలియజేస్తున్నట్లు “యూదుడని, అన్యుడని లేదు. బానిసని, స్వతంత్రుడని లేదు. స్త్రీయని, పురుషుడని లేదు. ఏలయన, క్రీస్తు యేసునందు మీరందరును ఒక్కరే” (గలతీ. 3:28) కావున ఈ సమావేశం ప్రభుని కోసం నిలబడటాన్ని సూచిస్తుంది. మనం ప్రభువు కోసం, మరియు ప్రభువు ముందు ఎంత ఎక్కువగా నిలబడతామో, అంత ఎక్కువగా మనం ఒకరితో ఒకరు నిలబడతాము, మరియు ఒకరినొకరు అర్థం చేసుకునే సామర్థ్యాన్ని పెంపొందించుకోగలం. దేవుని పిలుపుకు ప్రతిస్పందనగా మనం కలిసి రావడం, అనేది శ్రీ సభలోని సభ్యులను ఐక్యపరిచే దివ్యబలిపూజ యొక్క సృజనాత్మక శక్తి యొక్క మొదటి అడుగుగా మనం చూడవచ్చు.

### 1.1.2 దివ్యబలిపూజ–సమష్టి సంఘ ఆరాధన

దివ్యబలిపూజ అనేది ఒక వ్యక్తిగత కార్యక్రమం కాదు కానీ, ఇది సంఘ ఆరాధన. మనం దివ్యబలిపూజ కోసం సమావేశమైనప్పుడు, మనమందరం ప్రభువు విందులో దేవుని కుటుంబంగా కలిసి ఉన్నామని మన విశ్వాసం మనకు చెబుతుంది. ఇక్కడ యేసు స్వయంగా తన వాక్కుతో మరియు తన శరీరంతో మనల్ని పోషిస్తున్నారు. మనం దేవాలయానికి మన స్వంత పని

చేయడానికి కాదు, దేవుని పని చేయడానికి వస్తాము. మనం వ్యక్తులుగా కాకుండా, మరణాంతర విందును ఆశించే ఒకే విశ్వాసుల సంఘంగా రక్షింపబడతాము. కావున వ్యక్తిగతమైన భక్తి కృత్యాలకు దివ్యబలిపూజలో స్వస్తి పలుకవలెను, ఒకే సంఘముగా ప్రార్థింపవలెను.

## 2. ప్రవేశ గీతం లేదా ప్రవేశ వచనము

దివ్యబలిపూజలో మరియు దైవార్చనలో, సంగీతం మరి ముఖ్యంగా పవిత్ర గీతాలు, కీర్తనలు, అంతర్భాగమని శ్రీసభ బోధిస్తుంది. ప్రవేశ గీతం అనేది తండ్రి తన ఏకైక కుమారుడిని పంపినందుకు కృతజ్ఞతా గీతముగా ఉంటూ ఉన్నది.

### 2.1. ఉద్దేశం

దివ్యపూజను ప్రారంభించుటకును, అక్కడ చేరిన విశ్వాసుల ఐక్యమును బలపరచుటకును, పవిత్ర సాంగ్యపు నిజ స్వభావమును పరిచయం చేయుటకును, యాజకుడు సహాయకులతో కలిసి వెళ్ళు ప్రదక్షణకు, అర్థమును ఇచ్చుటకును, ఈ ప్రవేశ గీతము లేదా వచనము ఉద్దేశింపబడినది (ది.గ్ర.సా.ని నెం. 47)

ప్రవేశ గీతాన్ని, ప్రభువును ఆరాధించుటకు దేవాలయానికి వెళ్లే విశ్వాసుల ఏకీకృత గీతముగా మనం చూడవచ్చు, కీర్తనకారుడు కీర్తన 100:4 ఈ విధంగా సెలవిస్తున్నారు: "కృతజ్ఞతా స్తుతులతో ఆయన మందిర ద్వారమున ప్రవేశింపుడు. స్తుతిగీతములతో అడుగిడుడు. ఆయనకు వందనములు అర్పింపుడు".

### 2.2 ప్రవేశ గీతము యొక్క వ్యవధి

ప్రవేశ గీతము లేదా వచనము యొక్క వ్యవధి కొన్నిసార్లు గందరగోళానికి కారణం కావచ్చు. కొందరు రెండు పేరాలు కంటే ఎక్కువ పాడకూడదనే అభిప్రాయాన్ని కలిగి ఉంటారు, మరికొందరు ప్రవేశ గీతము యాజకుడు ప్రదక్షణగా బలిపీఠమును సమీపించి ప్రధాన ఆసనమును చేరుకొనగానే ఆగిపోవాలని భావిస్తారు. ఇక్కడ మనం తెలుసుకోవాల్సిన అంశం ఏంటంటే ఎప్పుడు ఆపాలి అనేది కాదు, పాట యొక్క ఉద్దేశం మరియు దానిని ఎలా

సాధించాలి. ఒక మంచి ఉద్దేశమును గల గీతమును మధ్యలో ఆపడం మంచిది – కాదు; తండ్రి మరియు కుమారునికి చరణాలు పాడిన తర్వాత త్రిత్వైక గీతమును ముగించలేము. అది అంత సమంజసం కాదు. కావున గీతం యొక్క ఉద్దేశము నెరవేరునంతవరకు దానిని పాడవలెను. పాడటం అనేది ఆచారం మరియు ప్రార్థనలోని భాగము . ప్రదక్షణగా రాకపోయినా దానికి ఒక విలువ ఉంటుంది.

## 2.3 దివ్యపూజ గీతమును ఎందుకు సమష్టిగా పాడవలెను

సమష్టిగా పాడటం అనేది ఐక్యతను సూచించే విషయం. భక్తి గీతమును అందరూ హృదయపూర్వకంగా పాడగలిగినప్పుడు, అది హాజరైన విశ్వాసుల ఏకీకృత కార్యమును వెల్లడిస్తుంది. అందరికీ బాగా తెలిసిన భక్తి గీతం హృదయపూర్వకంగా, ఉత్తమంగా ఉచ్ఛరించబడుతుంది. దేవునితో మన సాన్నిహిత్యాన్ని పెంచుతుంది.

### ముఖ్య గమనిక

స్వరకర్తలకు మరియు గాయకులకు నిజమైన దైవార్చన శిక్షణ ఇవ్వాలి. గాయక బృందం మాత్రమే పాడితే, అది విశ్వాసుల సామూహిక స్ఫూర్తిని దెబ్బతీస్తుంది. గాయక బృందం ఒంటరిగా ప్రవేశ గీతాన్ని పాడినప్పుడు, ఆ గానం ప్రజల ఐక్యతను పెంచడంలో విఫలమవుతుంది. వారు ఒంటరిగా పాడినప్పుడు, విశ్వాసుల సమాజం మినహాయించబడుతుంది మరియు సామూహిక భాగస్వామ్యం తగ్గుతుంది. ప్రవేశ గీతం పాడని యెడల, ప్రవేశ వచనము చదవవలెను. ఎట్టి పరిస్థితుల్లోనూ విశ్వాసుల సమూహానికి నిశ్శబ్ద శ్రోతల పాత్రను కేటాయింప వలదు. అందరికీ వచ్చిన పాటలు, వేదాంతపరంగా తప్పులు లేని పాటలు, దేవునికి మహిమను చేకూర్చే పాటలను దివ్యబలిలో గానము చేయుట సమంజసము.

## 3. ప్రదక్షణ

దివ్యబలిపూజ ప్రదక్షణతో ప్రారంభమవుతుంది. ఈ ప్రదక్షణ, దేవుని ప్రజలు అనగా క్రీస్తు యొక్క ఆధ్యాత్మిక శరీరమైన విశ్వాసుల సమావేశాన్ని పూర్తి చేస్తుంది. విశ్వాసులు దేవాలయానికి చేరుకుని తమ స్థానాలను

స్వీకరించడంతో ఇది ఇప్పటికే ప్రారంభమైంది. ఈ ప్రదక్షణ యెరూసలేంలోకి యేసు విజయవంతమైన ప్రవేశాన్ని సూచిస్తుంది. "దేవుడు మన దగ్గర ఉన్నాడు" అనే పుస్తకంలో పాపుగారు బెనెడిక్ట్ XVI మాటలలో, మనం ఈ ప్రదక్షణ ప్రక్రియలో మాత్రమే ప్రభువు వద్దకు చేరుకొనగలము. ముందుకు కదిలే మరియు కొనసాగే ఈ ప్రదక్షిణ, మన స్వంత పక్షపాతాలను, మన పరిమితులను, మన అడ్డంకులను అధిగమించి, మనం ముందుకు సాగడాన్ని, ఆయన వైపు వెళ్లడాన్ని మరియు మనం ప్రతి ఒక్కరినీ కలుసుకోవడాన్ని సూచిస్తుంది.

ప్రదక్షణ, ముఖ్యముగా విశ్వాసులందరూ ఒకచోట చేరడాన్ని సూచిస్తుంది– అందరూ దైవారాధనకై ఆహ్వానించబడ్డారు మరియు మనం జరుపుకున్న పరమ రహస్యమును జీవించడానికి, ఆరాధన నుండి పంపబడటాన్ని ప్రదక్షణ సూచిస్తుంది. ప్రదక్షణ యాజకునికి గొప్పతనాన్ని చేకూర్చటానికి ఏర్పాటు చేయబడలేదు. కానీ ప్రదక్షణలో ప్రథమ మరియు సంపూర్ణ ప్రాధాన్యత క్రీస్తుకు చిహ్నామైన బలిపీఠం పైనే ఉంటుంది అని మనం గ్రహించాలి.

ఈ ప్రదక్షణ, దైవార్చనలోని ఇతర భాగాల మాదిరిగానే, ప్రతీకాత్మక, చిహ్నాత్మకమైనది. ఇది కతోలిక ఆచార్య కార్యము యొక్క ప్రార్థనా స్వభావాన్ని బయటకు తీసుకురావాలి. పాట మరియు ప్రదక్షణ రెండూ ఒకే విధంగా ఉండాలి. ఊరేగింపు క్రమబద్ధంగా ఉంటుంది, దివ్య పూజ సహాయకులు, పాఠకుడు, అర్చనావసర సహాయకుడు, ఉప గురువు మరియు యాజకులు వారి ప్రత్యేక పాత్రల ప్రకారం వారి ప్రత్యేక స్థానాలను తీసుకుంటారు. ప్రదక్షణ, మనకు విశ్వాసుల సమాజం ప్రార్ధనా వేడుకకు తీసుకువచ్చే వివిధ రకాల బహుమతులను గుర్తు చేయాలి: "సేవలు అనేక పద్ధతులలో జరుగుచున్నవి. కానీ సేవలను అందుకొను ప్రభువు ఒక్కడే" 1 కొరింతీ 12:5 మరియు జ్ఞానస్నానం ద్వారా పొందిన పరిచారక మరియు సాధారణ యాజకత్వాన్ని మనం ఉపయోగించడానికి పిలువబడ్డాం. ప్రవేశ ప్రదక్షణలో సిలువ మరియు ధూపం మోస్తున్న పరిచారకులు, సిలువ చుట్టూ క్రొవ్వొత్తులను మోసే దీపదారులు, ఉప గురువు చేత మోసుకెళ్ళబడే సువార్తల గ్రంథము, లేదా

ఉప గురువు లేనప్పుడు, ఒక పాఠకుడు సువార్తల గ్రంథమును తీసుకెళ్లవలెను (ది.గ్ర.సా.ని నెం.120). ప్రవేశ ప్రదక్షణను అర్థం చేసుకోవడానికి ఒక అద్భుతమైన మార్గం, దానిని కవాతుతో, విజయ యాత్రతో పోల్చడం. ప్రార్థనా ఊరేగింపు ఒక రకమైన కవాతు: కవాతు (ఇక్కడ ప్రదక్షణ) చేసే వ్యక్తులు తమ పాదాలు ఆధ్యాత్మిక పనిలో నిమగ్నమై ఉన్నాయని మరియు విశ్వాసంతో చేసినప్పుడు వారి నడక అతీంద్రియమని తెలుసుకుంటారు. కీర్తనకర్త కీర్తన 122:1లో ఇలా అంటున్నాడు, “మనము ప్రభువు మందిరమునకు వెళ్ళుదము అని జనులు పలుకగా నేను ఆనందము చెందితిని”. అందరూ ప్రదక్షణలో నడవకపోవచ్చు, కానీ మనలో ప్రతి ఒక్కరూ మన ఉనికి, మన శ్రద్ధ మరియు ప్రదక్షణతో పాటు వచ్చే విజయోత్సవ పాటలో పాల్గొనడం ద్వారా – ఈ విజయ యాత్రలో భాగస్తులము అవుతున్నాము.

### 3.3.1 దివ్యబలిపూజ పరిచారకులు మరియు వారి యొక్క కార్యాలు, ప్రాముఖ్యతలు

#### ఎ) ధూప కలశమును పట్టు పరిచారకుడు (Thurifer)

దివ్యబలిపూజ ప్రదక్షిణలో ధూపమును ఉపయోగించిన ఎడల, ప్రవేశ ప్రదక్షణ ప్రారంభమగుటకు ముందు యాజకుడు ధూప పాత్రలో సాంబ్రాణి వేయును కానీ మౌనముగా అట్లు చేయవలెను. అటు తరువాత సాంబ్రాణితో కూడిన ధూప కలశముతో సహాయకుడు ప్రదక్షణ ప్రక్రియను ప్రారంభించును (ది.గ్ర.సా.ని నెం.120). ధూప కలశము నుండి మెల్లగా పైకి లేచే సాంబ్రాణి పొగ మనకు మన ప్రార్థనలు దేవునికి చేరుతున్నాయి అనే అంశాన్ని బోధిస్తున్నాయి. కీర్తనకారుడు చెప్పినట్లుగా, “ఓ ప్రభువా! నా ప్రార్థన సాంబ్రాణి పొగవలెను పైకెత్తిన నా చేతులు సాయంకాలపు బలివలెను నీ సన్నిధిని చేరునుగాక!” కీర్తన 141:2

#### బి) సిలువను మోయు పరిచారకుడు (Cross bearer)

సిలువను పట్టు పరిచారకుడు మనము క్రీస్తు అనుచరులమనే సందేశాన్ని ఇస్తున్నారు. ఒక నగరం విజయం సాధించినప్పుడు ట్రోఫీని ఎగురవేసినట్లే, ఇక్కడ పాపం మరియు మరణంపై అతని విజయాన్ని సూచిస్తూ చిహ్నాత్మకంగా

సిలువ మనకు ఆధ్యాత్మిక సందేశాన్ని ఇస్తుంది. ప్రారంభ ప్రదక్షణ అనేది దివ్య పూజ యొక్క విజయ కవాతు. ఒక పరిచారకుడు సిలువను ఎత్తులో పట్టుకొని ప్రదక్షణను నడిపిస్తారు మరియు యేసు యొక్క నిస్వార్థ ప్రేమ చర్య పై మనల్ని దృష్టి సారించామని ఆహ్వానం పలుకుతున్నారు.

## సి) దీపదారి (Candle bearer)

క్రొవ్వొత్తులను పరిచారకులు ప్రదక్షణలు పట్టుకుంటారు. క్రొవ్వొత్తులు మన ఆధ్యాత్మిక మార్గాన్ని వెలిగించడాన్ని సూచిస్తాయి, తద్వారా మన మధ్యలో మరియు మనతో సమావేశమైన వారిలో యేసు ఉనికిని గుర్తించగలము అనే సందేశాన్ని ఇస్తున్నాయి.

## డి) పీఠపు పరిచారకుడు (Acolyte) (ది.గ్ర.సా.ని నెం.188)

బలిపీఠానికి ప్రదక్షణగా వెళ్లే సమయంలో పీఠపు పరిచారకుడు సిలువను మోయవచ్చు. ఆ సందర్భంలో వెలిగించిన క్రొవ్వొత్తులతో రెండు సేవకుల మధ్య నడుస్తాడు. అతను బలిపీఠం చేరుకున్నప్పుడు, అతను శిలువను బలిపీఠానికి దగ్గర నిటారుగా క్రమపరుచును, తద్వారా అది బలిపీఠ శిలువగా పనిచేస్తుంది. లేకపోతే, అతను దానిని గౌరవప్రదమైన ప్రదేశంలో ఉంచెదరు. అప్పుడు అతను గర్భగుడిలో తన పరిచారక స్థానాన్ని స్వీకరించెదరు.

## ఈ) పాఠకుడు (Lector)

బలిపీఠానికి ప్రదక్షణగా వచ్చినప్పుడు, ఉప గురువు లేని ఎడల, పాఠకుడు తనకు అనుమతింపబడిన వస్త్రములు ధరించి, సువార్త గ్రంథమును, కొంచెం పైకెత్తి పట్టుకొని నడుచును. సువార్త గ్రంథమును తీసుకొని పోవునప్పుడు పాఠకుడు యాజకునకు ముందుగా నడుచును లేనియెడల ఇతర సహాయకులతో కలసి వెల్లును. (ది.గ్ర.సా.ని నెం.194), సువార్త గ్రంథమును ఒక పాఠకుడు లేదా ఉప గురువు భక్తితో తీసుకువెళతాడు, ఇది మనకు దేవుని వాక్కును మనం స్వీకరించగలిగేలా, మన మనస్సులను లగ్నము చేసుకోవడానికి గుర్తుగా నిలుస్తుంది. బలిపీఠం వద్దకు చేరుకున్న తర్వాత, పాఠకుడు ఇతరులతో కలిసి నమస్కరిస్తాడు. సువార్త గ్రంథాన్ని మోస్తున్న పాఠకుడు బలిపీఠం వద్దకు వెళ్లి, దానిపై సువార్త గ్రంథమును ఉంచెదరు. అప్పుడు అతను గర్భగుడిలో తన పరిచారక స్థానాన్ని స్వీకరించెదరు. (ది.గ్ర.సా.ని నెం.195)

### ఎఫ్) యాజకుడు (Priest)

యాజకుడు, సమావేశ నాయకుడు కాబట్టి, క్రీస్తు నామమున సమావేశమైన వారందరి ఐక్యతకు సూచికగా ఉంటూ ఉన్నారు. బలిపీఠము వైపు ప్రదక్షణ నెమ్మదిగా కదలిక మనకు, మనమందరం కలిసి ఈ విశ్వాస ప్రయాణంలో ఉన్నామని, ప్రభువు వైపు కదులుతున్నామని గుర్తు చేస్తుంది.

### 3.3.2 ప్రదక్షణలో సిలువ వేయబడిన క్రీస్తు స్వరూపము (Crucifix) యొక్క ప్రాముఖ్యత

యేసు "రక్షణ నాయకుడు" అని సిలువ వేయబడిన క్రీస్తు స్వరూపము (హీబ్రూ 2:10) మనకు చిహ్నాత్మకంగా తెలియజేస్తుంది. సిలువ వేయబడిన క్రీస్తు ఉన్న సిలువ మనకు క్రీస్తు పాస్కా పరమ రహస్యాన్ని చిహ్నాత్మకంగా గుర్తు చేస్తుంది. బలిపీఠంపై ఉన్న సిలువను ఉంచే సందర్భంలో, అన్ని దైవార్చన పత్రాలు శిలువ వేయబడిన క్రీస్తు స్వరూపముతో ఉన్న సిలువను గురించి మాట్లాడుతాయి కానీ, మహిమాన్వితమైన క్రీస్తు గురించి కాదు. కొంతమంది కతోలికేతరులు, పునరుత్థానం చేయబడిన యేసును నమ్ముతున్నాము అని తెలుపుతూ, క్రీస్తు దేహము లేని ఖాళీ సిలువను ఉపయోగించవలెనని చెబుతారు. పునరుత్థానాన్ని సూచించేది ఖాళీ సిలువ కాదు, ఖాళీ సమాధి. సిలువపై క్రీస్తు శరీరం: క్రీస్తు మనుష్యావతారాన్ని మరియు అతని బల్యార్పణను, త్యాగాన్ని నొక్కి చెబుతుంది.

### 3.3.3 సువార్తల గ్రంథమును ప్రదక్షణలో తీసుకు వెళ్ళవలెనే కానీ దైవార్చన పఠన గ్రంథమును కాదు

సువార్తల గ్రంథము అనేది దివ్యబలిపూజ సమయంలో చదవడానికి సువార్త నుండి భాగాలను కలిగి ఉన్న పుస్తకం. ఈ పుస్తకాన్ని ఉప గురువు లేదా పాఠకుడు ప్రవేశ ప్రదక్షణ సమయంలో తీసుకువస్తారు మరియు గర్భగుడి చేరుకున్న తర్వాత, దానిని బలిపీఠం మధ్య భాగంలో ఉంచుతారు. సువార్తల గ్రంథాన్ని మోసుకెళ్లడం: క్రీస్తు తన వాక్కు రూపంలో వస్తున్నాడని మనకు పరోక్షంగా చెబుతుంది. సువార్తల గ్రంథాన్ని బలిపీఠంపై ఉంచడానికి రెండు కారణాలు ఉన్నాయి. మొదటిది, దైవ వాక్యార్చన మరియు కృతజ్ఞత అర్చన

మధ్య ఉన్న విడదీయరాని ఐక్యతకు స్థానం సూచిస్తూ, ఈ రెండును ఒకే ఒక్క ఆరాధన క్రమంలో రూపొందించే విధముగా ఒకదానితో ఒకటి సమ్మేళనమై ఉన్నవి అని చెబుతుంది (ది.గ్ర.సా.ని నెం. 28). రెండవది, సువార్తల గ్రంథము బలిపీఠం నుండి వాక్య ప్రకటన స్థలానికి తీసుకెళ్లినప్పుడు, వాక్య ప్రకటన క్రీస్తు నుండి వచ్చిందని స్పష్టంగా తెలుస్తుంది, ఎందుకనగా బలిపీఠము క్రీస్తునకు చిహ్నముగా ఉన్నది.

## 4. బలిపీఠం

### 4.1 బలిపీఠం యొక్క చరిత్ర

బలిపీఠం దైవార్చన యొక్క తొలి అంశాలలో ఒకటి. ఇది కడరాత్రి భోజనము యొక్క బల్ల అనే అంశం నుండి తీసుకోబడింది (మత్తయి 26:17-29, మార్కు 14:12-25 మరియు లూకా 22:7-38). క్రైస్తవ మతం చట్టవిరుద్ధం అని, సమాజం చూసిన ఆదిమ సంవత్సరాల్లో, విశ్వాసుల ఇళ్లలో క్రీస్తు శరీర రక్తాల పరమ రహస్యాన్ని జరుపుకునేవారు. మొదటి తరం క్రైస్తవులందరు కలసి ఒకే సంఘముగా భోజనం *(Agape meal)* మరియు క్రీస్తు శరీర రక్తాల పరమ రహస్యాన్ని ఒకే బల్లపై (అపో.కా. 10-11:18) నిర్వహించేవారు. తరువాత, క్రీస్తు శరీర రక్తాల పరమ రహస్యం, ఆదిమ సంఘ భోజనం నుండి వేరు చేయబడినప్పుడు, బల్ల రూపాన్ని చివరి భోజన జ్ఞాపకార్థం అలాగే ఉంచబడింది. మూడవ శతాబ్దం చివరి భాగంలో, శాశ్వత బల్ల ఏర్పాటు చేయబడింది మరియు బలిపీఠం యొక్క పవిత్ర ప్రాముఖ్యత పెరగడం ప్రారంభమైంది.

### 4.2 దైవార్చన అభినయములు (దైవార్చన భంగిమలు)

యాజకుడు మరియు పరిచారకులు బలిపీఠం వద్దకు చేరుకున్నప్పుడు, బలిపీఠానికి ప్రణామము చేసెదరు (ది.గ్ర.సా.ని నెం. 122). అప్పుడు, యాజకుడు మరియు ఉప గురువు బలిపీఠాన్ని ముద్దు పెట్టుకుంటారు, మనం ఒకే బల్ల చుట్టూ గుమిగూడామని మనకు గుర్తు చేస్తారు. యాజకుడు బలిపీఠాన్ని ముద్దు పెట్టుకుంటాడు ఎందుకంటే అది క్రీస్తు శరీరాన్ని సూచిస్తుంది (ది.గ్ర.సా.ని నెం. 49).

## 4.3 బలిపీఠం యొక్క ప్రాముఖ్యత

జగద్గురువు పునీత సిల్వెస్టర్ (314-335) రాతి బలిపీఠాలను ఉపయోగింపవలెనని చట్టం చేసిన మొదటి జగద్గురువుగా చరిత్ర తెలియజేస్తుంది. సెయింట్ జాన్ క్రిసోస్టమ్ బలిపీఠమును ఉద్దేశించి ఒక అద్భుత తాత్పర్యాన్ని తెలియజేసి ఉన్నారు: సహజ సిద్ధంగా, ఇది ఒక్క రాయి, కానీ ఇది క్రీస్తు శరీరాన్ని స్వీకరించినప్పుడు దీనికి పవిత్రత సంతరించుకుంటుంది. ఈ మెన్సా *(mensa)* (రోమన్ కతోలిక దేవాలయాల్లో బలిపీఠం పైభాగాన్ని ఏర్పరిచే చదునైన రాయి), దేవాలయ అంకిత సమయంలో అభిషేకించబడుతుంది, ఇది క్రీస్తు శరీరం. అతని మరణానికి ముందు మరియు మరణానికి తర్వాత తైలముతో అభిషేకింపబడటాన్ని సూచిస్తుంది. ఇది పవిత్ర వస్తువు కాబట్టి, మనము బలిపీఠానికి ధూపం వేస్తాము. బలిపీఠము క్రీస్తును సూచించినట్లే, ఈ రాతి పదార్థం "క్రీస్తు యేసు మూల రాయి" (ఎఫెసీ. 2:20) మరియు "నిర్మాణదారులు నిరూపయోగ అయినదిగా తిరస్కరించిన రాయిని సూచిస్తూ, ఇది ఏ మూలస్తంభంగా, మూలరాయిగా మారింది" (1 పేతురు 2:4) అనే అంశాన్ని తెలియ చేస్తుంది. అలెగ్జాండ్రియాకు చెందిన సిరిల్, క్రీస్తు తాను చేసిన బలి అర్పణానికి అతడే "యాజకుడు. బలిపీఠం, మరియు గొర్రెపిల్ల" అని తెలియపరిచారు. లియోన్స్‌కు చెందిన ఇరేనియస్ ఇలా అన్నాడు: ఏసుప్రభువే బలి వస్తువు, ఆయనయే సమర్పణము, ఆయనయే యాజకుడు, ఆయనే బలిపీఠం.

## 4.4 బలిపీఠం పై అవశేషాలను పొందుపరిచే ఆచారం

ఆదిమ శ్రీసభ సాంప్రదాయంలో వేద సాక్షుల యొక్క సమాధుల పై సామూహిక ప్రార్థన జరుపుకునేవారు. ఇదే, బలిపీఠ రాయి పై వేద సాక్షులు మరియు పునీతుల అవశేషాలను పొందుపరిచే ఆచారానికి దారితీసింది. మెన్సా *(mensa)* లేదా బలిపీఠపు రాతి పై, పునీతుల అవశేషాలను పొందు పరిచి, వేద సాక్షుల సమాధుల మీద జరిగిన సామూహిక ప్రార్థన ప్రారంభ సంప్రదాయాన్ని అనుసరిస్తుంది.

## 5. బలిపీఠం నుండి ప్రధానార్చుకుని ఆసనము వరకు

దివ్యబలిపూజ ఘనముగా ప్రదక్షణ నుండి ప్రారంభమవుతుంది. బలిపీఠం చేరుకున్న తర్వాత, యాజకుడు వంగి నమస్కరించి, బలిపీఠాన్ని ముద్దు పెట్టుకుంటాడు మరియు దానికి ధూపం వేస్తాడు, బలిపీఠం క్రీస్తునకు సాదృశ్యముగా ఉన్నది. తరచుగా, బలిపీఠము వేద సాక్షులు లేదా పునీతుల అవశేషాలను కలిగి ఉంటుంది.

అటు తర్వాత, యాజకుడు ప్రధానాసనము వద్దకు వెళ్తాడు, ఇది ప్రార్ధనా సమావేశానికి అధ్యక్షత వహించే అతని పాత్రను సూచిస్తుంది. విశ్వాస సమాజానికి ఎదురుగా ఆదర్శంగా ఉంచబడిన కుర్చీ, సింహాసనంలా కనిపించకుండా ఉండాలి. ఇది ఆధిపత్యానికి కాదు, సేవ మరియు నాయకత్వానికి సంకేతం.

### 5.1 బలిపీఠం: క్రీస్తు ఉనికి మరియు త్యాగానికి చిహ్నం

క్రీస్తు త్యాగానికి చిహ్నం: బలిపీఠం యేసు సిలువపై త్యాగాన్ని మరియు చివరి భోజనాన్ని గుర్తుచేస్తుంది. ఇది దివ్యబలిపూజకు కేంద్రంగా మారుతుంది. ఒక పునీతుని అవశేషం: వేద సాక్షులను గౌరవిస్తుంది మరియు వారి త్యాగాన్ని క్రీస్తుతో అనుసంధానిస్తుంది. ఒకప్పుడు వేదసాక్షులు సమాధులపై పూజలు జరిగేవి.

### 5.2 బలిపీఠానికి ధూపము వేయుట

బలిపీఠానికి ధూపము వేయడాన్ని ప్రార్ధన మరియు భక్తికి చిహ్నంగా చూడవచ్చు, దీనికి లేఖనాలు మద్దతు ఇస్తున్నాయి (కీర్తనలు 140:2; దర్శన 8:3). దివ్యబలిపూజ యొక్క సాధారణ సూచన (ది.గ్ర.సా.ని నెం. 276) మనము దివ్యపూజలో ధూపం వేయగల ఐదు సమయాలను వివరిస్తుంది: ప్రవేశద్వారం వద్ద, బలిపీఠం, సువార్త, అర్పణల తయారీ మరియు పవిత్రీకరణ సమయంలో ఎత్తి ఉన్నప్పుడు. బలిపీఠం మరియు సిలువ ప్రత్యేక సంజ్ఞలతో ధూపం వేయబడతాయి మరియు యాజకుడు ధూపం వేయడానికి ముందు మరియు తరువాత నమస్కరిస్తాడు, బలిపీఠం లేదా అర్పణలను ధూపం వేసేటప్పుడు తప్ప. ఈ పవిత్ర ఆచారం దేవునికి ప్రార్థనలు చేరడానికి సాదృశ్యంగా ఉంది.

## 6. సిలువ యొక్క సంకేతం: ప్రార్థన మరియు అర్థం

ఈ సంజ్ఞ త్రిత్వైక సర్వేశ్వరుని మరియు సిలువ యొక్క పవిత్ర చిహ్నం. ఇది క్రైస్తవుడి గుర్తింపును సూచిస్తుంది. ఇది బాప్టిజం, క్రీస్తు మరణం ద్వారా మోక్షం మరియు దేవుని శాశ్వత ఉనికిని గుర్తు చేస్తుంది.

పెద్ద సిలువ సంజ్ఞ: నుదిటి, ఛాతీ మరియు భుజాలపై వేయబడుతుంది. చిన్న సిలువ సంజ్ఞ: సువార్తకు ముందు నుదిటి, పెదవులు మరియు హృదయంపై వేయబడుతుంది.

వేదాంతపరంగా, ఇది త్రిత్వైక సర్వేశ్వరునిపై విశ్వాసాన్ని ధృవీకరిస్తుంది మరియు క్రీస్తు త్యాగాన్ని గుర్తుచేస్తుంది, విశ్వాసులను చెడు నుండి కాపాడుతుంది' ఆధ్యాత్మిక బలానికి చిహ్నంగా నిలుస్తూ ఉన్నది.

## 7. యాజకుని పరిచయ శుభాకాంక్షలు

యాజకుడు ప్రజలను ఇలా పలుకరిస్తాడు: "ప్రభువు మీతో ఉండునుగాక." ఇది కేవలం లాంఛనప్రాయం కాదు ఇది క్రీస్తు ఉనికిని ప్రకటించడం. క్రీస్తు వ్యక్తిత్వంలో యాజకుని పాత్రను అంగీకరిస్తూ, ప్రజలు "మీ ఆత్మతో ఉండును గాక" అని ప్రతిస్పందిస్తారు. కొన్నిసార్లు ఉపయోగించే పూర్తి శుభాకాంక్షలు – "మన ప్రభువైన యేసుక్రీస్తు కృప..." – లోతైన త్రిత్వవాదం. ఇది ప్రార్థన సమయంలో తండ్రి, కుమారుడు మరియు పరిశుద్ధాత్మ యొక్క సామూహిక పనిని ప్రతిబింబిస్తుంది.

పీఠాధిపతి శుభాకాంక్షలు: ఒక పీఠాధిపతి దివ్య పూజను కొనియాడునపుడు, అతను "మీకు శాంతి కలుగుగాక" అని అంటాడు (యోహాను 20:19). ఇది తన అపోస్తులులకు పునరుత్థానమైన క్రీస్తు శుభాకాంక్షలను ప్రతిధ్వనిస్తుంది. ఇది అపోస్తలుల వారసుడిగా మరియు అతని మేత్రాసనము యొక్క ఆధ్యాత్మిక గొర్రెల కాపరిగా పీఠాధిపతి పాత్రను ప్రతిబింబిస్తుంది.

## 8. దివ్యపూజలో పరిచయ వాక్కులు:

దివ్యపూజ ప్రారంభంలో పరిచయం వాక్కులు విశ్వాసులను స్వాగతించడానికి, ప్రార్థన పై లేదా దివ్య విందుపై దృష్టిని కేంద్రీకరించడానికి మరియు పవిత్ర రహస్యాల కోసం అంతర్గత తయారీని ఆహ్వానించడానికి

ఉపయోగపడుతుంది. ఇది ఐక్యత మరియు చురుకైన భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తుంది, భక్తి మరియు ఆనందం కోసం హృదయాలను సిద్ధం చేస్తుంది.

## 9. దివ్యపూజ ఉద్దేశాలు: అర్థం మరియు అన్వయం

దివ్యపూజ ఏ ఆధ్యాత్మిక ఉద్దేశాలు నిమిత్తం సమర్పింపబడుతుంది: మరణించిన వ్యక్తి, స్వస్థత, కృతజ్ఞత, పుట్టినరోజులు మరియు మరిన్ని. దివ్య పూజ ఉద్దేశాలు విశ్వ శ్రీసభతో ఐక్యంగా చేయబడతాయి. ప్రతి దివ్యపూజ విశ్వాసుల ఉద్దేశాలను క్రీస్తు త్యాగం యొక్క అనంతమైన విలువతో కలుపుతుంది, జీవించి ఉన్నవారికి మరియు చనిపోయినవారికి ప్రయోజనం చేకూరుస్తుంది. ఇది క్రీస్తు యొక్క ఆధ్యాత్మిక శరీరం మరియు శ్రీసభ యొక్క నిరంతర మధ్యవర్తిత్వం యొక్క ఐక్యతను ప్రతిబింబిస్తుంది.

## 10. పశ్చాత్తాప క్రియ

దివ్యపూజ ఒక పవిత్రమైన సంస్కారం. సర్వ మానవాళి పాప పరిహారార్థం క్రీస్తు ప్రభువు తనను తాను తన తండ్రికి అర్పించుకున్నారు. "క్రీస్తు రక్తము వలన మనము విముక్తులమైతిమి" ఎఫెసీ 1:7. దివ్యపూజలో మన పాపాలన్నీ కడిగివేయబడతాయి. అలాంటప్పుడు మరలా ఈ పశ్చాత్తాప క్రమం ఎందుకు ప్రతి దివ్య సంస్కార స్వీకరణ విశ్వాసుల సిద్ధపాటు కోరుకుంటుంది. కనుక పశ్చాత్తాప క్రమము విశ్వాసులను దివ్యపూజలో యోగ్యముగా పాల్గొనడానికి ఉపకరిస్తుంది. ఆదాము అవ్వల అవిధేయత వల్ల పాపము ఈ లోకానికి పరిచయమైంది. పాపము సర్వజనులను ఆవరించింది. దీనినే మనం జన్మ పాపం అంటాం. పాపము వల్ల మనిషి తన పవిత్రతను కోల్పోయాడు కనుక దేవుడు మనిషిగా మన మధ్య పుట్టి మనలను పాపపు కోరల నుండి రక్షించారు.

వేడుక జరిగే ప్రదేశం ఎప్పుడు శుభ్రంగా ఉంటుంది. ఇది మన అనుభవం ద్వారా చూసే ప్రక్రియ. విశ్వాసులుగా మనము దివ్యపూజను ఒక వేడుకగా జరుపుకుంటాం. సంఘము ఒకచోట చేరి దేవుడు సాధించిన విజయాన్ని దివ్యపూజ ద్వారా స్మరణ చేస్తూ ఉంటాం. మరి ఇంత పవిత్రమైన బలిలో పాల్గొనే ముందు విశ్వాసులు కేవలము గుడిని మాత్రమే కాదు, తమ హృదయాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలి. పశ్చాత్తాప క్రమము ద్వారా

ఈ శుభ్రత యోగ్యత విశ్వాసులకు లభిస్తుంది. కాబట్టి అందరూ తమ పాపాలను అంగీకరించాలి. లోగడ అనువాదములు మన పాపములను గుర్తు చేసుకుందాం అనే వాక్యాన్ని వినియోగించారు కానీ ప్రస్తుత అనువాదం మాత్రం మన పాపాలను ఒప్పుకుందాం అను మాటను గురువు పలుకుతాడు. పవిత్రంగా ఉండేవారు ఎప్పుడు కూడా తమ పాపాలను గుర్తించి వాటికోసం పశ్చాత్తాప పడుతుంటారు. కీర్తన 51:5 "నేను పుట్టినప్పటి నుండి పాపాత్ముడనే మా అమ్మ కడుపున పడినప్పటినుండియు హంతకుడునే" కనుక మన పాపాలను గుర్తు చేసుకుందాం అనే వాడుక కన్నా, మన పాపాలను గుర్తించి వాటిని ఒప్పుకుందాం అనే వాక్యములో చాలా అంతరార్థం దాగి ఉంది. కావున యాజకుడు సంఘాన్ని ఏ విధముగా ఆహ్వానిస్తాడు "సహోదరీ సహోదరులారా పవిత్రములైన ఈ పరమ రహస్యములను కొనియాడ యోగ్యులమగుటకు మన పాపములను ఒప్పుకొందుము".

**గమనిక:** మంచి సిద్ధపాటు లేక ఆయత్తము మనలను పాస్కా పరమ రహస్యములో పవిత్రంగా పాల్గొనేటట్లు చేస్తుంది.

## పశ్చాత్తాప క్రమము

రోమీయ క్రమము పశ్చాత్తాప మార్గాన్ని, క్రమాన్ని చక్కగా వివరిస్తుంది. ముందుగా చెప్పినట్లు యాజకుడు విశ్వాసులను తమ పాపాలను ఒప్పుకొనునట్లు ఆహ్వానిస్తారు. దీని తర్వాత కొంత మౌనంగా ఉంటుంది. అటుతరువాత వాడుకలో ఉన్న మూడు విధానాల పశ్చాత్తాప ప్రార్థనలలో ఒకదానిని చెప్తారు. వెనువెంటనే యాజకుడు పాప పరిహార ప్రార్థన చేస్తారు. అప్పుడు విశ్వాసులు ఆమెన్ అంటూ సమాధానం ఇస్తారు.

## 10.1 మొదటి పశ్చాత్తాప ప్రార్థన రూపం

దీనిని లతీను భాషలో కాన్ఫితోర్ అంటారు. మనకు అర్థమయ్యే భాషలో చెప్పాలంటే సర్వశక్తి గల సర్వేశ్వరుని చెంతను అనే ప్రార్థన. తొలినాళ్లలో ఈ ప్రార్థనను కేవలము గురువు మరియు వత్తాసు పిల్లలు మాత్రమే పీఠము వద్ద చెప్పేవారు. అప్పట్లో ఇది కేవలము వ్యక్తిగత ప్రార్థన మాత్రమే సంఘము ఈ ప్రార్థనను జపించేది కాదు. రెండవ వాటికను సభ ఈ ప్రార్థనను అందరు

జపించే వెసులుబాటును కల్పించింది. ఈ ప్రార్ధన రెండు భాగాలుగా ఉంటుంది: 1. పాపాలను అంగీకరించటం 2. క్షమాపణ కొరకు విజ్ఞాపన కోరుకోవడం 1570 రోమీయ క్రమము ప్రకారము యాజకుడు తన పాపాలను దేవుని ముందు మరియ తల్లి, పునీతులు మిఖాయేలు బాప్తిస్మ యోహాను పేతురు పౌలు గార్ల ముందు ఒప్పుకొనుచు ఈ జాబితానంత రెండుసార్లు ప్రస్తావిస్తూ రొమ్ము పై బాదుకొనుచు ఇది నా తప్పు అనేవారు. ప్రస్తుత రోమియ క్రమము ఈ జాబితాను దేవునికి దూతలకి మరియమాతకు పునీతులకు పరిమితం చేసింది. ఇది నా తప్పు అని మూడుసార్లు చెప్పినప్పుడు ఛాతిని మూడుసార్లు బాదుకొన అక్కర్లేదు కానీ మరియమాత నామ ఉచ్ఛరణ సమయములో అందరూ తమ తలలను వంచుతారు (రోమియ క్రమము పుట. 275).

## నేను ఒప్పుకొనుచున్నాను

ఈ ప్రార్ధనను జపించే సమయములో నేను నా పాపములను ఒప్పుకొనుచున్నాను అని ఉంటుంది. మేము ఒప్పుకొనుచున్నాము అని ఉండదు. "నేను" అనే పదం వ్యక్తిగతానికి సంబంధించినది ఎవరు కూడా పక్కన వారి పాపాలను ఒప్పుకొన లేరు కదా! అందుకే నేను నా తప్పును ఒప్పుకొనుచున్నాను అన్నప్పుడు తన అంతరాత్మను ఆలకిస్తూ తను చేసిన పాపాలను మరియు చేయలేని మంచి పనులకు సైతం పశ్చాత్తాప పడతాడు. అందుకే మేముకు బదులుగా నేను నా పాపములను ఒప్పుకొనుచున్నాను అని ప్రార్ధన చేస్తాం.

## 10.2 పశ్చాత్తాప క్రమములో రెండవ రూపము

ఈ క్రమము గురువుకు ప్రజలకు మధ్య సంభాషణ ద్వారా జరుగుతుంది. ఈ రెండవ రూపాన్ని ఎవరు అంతగా వాడరు. ఎందుకంటే, ఒకటి మరియు మూడు రూపాలు ఎక్కువగా వాడుకలో ఉన్నాయి కాబట్టి చాలామంది విశ్వాసులకు ఈ రెండవ రూపము తెలియదు అనటంలో అతిశయోక్తి లేదు ఈ రెండవ రూపంలో సంభాషణ ఈ విధంగా ఉంటుంది.

**గురువు:** ప్రభువా మాపై దయచూపుము

**ప్రజలు:** ఏలయన మేము నీకు ద్రోహం చేసితిమి

**గురువు:** ప్రభువా నీ దయను మాకు చూపుము

**ప్రజలు:** నీ రక్షణమును మాకు అనుగ్రహింపుము

**గమనిక:** ఇది రెండింటినీ కలిగి ఉంది. దోషభావన (Guilt) మరియు కరుణను యాచించడం (Plea for mercy) మొదటి భాగం బారూకు 3:2లో బబులోనియనులు బంధించబడిన ప్రజల పశ్చాత్తాపాత్మక భావనను ప్రస్తావించబడింది. రెండవ భాగం కీర్తనలు 85:7 ఆధారంగా ఉంది.

## 10.3 పశ్చాత్తాప క్రమంలో మూడవ రూపము

ఈ మూడవ విధానంలోపశ్చాత్తాప కర్మ యొక్క రూపం అనేది తప్పుల ఒప్పుకోలు సామూహికంగానో వ్యక్తిగతంగానో కాదుగాని, క్రీస్తు యొక్క శక్తి పాపాల నుండి మమ్మల్ని రక్షించే విధానాలను గుర్తుచేసే ప్రార్ధనల సమాహారమే. అందువల్ల, మనము మన పాపాలను లేక బలహీనతలను గూర్చిన జాబితాలు ఇవ్వము. కానీ, క్రీస్తు రక్షణ చర్యల జ్ఞాపకాలను ప్రస్తావిస్తూ ప్రార్థిస్తాము. ఈ రూపం మన పాపాలపై కాదుగాని క్రీస్తు యొక్క కరుణపై దృష్టి పెడుతుంది దేవుడు న్యాయవాది వలె న్యాయ తీర్పు చెప్పడానికి రాడు, కానీ దూరమైన మనిషిని తన దగ్గరకు తేవడానికి వచ్చిన బాధితుడిగా వస్తాడు. నియమావళి ప్రకారం, యాజకుడు లేదా ఇతర సేవకులు 'కిరియే ఎలైసోన్' (ప్రభువా, కరుణించు) అని అంటారు. ఇది కేవలం యాజకులకు మాత్రమే కాకుండా, కాంటర్ (Cantor) వంటి ఇతరులచే కూడా పాడవచ్చు. ఆ రోజుని పఠనాలు లేదా స్థానిక అవసరాల ఆధారంగా యాజకుడు కొన్ని కొత్త పదాలను సృష్టించవచ్చు.

**యాజకుడు:** పరితపించు హృదయులను ఓదార్చు పంపబడిన ప్రభువా దయ చూపుము

**ప్రజలు:** ప్రభువా దయచూపుము

**యాజకుడు:** పాపులను పిలువ వచ్చినా క్రీస్తువా దయచూపుము

**ప్రజలు:** క్రీస్తువా దయచూపుము

**యాజకుడు:** మాకై మనవి చేయ పితకుడి ప్రక్కన కూర్చుని ఉన్న ప్రభువా దయ చూపుము

**ప్రజలు:** ప్రభువా దయ చూపుము.

## 11. *Kyrie Eleison* అర్థం

*Kyrie Eleison* అనే పదం గ్రీకు పదమైన “ఎలియోస్వ” నుండి వచ్చింది, దీని అర్థం కరుణ. ఇది పురాతన గ్రీకు పదంగా, అది నూనె అనే అర్థాన్ని కలిగిస్తుంది. నూనెను పుండ్లను నయం చేయడానికి, శాంతింపజేయడానికి ఉపయోగించేవారు. హీబ్రూ పదం హెసెడ్ అనేది స్థిరమైన ప్రేమకు చిహ్నం. Kyrie అనగా “ప్రభు”, కాబట్టి *Kyrie Eleison* అనగా “ప్రభూ, నాకు కరుణ చూపు, నా బాధను తీయివేయి మరియు నీ ప్రేమను చూపు” చారిత్రకంగా ఇది కీర్తనగా, ప్రశంసగా ఉపయోగించబడుతుంది, పశ్చాత్తాపక కర్మలా కాదు. ఇది చాలా విస్తృతంగా ఉపయోగించే ప్రార్థనలలో ఒకటి – సమర్పణలలో మరియు లిటనీలో (Litany). కాబట్టి, ఇది పశ్చాత్తాప కర్మగా లేదా కీర్తనగా రెండింటిలోనూ ఉపయోగించబడుతుంది. Kyrieను ఐదవ శతాబ్దంలో పోప్ గెలాసియస్ పరిచయం చేశాడు.

### 11.1 పవిత్ర జల చిలకరింపు

విధివిధానంగా పవిత్ర నీటిని పరిశుద్ధీకరించే ఆచారం ప్రధానంగా ఈస్టర్ జాగరణ సమయంలో యాజకుడు లేదా బిషప్ చేత చేయబడుతుంది. ఆదివారాలలో, ముఖ్యంగా ఈస్టర్ కాలంలో పశ్చాత్తాప కర్మగా పవిత్ర నీటిని ప్రజాలపై చల్లటాన్ని చూస్తాం. దీనిని లతీన్లో *Aspersion* అంటారు. యాజకుడు సమష్టిగా పూజలో ఉన్నవారిపై పవిత్ర నీటిని చల్లేవేళలో కీర్తన 51 పాడబడుతుంది. పవిత్ర జలం మీద పడగానే ప్రజలు తాము శిలువ చిహ్నాన్ని వేసుకుంటారు. ఈ పవిత్ర నీటిజల్లు పశ్చాత్తాపాన్ని సూచిస్తుంది. యూదుల పరిశుద్ధీకరణ విధానం. దేవాలయ ప్రవేశానికి ముందు నీటితో కడుక్కోవడం, కీర్తన 51లో దావీదు ప్రార్థన, మోషే అహరోనును మరియు అతని కుమారులను యాజకత్వానికి ముందు పరిశుద్ధీకరించడమే ఈ ఆచారానికి ఆధారాలు. ఈ పవిత్ర నీటి చిలకరింపుకు ఈస్టర్ కాలం మూలం ఇది బాప్తిస్మా మరియు జీవిత నవీకరణతో సంబంధం కలిగి ఉండి, కాలక్రమేణా ఈ రూపంలో అభివృద్ధి చెందింది.

ద్వితీయ వాటికనుకు ముందు దీనిని భిన్నంగా నిర్వహించేవారు. 1570 పూజా పొత్తము ప్రకారం ఆదివారం పూజా ప్రారంభానికి ముందు, యాజకుడు పూజా వస్త్రం ధరించే గదిలో నీటిని ఆశీర్వదించి, పీఠముచుట్టూ యాజకులపై ప్రజలపై ప్రోక్షణ చేసేవారు. ఈస్టర్ కాలంలో, యెహెజ్కేలు 47:1-2 ఆధారంగా ఉన్న "విది *vidi aquam* ఆక్వామ్" భజనను ప్రోక్షణ సమయంలో పాడేవారు. పశ్చాత్తాప పడిన తర్వాత యాజకుడు మన్నింపు ప్రకటిస్తాడు. దీని ద్వారా పశ్చాత్తాప కర్మ ముగుస్తుంది. దీని కోసం సాధారణ ప్రార్థన ఈ విధంగా ఉంటుంది: సర్వ శక్తి గల సర్వేశ్వరుడు మనకు దయ చూపి మన పాపములను మన్నించి మనలను నిత్య జీవితమునకు చేర్చును గాక. అయితే, ఈ మన్నింపుతో అన్ని పాపాలు క్షమించబడవు. ఎందుకంటే ఇది పాపముల క్షమాపణ కొరకు ఇవ్వబడే దివ్య సంస్కార మన్నింపు కాదు. ఇది కేవలం ప్రజలు యోగ్యంగా పూజను జరుపుకునేందుకు వారధి మాత్రమే. ఈ క్రియ స్వల్ప పాపాలను మాత్రమే కడిగివేస్తుంది. చావైన పాపాలను క్షమించవు.

**గమనిక:** చాలామంది పాప సంకీర్తనకు వెళ్లకుండా, ఈ పశ్చాత్తాప క్రియ మన్నింపుతో తమ పాపాలు క్షమించబడతాయని తప్పుడు నమ్మకంతో ఉంటారు. పశ్చాత్తాప క్రియలో కచ్చితంగా పాపముల క్షమాపణ ఉంటుంది అని చెప్పలేము. కారణం, ఈ మన్నింపు ప్రార్థన (ట్రినిటేరియన్) త్రియేక దేవుడు సూత్రాన్ని కలిగి ఉండదు. పాప సంకీర్తనకు పశ్చాత్తాప క్రియకు గల భేదాన్ని మనం తెలుసుకోవాలి.

ఆదివారములో ముఖ్యముగా పాస్క కాలములో పశ్చాత్తాప క్రియకు బదులుగా తీర్థమునూ ఆశీర్వదించి ప్రొక్షన క్రమమును జ్ఞాన స్నానానికి గురుతుగా నిర్వహింపవచ్చును. ఈ సమయంలో మన్నింపు జపమును గురువు ఈ విధంగా చెప్తాడు - "సర్వ శక్తి గల సర్వేశ్వరుడు మనలను పాపమాలీనయ్యము నుండి శుద్ధి చేసి ఈ దివ్యపూజ ద్వారా పరలోక విందులో పాల్గొన అర్హతను దయచేయుదురుగాక" ! (పుట సంఖ్య.1385).

- యాజకుడు మన్నింపు ప్రకటించేటప్పుడు చేతులు లేపకూడదు. ఇది పాప సంకీర్తన దివ్యసంస్కార మన్నింపు కాదు. దేవుడు మాత్రమే మన్నింపు ఇవ్వగలడు.

- ట్రినిటేరియన్ త్రిత్వ సూత్రం లేకుండా మన్నింపు కోరితే దానికి తక్కువ ప్రభావం ఉంటుంది.
- "సర్వ శక్తి గల దేవుడు మనపై దయ చూపి..." అనే ప్రార్థన మన్నింపు అయితే కాదు, పూజను యోగ్యంగా జరుపుకునేందుకు మనలను సిద్ధపరిచే ప్రార్థన మాత్రమే. (ది.గ్ర.సా.ని నెం.51).

## 12 గ్లోరియా

గ్లోరియా అనేది లూకా 2:14 లో చెప్పబడిన దేవదూతల భజనపై ఆధారపడి ఉన్న స్తుతి గీతం, ఇది కీర్తనల శైలి మరియు నిర్మాణాన్ని పోలి ఉంటుంది. గ్లోరియాలోని ప్రాథమిక నిర్మాణం 4వ శతాబ్దం నుండి ఉంది.

ప్రాథమికంగా ఇది ఉదయ కాల ప్రార్థనలలో (లిటర్జీ ఆఫ్ ది అవర్స్) మరియు బైజాంటైన్ పద్ధతులలో ఉన్న దేవపూజా విధుల్లో చోటు చేసుకుంది. 5వ శతాబ్దానికి ఇది పరిణతి చెందినది. పశ్చాత్తాప ప్రార్థనల తర్వాత, దైవార్చన (లిటర్జీ) సంతోషకరమైన స్తుతి గీతాలవైపు మల్లుతుంది. అది గ్లోరియా గీతం పాడే విధంగా ఉంటుంది. పాశ్చాత్య చర్చిలో గ్లోరియా అనేది కృతజ్ఞత గీతంగా లేదా ఉత్సవ గీతంగా చూడబడుతుంది. కాని లిటర్జికల్ ఆరాధన గీతంగాకాదు. 6వ శతాబ్దం వరకు పూజలో భాగంగా గ్లోరియా ఉండేది కాదు. ఆరంభంలో బిషప్ పూజకు అధ్యక్షత వహించేటప్పుడు గ్లోరియాను పాడేవారు. కానీ 11వ శతాబ్దానికి అది సాధారణంగా పాడే విధంగా మారింది. కాల క్రమేణా బిషపులు ఉన్నప్పుడే గ్లోరియా పాడాలి అన్న ఆచారం తగ్గిపోయింది. ప్రస్తుతం గ్లోరియా ఆగమానకాలం పండుగలో లెంట్ (ఉపవాస కాలం) మినహా మిగతా సమయాల్లో పాడతారు. తూర్పు చర్చిల లిటర్జీలో గ్లోరియా భాగంగా ఉండదు. కానీ పాశ్చాత్య చర్చిలలో భాగంగా ఉంటుంది.

## వాటికన్ రెండవ సమితి సంస్కరణ

వాటికన్ రెండవ సమితి సంస్కరణ విశ్వాసులు చురుగ్గా దైవార్చనలో మరింత క్రియాశీల పాత్ర పోషించాలన్న అవసరాన్ని తెలియజేసింది. ఈ నేపథ్యంలో బిషపులు కొత్త గీతాలు రాయ పిలుపునిచ్చారు. తద్వారా ప్రజలు సులభంగా గ్లోరియా పాడగలుగుతారు. రోమను క్రమములో వున్న అనువాదం

మాత్రమే గ్లోరియాలో వాడుతూ తప్పులు తలెత్తకుండా ఉపయోగించాలి. గ్లోరియాను ప్రతి ఒక్కరూ పాడాలి. పాటల బృందం మాత్రమే పాడే గీతంగా గ్లోరియా ఉండకుండా గాయకుల సమూహం ప్రజలతో కలిసి దేవునికి స్తుతి పాడాలి. ప్రజలకు అన్ని చరణాలు పాడేలా శిక్షణ ఇవ్వాలి. కొంతమంది సమయాభావం వల్ల పూర్తిగా పాడకుండా ఆపేస్తారు. అలా ఆపకూడదు.

## గ్లోరియాకు యొక్క నిర్మాణం

గ్లోరియా అనేది ప్రాచీన మరియు గౌరవనీయమైన స్తోత్ర గీతం. దీనిని సంఘం ఆత్మలో దేవునికి స్తుతిగా పాడుతుంది ఇందులో నాలుగు భాగాలున్నాయి:

(a) దేవదూతల గీతం

(b) దేవునికి వివిధ శీర్షికలతో స్తుతి

(c) క్రీస్తును ఆహ్వానించడం

(d) త్రిఏక దేవునికి (త్రినిటీ) నమస్కార ప్రార్ధన (డాక్సాలజీ)

**గమనిక:** త్రిత్వం (త్రినిటీ) గ్లోరియా పాటలో తప్పనిసరిగా ఉండాలి.

గ్లోరియా గీతాన్ని ఇతర ఏ గీతంతోనూ భర్తీ చేయరాదు (రోమియా గ్రంధ నియమావళి పుట సంఖ్య 53).

## క్రీస్తు జయంతి ముందు మరియు శ్రమల కాలంలో గ్లోరియా ఎందుకు పాడరు?

యాజకుడైన ఫాదర్ మార్క్ ఓట్ గారు ఇలా తెలిపారు 'గ్లోరియా అనేది దేవుని కరుణపై ఆనందభరితమైన ఆశ్చర్యాన్ని వ్యక్తపరిచే గీతం, అందువల్ల ఇది శ్రమల కాలంలో సమయంలో పాడబడదు. ఎందుకంటే ఈ కాలంలో శ్రీసభ పాపంపై మన అవగాహనను, మన పశ్చాత్తాపాన్ని పెంచుకునే సమయంగా భావిస్తుంది'. ఈ కాలంలో మనం మన పాపభావనపై మరియు పశ్చాత్తాప అవసరంపై దృష్టిపెడతాం. ఈస్టర్ వచ్చినప్పుడు గ్లోరియాను తిరిగి ఉత్తేజంగా పాడతాం. మనం ఈస్టర్ జాగరణకు హాజరైతే, ఆ వేళ గ్లోరియా పాడేటప్పుడు గుడి వెలుగుతో నిండిపోతుంది, ఆనందకరమైన సంగీతం తిరిగి మొదలవుతుంది.

ఆగమన కాలం (అడ్వెంట్) అనేది క్రిస్మస్కు మౌనంగా సిద్ధపడే సమయం. ఈ సమయంలో విశ్వాసులు తమ హృదయాలను సిద్ధం చేసుకుంటారు, దేవుని కుమారుడైన యేసును స్వీకరించేందుకు సిద్ధంగా వుంటారు. మరియమాత మంగళవార్త నుండి క్రీస్తు జననం వరకు ధ్యానిస్తూ మరియ యోసేబులాగా క్రిస్మస్ వరకూ జరిగిన సంఘటనలపై దృష్టి పెట్టడానికి ఇది సమయంగా ఉంటుంది. ఫా. మార్క్ ఓట్ గారు ఇలా చెప్పారు: మరియా మరియు యోసేబుల కాలంలో గ్లోరియా ఇంకా పాడబడలేదు. కాబట్టి, ఇప్పుడు కూడా చర్చిలో మనం పాడము. క్రిస్మస్ సమయంలో గొల్లలు తొలిసారి గ్లోరియా వినిన ఆనందంతో ప్రజలు గ్లోరియాను ఉత్సాహంగా పాడతారు.

### క్రిస్మస్ మరియు ఈస్టర్ (ఆక్టేవ్) అష్ట దినం అంటే ఏమిటి?

కతోలికులు క్రిస్మస్‌ను కేవలం డిసెంబర్ 25 మాత్రమే కాకుండా సుమారు 8 రోజుల వరకు జరుపుకుంటూనే వుంటారు. క్రిస్మస్ పాటలు 12 రోజుల క్రిస్మస్ను జనవరి 6, ముగ్గురు రాజుల పండుగ (ఎపిఫని) వరకు గుర్తు చేస్తాయి. కానీ దేవాలయంలో దైవార్చన (లిటర్జీ) ప్రకారం క్రిస్మస్కు 8 రోజుల ఆక్టేవ్ ఉంటుంది. ఈ 8 రోజులలో ప్రతి రోజు క్రిస్మస్ ఉత్సవాన్ని మళ్ళీ మళ్ళీ జరుపుకుంటారు. ఇదే విదంగా ఉత్థాన పండగకు కూడా ఆ దినం వుంటుంది. క్రీస్తు జయంతి మరియు ఉత్తన పండుగలకు అష్ట దిన పూజలో గ్లోరియా పాడబడుతుంది.

## 13. సంఘ ప్రార్థన (Collect)

ఈ ప్రార్థన ప్రారంభ సాంగ్యానికి ముగింపులో వస్తుంది. దీనిని ఆంగ్లంలో “కోలెక్ట్ (kolekt)” అని ఉచ్చరిస్తారు. లాటిన్ కలెక్టా (collecta) నుండి, దీని క్రియ (colligere, col-'together' + legere 'choose or collect') నుండి వచ్చింది, దీని అర్థం “సమావేశమైన విశ్వాసుల ఐక్యత”. మునుపటి అనువాదంలో “ప్రారంభ ప్రార్థన” అని పలికేవారు, కానీ ఇది వాస్తవానికి ప్రారంభ సాంగ్యాన్ని తెరదించుతూ, దైవ వాక్యార్చనకు తెర లేపుతుంది. నేడు సంఘ ప్రార్థన, ప్రార్థన కార్యాన్ని, ప్రజల యొక్క విన్నపాలను ఒకటిగా సేకరించి, శ్రీసభ అవసరాలతో జత చేస్తున్న దానికి సాదృశ్యంగా ఉంది.

## 13.1 సంఘ ప్రార్ధనలో ఆరు భాగములు

### 13.1.1 ఆహ్వానము (Invitation)

యాజకుడు ప్రార్ధించుదమనే ఆహ్వానాన్ని విశ్వాస సంఘముతో పలికెదరు. ఈ ఆహ్వానం మన దృష్టిని, దైవారాధన పై లగ్నం చేయమని యాజకుడు ఆహ్వానించడానికి సూచికగా ఉన్నది.

### 13.12 మౌనం (Silence): యాజకుడు మరియు ప్రజల నిశ్శబ్ద ప్రార్ధన

మౌనం, ప్రార్ధన యొక్క నిర్మాణాత్మక అంశాలలో అంతర్భాగంగా ఉంటుంది. నిర్ణీత సమయాలలో ఆధ్యాత్మిక మౌనం, పూజలోని ఒక భాగము. యాజకునితో కలిసి విశ్వాసులు దేవుని సన్నిధిలో ఉన్నారనే వాస్తవాన్ని వారు గ్రహించి, వారు దేవుని సన్నిధిలో ఉన్నామని విషయమును గ్రహించి మనసులో తమ అవసరములను తలంచి ప్రార్ధించవచ్చును (SC.30; GIRM నెం. 45). దివ్య బలిపూజలో మౌనాన్ని ఎన్నడూ నిర్లక్ష్యం చేయలేదు. విశ్వాసులు ప్రార్ధనలో ప్రభువు ముందు ఉంచాలనుకునే వ్యక్తులను, విన్నపాలను మరియు పరిస్థితిని గుర్తించెదరు. సంక్షిప్త మౌనాన్ని వహిస్తూ విశ్వాసులు వారికి కావలసిన ఆలోచనలను గుర్తుకు తెచ్చుకోవడానికి మరియు ఈ దివ్యబలిపూజకు ప్రతి ఒక్కరూ తీసుకువచ్చే ఉద్దేశాలను గుర్తుకు తెచ్చుకోవడానికి, ఈ సమయం సరిపోతుంది మరియు తగినంత ఎక్కువగా ఉండాలి. 2018లో జనరల్ ఆడియన్స్ సందర్భంగా, పాపుగారు ఫ్రాన్సిస్ మాట్లాడుతూ సంఘ ప్రార్ధనకు ముందు, మౌనం మనల్ని మనం తయారు చేసుకోవడానికి మరియు మనం ఇక్కడ ఎందుకు ఉన్నామో ఆలోచించడానికి సహాయపడుతుంది. బహుశా మనం అలసట, ఆనందం, బాధలతో వచ్చాము మరియు మనం ప్రభువుకు అలా చెప్పాలనుకుంటున్నాము. అతని సహాయం కోరడానికి, మనకు దగ్గరగా ఉండమని అడగడానికి, మనకు అనారోగ్యంతో ఉన్న బంధువులు లేదా స్నేహితులు ఉన్నారు లేదా కష్ట సమయాల్లో వెళుతున్నారు, మనం దేవునికి వీరిని అప్పగించాలనుకుంటున్నచో సంఘ ప్రార్ధనలోని ఈ భాగంలో చెప్పవచ్చును.

### 13.1.3 విజ్ఞాపనము చేయుట (Invocation)

శ్రీసభ యొక్క యొక్క పురాతన సంప్రదాయం ప్రకారం, సంఘ ప్రార్ధన

సాధారణంగా పవిత్రాత్మ యందు, క్రీస్తు ద్వారా, పిత దేవునికి సమర్పింపబడును మరియు త్రిత్వ ముగింపుతో ముడిపడి ఉంటుంది (GIRM నెం. 54). ఈ ప్రార్ధనలో దేవుని తండ్రి అని సంబోధిస్తారు. సర్వశక్తిగల నిత్య సర్వేశ్వర వంటి విశేషణాలు ఉపయోగిస్తారు. ఈ ప్రత్యక్ష చిరునామా దేవుని లక్షణాన్ని లేదా చరిత్రలో దేవుని చర్యను సూచిస్తుంది.

## 13.1.4 అభ్యర్ధన (Petition)

ప్రార్ధనలు చేసే విశ్వాసుల సంఘం తరపున తండ్రి దేవునికి చేసే విజ్ఞాపనలో ఈ అభ్యర్ధన ఉంది. మా హృదయాలను సిద్ధం చేయుము మాకు ప్రసాదించుము. మా హృదయాలలోకి నీ కృపను పంపుము అనునవి మనము చూడవచ్చును.

## 13.1.5 మధ్యవర్తిత్వం (Mediation GIRM నెం. 54)

ఈ ప్రార్ధనకు త్రిత్వైక దేవుని స్మరించు సుదీర్ఘమైన ముగింపు ఉండును.

- ప్రార్ధన తండ్రికి సమర్పించిన యెడల: నీతోను పవిత్రాత్మతోను కలసి యుగ యుగములు జీవించుచు పాలించు మా ప్రభువును, నీ కుమారుడునైన యేసుక్రీస్తుద్వారా ఈ మనవి చేయుచున్నాముువ అనియు
- ప్రార్ధన తండ్రికి ఉద్దేశించి, ముగింపులో సుతుని ప్రస్థావన ఉన్న యెడల: నీతోను, పవిత్రాత్మతోను ఏకమై సదా జీవించుచు పాలనచేయు క్రీస్తుద్వారా ఈ మనవి చేయుచున్నాముువ అనియు
- సుతునికి సమర్పించినయెడల: పితతోను, పవిత్రాత్మతోను కలిసి యుగయుగములు జీవించుచు పాలించువారా మాకు అనుగ్రహింపుడు అనియు ముగియును.
- క్రీస్తు ద్వారా అనే పదం మన మానవ బలహీనత మరియు నిస్సహాయతలో మనం ఇకపై దేవుని ముందు నేరుగా నిలబడలేమని ధృవీకరిస్తుంది. క్రీస్తు మన మధ్యవర్తిగా, మన న్యాయవాదిగా మరియు మన ప్రధాన యాజకుడిగా మనతో ఉన్నాడు. ఆయన ద్వారానే మనం ఇప్పుడు దేవుని సన్నిధిలోకి ప్రవేశిస్తాము అనే పరమ రహస్యాన్ని బోధిస్తుంది

### 13.1.6 ముగింపు: "ఆమెన్"

ప్రజలు సంఘ ప్రార్థనను ఆమోదించుచు, 'ఆమెన్' అని ప్రత్యుత్తరమును తెలుపుదురు. పూజలో ఒకే ఒక సంఘప్రార్ధన ఉండును.

'ఆమెన్' అనేది క్రైస్తవులచే మాత్రమే ఉపయోగించబడలేదు, దీనిని యూదులు మరియు ముస్లింలు కూడా ఉపయోగిస్తారు, వారి ప్రార్థనలు కూడా ఆమెన్ తోనే ముగుస్తాయి. కాబట్టి, ఈ చిన్న పదం ఖచ్చితంగా ప్రాముఖ్యతను కలిగి ఉంది. మనం ఒక ప్రార్థనను విని, చెప్పబడినది నిజం, నిష్కపటమైనది మరియు నమ్మదగినది అని అంగీకరిస్తే, అది మనకు ఆమెన్ అని చెప్పడానికి కారణం అవుతుంది మరియు ప్రార్థనను దేవుని దృష్టిలో మరింత ప్రభావవంతంగా మరియు శక్తివంతంగా చేస్తుంది. కాబట్టి ఆమెన్ దేవుని పట్ల మన విశ్వాసాన్ని మరియు అతనిపై మన నమ్మకాన్ని వ్యక్తపరుస్తుంది అని మనం అర్థం చేసుకోవచ్చు (కతోలిక సత్యోపదేశం 1062). ఆమెన్ చిన్నది కానీ దానిలోని అర్థం చాలా గొప్పది. ఈ పదం ఖచ్చితమైన అనువాదాన్ని నిర్వచనం "అలాగే జరగాలి (Let it be so)". ఇంకా ఆమెన్ అనేది బైబిల్ యొక్క చివరి పదం, ఇది దర్శన గ్రంథంలోని చివరి పంక్తులను కలిపి ముడి వేసినట్లుగా ఉంటుంది ప్రభువైన యేసు కృప దేవుని ప్రజలకు తోడై ఉండును గాక ఆమెన్వ (దర్శన 22:21).

### దయచేసి గమనించండి

మనం చెప్పిన ఆమెన్ పై శ్రద్ధ చూపకుండా అందరూ చెప్పినట్లే ఆమెన్ అని పునరావృతం చేస్తే, మన ధృవీకరణ నిజాయితీగా ఉండదు. ఇది మన ప్రార్ధనను దేవునికి తక్కువ ప్రభావవంతంగా మార్చవచ్చు (1 కొరింతీ 14:16). కొంతమందికి ఆమెన్ దురదృష్టవశాత్తు ఒక రకమైన విరామ చిహ్నంగా మారింది: సరే ప్రార్థన ముగిసింది. మనలో చాలా మంది ఆమెన్ అనే పదాన్ని దాని ఉత్కృష్టమైన అర్థం గురించి ఆలోచించకుండానే ఉపయోగిస్తాము.

## 13.2 Orans Posture (సంఘ ప్రార్ధన కోసం చేతులు చాచి ఉంచే సంకేతం)

యాజకుడు సంఘ ప్రార్థనను పరలోకము వైపు చేతులు విడదీసి, ప్రార్థనను

పొడతాడు లేదా పఠిస్తాడు మరియు అదేవిధంగా, అధ్యక్షత వహించే వ్యక్తిగా ప్రజల తరపున ప్రార్థిస్తాడు. అధ్యక్ష ప్రార్థనలను ఓరాన్స్ సంజ్ఞను ఉపయోగించి చేస్తారు, అంటే, చేతులు చాచి, చేతులు తెరిచి, అరచేతిని పైకి ఉంచుతారు. ఇది సిలువ చెక్క పై తెరిచిన చేతులతో క్రీస్తును అనుకరించడానికి సంకేతముగా ఉంటూ ఉన్నది. యుద్ధ ఖైదీలు లొంగిపోయే వైఖరిలో మోకరిల్లి ఆయుధాలు లేని రెండు చేతులను పైకి లేపడం మరియు అదే సమయంలో ప్రత్యర్థులు ఉదారంగా ఉండాలని మరియు తమ కత్తులను, ఆయుధములను ఉపయోగించవద్దని విజ్ఞప్తి చేసే సంజ్ఞ చేతులు పైకెత్తి తెరిచి, శాంతి, నమ్మకం మరియు ప్రార్ధన యొక్క సార్వత్రిక సంజ్ఞను వెల్లడిస్తాయి. పాత నిబంధనలో దేవునికి చేతులు ఎత్తడం ఆచారం (నిర్గమ. 9:29,33, కీర్తన 28:2, 63-5) మరియు వాటిని ఆలయ గర్భగుడి వైపు మళ్ళించడం (1 రాజులు 8:38) చూస్తాము. ఒక క్రైస్తవుడు ఈ విధంగా ప్రార్థించినప్పుడు, తండ్రి అతనిలో, తన సొంత కుమారుడు శిలువపై మరణిస్తున్నట్లు చూస్తాడు ప్రార్ధన చేసినప్పుడు ప్రతి ఒక్కరూ నిలబడి ఉంటారు. నిలబడటం అనేది గౌరవం మరియు గౌరవం యొక్క సంజ్ఞ. దివ్యపూజ ప్రారంభంలో కలిసి లేవడం మరియు విశ్వాస సమాజం నిలబడటం క్రీస్తు పునరుత్థానం (మరణం నుండి లేవడం) యొక్క ఆనందాన్ని సూచిస్తుంది.

## ముగింపు

ప్రారంభ సాంగ్యము దివ్యబలిపూజ ప్రారంభాన్ని సూచిస్తుంది మరియు మొత్తం వేడుకకు ఒక స్వరాన్ని నిర్దేశిస్తుంది. ఇది కతోలికులను విశ్వాసంలో ఐక్యమైన సమాజంగా సేకరిస్తుంది మరియు పవిత్ర రహస్యాలలోకి ప్రవేశించడానికి వారిని సిద్ధం చేస్తుంది. ప్రవేశ ప్రదక్షణ మరియు పాట ద్వారా శ్రీసభ తన ఆనందాన్ని మరియు భక్తిని వ్యక్తపరుస్తుంది. సిలువ గుర్తు, మనం త్రియేక దేవుని సన్నిధిలో ఉన్నామని మనకు గుర్తు చేస్తుంది. యాజకుని శుభాకాంక్షలు దివ్యపూజకు స్వాగతాన్ని పలుకుతాయి మరియు మన మధ్య క్రీస్తు ఉనికిని అంగీకరిస్తాయి పశ్చాత్తాప క్రియ, మన పాపాలను జ్ఞాపక పరచుకుని దేవుని దయ కోసం అడగమని మనలను ఆహ్వానిస్తుంది. గ్లోరియా, చేర్చబడినప్పుడు, దేవునికి స్తుతులు మరియు కృతజ్ఞతలు తెలుపుతూ మన

హృదయాలను దేవుని వైపునకు లేపుతుంది సంఘ ప్రార్ధన, ప్రజల ఉద్దేశాలను ఒకచోట చేర్చి ప్రారంభ సాంగ్యాన్ని ముగిస్తుంది. ఈ క్షణాలు దేవుని వాక్యాన్ని స్వీకరించడానికి మన హృదయాలను మరియు మనస్సులను పారవేసేందుకు సహాయపడతాయి. ఈ విధంగా, ప్రారంభ సాంగ్యము దివ్య పూజలో మనల్ని లోతైన భాగస్వామ్యానికి దారి తీస్తుంది

## ప్రారంభ సాంగ్యమునకు సంబంధించిన దివ్యపూజ గ్రంథ సాధారణ నియమావళులు

దైవవాక్యార్చనకు ముందు వచ్చునవి, అనగా, ప్రవేశము, శుభవచనములు, పశ్చాత్తాప క్రియ, ప్రభువా దయచూపుడు, మహిమగీతము, సంఘ ప్రార్ధన ఇవి యన్నియు పూజకు ప్రారంభముగను, ఉపోద్ఘాతముగను, ఆయత్తముగను దోహదపడుచున్నవి.

ఒకటిగా గుమికూడిన విశ్వాసులు అంతరంగములో సంఘీభావమును కలిగియుండి, యుక్తమైన విధముగా దేవుని వాక్కును వినుటకును, యోగ్యముగా దివ్యబలిపూజను కొనియాడుటకును వారిని సంసిద్ధపరచుటయే వీటి ఉద్దేశము పూజకు అనుసంధానింపబడిన కొన్ని సాంగ్యముల క్రమములలో దైవార్చన పుస్తకములలోని సూచనల ప్రకారము ఈ ప్రారంభ సాంగ్యములను ఉపయోగింపరు లేదేని మరొక విధముగ నిర్వహించుదురు.

### ప్రవేశము

ప్రజలు సమావేశమైన తరువాత, యాజకుడు పరిచారకులతో వెళ్తునప్పుడు. ప్రవేశ గీతమును ప్రారంభింతురు పూజను ప్రారంభించుటకును, అక్కడ చేరిన విశ్వాసుల ఐక్యమును బలపరచుటకును, పవిత్ర సాంగ్యపు నిజస్వభావమును పరిచయము చేయుటకును, యాజకుడు సహాయకులతో కలసి వెళ్లు ప్రదక్షిణకు అర్ధము నిచ్చుటకు ఈ గీతము ఉద్దేశింపబడినది.

గాయకబృందము విశ్వాసులు వేరు వేరుగా గానీ లేక ఒక గాయకుడు, ప్రజలు మారి మారి గానీ లేక విశ్వాసులందరు కలిసిగానీ లేక గాయకబృందము మాత్రమే ఈ గీతమును పాడవచ్చును. రోమీయ అనుక్రమ కీర్తనల గ్రంథము లేక సాధారణ కీర్తనల గ్రంథములో నున్న పల్లవిని దాని కీర్తనను ప్రవేశగీతముగ

పాడవచ్చును. లేక ఆ పూజకు, ఆ రోజుకు, ఆ కాలమునకు ఉపయుక్తమైన వేరొక గీతమును పాడవచ్చును కాని, ఈ గీతమునకు సంబంధించిన సాహిత్యము పీఠాధిపతుల సమాఖ్య ఆమోదమును పొందినదై ఉండవలయును

ప్రవేశగీతమును పాడనిచో, విశ్వాసులందరు లేక వారిలో కొందరు లేక పాఠకుడు దివ్యపూజ గ్రంథములో ఇచ్చిన ప్రవేశవచనమును చదువును, లేక యాజకుడు స్వయముగా దానిని చదివి, దానినే ఉపోద్ఘాతముగా మార్చి వివరించును.

## పీఠమునకు ప్రణామము, ప్రజలకు శుభములు పలుకుట

అర్చనా స్థలమును చేరుకొనగానే, యాజకుడును, డీకనును, పరిచారకులును శిరము వంచి పీఠమునకు ప్రమాణముచేతురు గౌరవసూచకముగా, యాజకుడును, దీకనును పీఠమును ముద్దిడుదురు సందర్భానుసారము యాజకుడు సిలువకును పీఠమునకును ధూపము వేయును.

ప్రవేశగీతము ముగియుగానే యాజకుడు తన ఆసనము చెంత నిలుచుండును. ప్రజలతో కలసి సిలువగురుతు వేసికొనును దేవుని సాన్నిధ్యమును సూచించుచు ప్రజలకు శుభవచనములు పలుకును. ఈ విధముగ శుభవచనములు పలికినపుడు, దానికి ప్రజలు సమాధానమిచ్చుదురు. ఈ విధముగా అక్కడ చేరిన శ్రీసభ యొక్క నిజమైన దివ్యస్వభావము విదితమగును

ప్రజలకు శుభములు పలికిన తరువాత యాజకుడు లేక డీకను లేక ఒక సహాయకుడు ఆనాటి పూజను గురించి క్లుప్తముగా వివరింపవచ్చును.

## పశ్చాత్తాప క్రియ

పూజను గురించి, పరిచయ వచనములు వినిన తరువాత, కొన్ని క్షణములు మౌనము పాటింతురు. పిదప, యాజకుడు పశ్చాత్తాపక్రియకు విశ్వాసులను ఆహ్వానించును. అందరు కలసి బిగ్గరగా పాపోచ్చారణము చేయుదురు యాజకుడు పాపపుమన్నింపును ప్రకటించును. ఈ సాంగ్యము పాపవిమోచన దివ్యసంస్కార ఫలములను కలిగి యుండును.

ఆదివారములలోను ముఖ్యముగా పాస్కకాలములోను, ఈ సాధారణ పశ్చాత్తాపక్రియకు బదులుగా మన జ్ఞానస్నానమును స్మరింపజేయు తీర్థజలములను ఆశీర్వదించి చిలుకరించు సాంగ్యమును నిర్వహింపవచ్చును.

**ప్రభువా, దయచూపుడు...**

పశ్చాత్తాపక్రియలో భాగముగా ప్రభువా, దయచూపుడు, ప్రార్ధనను చెప్పనియెడల అది ఇప్పుడు అరంభమగును. ఈ వచనాలతో, విశ్వాసులు ప్రభువును స్తుతించి, అతని కరుణ కొరకు అర్థింతురు. దీనిని ప్రజలు, గాయకబృందము మారి మారి లేక ప్రజలు గాయకుడు మారి మారి లేక అందరు కలసి పాడుదురు.

ఈ వచనమును సాధారణముగా రెండు సార్లు చెప్పుదురు లేక పాడుదురు కాని, భాష, సంగీతము, సందర్భమును బట్టి ఎక్కువసార్లు పాడవచ్చును. ఇది పశ్చాత్తాపక్రియలో భాగమైనప్పుడు 'ప్రభువా దయచూపుడు'కు ముందు ఒక విన్నప వచనమును చేర్చుకొనవచ్చును

**మహిమగీతము**

ఈ మహిమగీతము అతి ప్రాచీనమైన స్తుతిగీతము పవిత్రాత్మయందు గుమికూడిన దైవసంఘము ఈ గీతములో తండ్రి దేవుని, గొఱ్ఱెపిల్లను మహిమ పరచి, దీనతతో అర్థించుచున్నది. ఈ మహిమగీతమునకు బదులుగా వేరే పాఠమును వాడరాదు. మహిమగీతమును యాజకుడు ప్రారంభించును లేక అవసరమును బట్టి గాయక బృందము లేక కీర్తనా గాయకుడు ప్రారంభించును దీనిని ప్రజలు, గాయకబృందము వేరు వేరుగా లేక గాయకబృందము మాత్రమే ఆలపించును. పాడనియెడల, అందరు కలసి చెప్పుదురు లేక దైవసంఘము రెండు బృందములుగా ఏర్పడి ఒకరి తరువాత మరొకరుగా మారి మారి చెప్పుదురు.

దీనిని ఆగమనకాలము, తపఃకాలము వెలుపల వచ్చు ఆదివారములలోను, ఉత్సవములు, మహోత్సవములు, ఇంకా మహోత్సవ స్థాయికి చెందిన పండుగలలో పాడుదురు లేక చెప్పుదురు.

## సంఘప్రార్థన

తరువాత యాజకుడు ప్రజలను ప్రార్థనకు ఆహ్వానించును యాజకునితోపాటు అందరు కొన్ని క్షణములు మౌనము పాటింతురు. అప్పుడు వారు దేవుని సన్నిధిలో ఉన్నామను విషయమును గ్రహించి మనస్సులో తమ అవసరములను తలంచి ప్రార్థింపవచ్చును. పిదప, గురువు "సంఘప్రార్థన"ను చెప్పును. ఇది అక్కడ నెరవేరు దివ్యబలిపూజ ఉద్దేశమును వెల్లడించును ఈ ప్రార్థన యాజకుడు చెప్పుమాటలలో పవిత్రాత్మయందు క్రీస్తుద్వారా పిత దేవునికి సమర్పింపబడును 57 ఈ ప్రార్థనకు త్రిత్వైక దేవుని స్మరించు సుదీర్ఘమైన ముగింపు ఉండును.

- ప్రార్థన తండ్రికి సమర్పించిన యెడల "నీతోను పవిత్రాత్మతోను కలసి యుగ యుగములు జీవించుచు పాలించు మా ప్రభువును, నీ కుమారుడునైన యేసుక్రీస్తుద్వారా ఈ మనవి చేయుచున్నాముువ అనియు
- ప్రార్థన తండ్రికి ఉద్దేశించి, ముగింపులో సుతుని ప్రస్థావన ఉన్న యెడల నీతోను, పవిత్రాత్మతోను ఏకమై సదా జీవించుచు పాలనచేయు క్రీస్తుద్వారా ఈ మనవి చేయుచున్నాము" అనియు
- సుతునికి సమర్పించినయెడల "పితతోను, పవిత్రాత్మతోను కలిసి యుగయుగములు జీవించుచు పాలించువారా మాకు అనుగ్రహింపుడు" అనియు ముగియును

ప్రజలు ఈ ప్రార్థనను ఆమోదించుచు, 'ఆమెన్ అని ప్రత్యుత్తరమును తెలుపుదురు. పూజలో ఒకే ఒక సంఘప్రార్థన ఉండును.

**ముఖ్యగమనిక**

- GIRM దివ్యపూజ గ్రంథ సాధారణ నియమావళి





బ్రదర్ అలజంగి దీపక్ బ్రదర్ సింగారెడ్డి అనురాగ్ బ్రదర్ దొప్పలపూడి రవీంద్ర

# ౨. దివ్యవాక్యార్చన

– బ్రదర్ గొన్నాబత్తుల హేమంత్, బ్రదర్ సంజీత్ ఉత్థాన్ సింగ్,
– బ్రదర్ శానాపతి ఆనంద్

## ఉపోద్ఘాతం

కతోలిక శ్రీసభ రెండు భుజాలపై నడుస్తుంది. ఆ రెండు భుజాలు (1) దైవవాక్కు (Word of God) మరియు (2) శ్రీసభ సాంప్రదాయం (Tradition). ఈ రెండూ ప్రధానభూమికలై శ్రీ సభను ఒక తాటి మీద నడిపిస్తుంటాయి. పరిశుద్ధగ్రంథంలో వివరించిన కడరా భోజనాన్ని క్రీస్తువే స్మరణ చేయమని శిష్యులను ఆదేశించారు. అప్పటి నుండి ఇప్పటివరకూ క్రమక్రమంగా దైవవాక్కు ప్రకారం దివ్యబలిపూజ, తన రూపును సంతరించుకుంది. క్రైస్తవుల పాలిట అనేక వరాలు కురిపించు మూలంగా నిలుస్తుంది.

దివ్యబలిపూజలో దైవవాక్కు అత్యంత ప్రధానమైన భాగం. పవిత్రమైన దైవవాక్కు నుండి కొన్ని భాగాలను ధ్యానం చేయమని తల్లి తిరుసభ దైవార్చన క్యాలెండరును రూపొందిస్తుంది. పఠనాల కనుగుణంగా గురువు తన ప్రసంగాన్ని వివరిస్తారు. దైవవాక్కులోని కీర్తనలను, పఠనంలోని భావాలను ఆధారంగా చేసికొని రూపొందించిన గీతాలను ఆలపిస్తారు. పూజలో గురువు చెప్పే సంఘప్రార్థన, అర్పణలపై ప్రార్థన, దివ్యసత్ప్రసాదానంతర ప్రార్థనలు కూడా దైవవాక్కు ప్రేరణలే. కాబట్టి దివ్యపూజను అర్థవంతంగా, ఫలప్రదంగా జరుపుకోవాలంటే, దైవవాక్కు మీద ప్రేమను, అంకితభావాన్ని పెంపొందించుకోవాలి. ఇదే శ్రీసభ ఆకాంక్ష (దైవార్చన పత్రం నెం. 24). ప్రప్రథమంగా దివ్యబలిలో హృదయశుద్ధి చేసికొనిన తరువాత పవిత్రబీజాల్లాంటి దైవపలుకుల కోసం క్రైస్తవులు ఎదురుచూస్తారు. ఆ రోజు దైవవాక్కు ఏమి చెబుతుందోనని శ్రద్ధగా ఆలకిస్తారు. రక్షణ చరిత్ర ఎలా జరిగిందన్న సత్యాన్ని

ఎరుక పరిచేది దైవవాక్కు, బైబిలులోని పూర్వవేదంలో మానవసృష్టి నుండి, అతని పతనావస్థ, పునరుద్ధరణ, తిరిగి పాపస్థితి, దైవం మానవరూపధారణ, పాపము నుండి రక్షణ మొదలగు అంశాలను వివరిస్తుంది దైవవాక్కు. ఈ నేపథ్యంలో దైవకుమారుని మానవావతారం, రక్షణకార్యం మొదలగు అంశాలు ప్రముఖతను సంతరించుకుంటాయి. ఇవన్నీ వివిధ దశలుగా జరిగిపోతాయి. కాబట్టి తిరుసభ ప్రారంభానికి, అపోస్తులుల చర్యలలో మనకు లభించే ఆధారాలు మౌళికమైనవి. ఆదిమ సంఘపు క్రైస్తవులు  దైవవాక్కుని మీరి ఎక్కడా తమ సొంత ప్రయత్నాలు చేయలేదు (అ.చ. 3:17-26). శ్రీసభను స్థాపించుటలో అపోస్తులులు చూపిన విధేయత, విశ్వాసము అపోస్తులుల చర్యలలో వివరించబడియున్నవి. ఈ విధంగా ప్రేరణను, విశ్వాసాన్ని వారు పొందడానికి కారణం దైవవాక్కేనని ఖచ్చితంగా చెప్పగలము.

శ్రీసభ ఒక చిన్న సంఘంగా ప్రారంభించబడి, దైవరాజ్యవ్యాప్తి కొరకు చేసిన కృషి దైవగ్రంథంలో విపులంగా చెప్పబడింది. కడరాభోజనం నుండి వారు పొందిన ప్రభువాజ్ఞను, కలువరిగిరిపై ఆయన చేసిన త్యాగం ద్వారా పొందిన శక్తిని, ప్రభుభోజనాన్ని జరుపుకోవడానికి ప్రేరేపించిందీ దైవవాక్కే. ఆనాటి నుండి ఈనాటి వరకు దివ్యబలిపూజ క్రైస్తవుల జీవితాలలో ఒక విడదీయరానిబంధంగా మిగిలిపోయింది. ఇలా అంచెలంచెలుగా శ్రీసభ పూజా క్రమాన్ని ఏర్పరచిన విధానానికి మొదటి మెట్టు దైవవాక్కు నుండేనని గ్రహించాలి.

## చరిత్రాధారం

ప్రార్థనా సమయంలో దైవవాక్కు పఠించడం, భక్తితో ఆలకించడం, పూర్వం నుండి వస్తున్నదే. యూదుల ఆచారం ప్రకారం వారి ప్రార్థనా మందిరాలలో (సినగోగులలో) ప్రార్థనలు, దైవగ్రంథపఠనంతో ప్రారంభమయ్యేవి. ఈ పఠనాలు ప్రవక్తల ప్రబోధాలను, మోషే ఆదేశాలను వివరించే గ్రంథాలనుండి చదవేవారు. ప్రజలు కూడా అది దేవుని వాక్కు గనుక భక్తిశ్రద్ధలతో విని తరించేవారు. యేసుక్రీస్తు, తన పరిచర్య ప్రారంభదశలో ప్రార్థనామందిరములో ప్రవేశించి దైవగ్రంథాన్ని చదివారు. ఆ సన్నివేశాన్ని పునీత లూకా  గారు వివరిస్తున్నారు (లూకా 4:16-19). ఆయన అలవాటు చొప్పున ప్రార్థనామందిరానికి వెళ్ళినట్లు, అక్కడ యెషయా ప్రవక్త గ్రంథాన్ని చదివినట్లు (యెషయా 61:1-2) లూకా

తెలియజేస్తారు. ఆ క్షణం నుండి ఆయన తన మనుష్యవాతార ఉద్దేశాన్నీ, తండ్రి ఆయన్నుకు అప్పగించిన భాధ్యతను, ఆయన నిర్వర్తించాల్సిన కర్తవ్యాన్ని ప్రజలకు తెలియజేశారు. అది ప్రజలకు అభ్యంతర కరంగా వున్నా (లూకా 4:20-30) తన బాధ్యతను మొదటనే నిర్వర్తించారు. ఆయన మరణం తరువాత ఆయన శిష్యులు కూడా అదే పని చేశారు. ప్రార్ధనకు సమావేశమైనపుడు, దైవవాక్కును విస్మరించలేదు. పేతురు తన ప్రసంగంలో పలుమార్లు దైవగ్రంథం నుండి కొన్ని వాక్యాలను తన వాదనకు ఆధారంగా చేసికొంటాడు (అ.చ. 2:16-21; 25-28; 31, 35). దేవుని వాక్య పరిచర్య, తమ ప్రధమ కర్తవ్యమని, ఇతర సేవకులను, డీకనులను నియమించారు (అ. చ. 6:3-71) ఈ విధమైన ఏర్పాటుతో దేవుని వాక్కు వ్యాపించటానికి మార్గాన్ని సిద్ధపరిచారు (అ.చ6:7). ఇలా క్రైస్తవ చరిత్రలో ఒక క్రమానుసారం రూపుదిద్దుకొన్న, దివ్యబలిపూజ దైవవాక్కుపఠనాన్ని తనలో ఒక ప్రధానభాగంగా ఇముడ్చుకోవడంలో ఆశ్చర్యం లేదు. ఎందుకంటే దైవవాక్కు పఠనం లేనిదే ప్రార్ధన లేదు.

## దైవవాక్యార్చన

దివ్యపూజలో ప్రారంభ ప్రార్థన, అర్పణ మధ్యలో సుదీర్ఘంగా దైవవాక్యార్చనం జరుగుతుంది. దేవుని వాక్కును పఠనాల ద్వారా ప్రకటిస్తాం. ప్రత్యుత్తర గీతం ద్వారా దైవ వాక్కుకు స్పందిస్తాం. గురువు అధికార పూర్వకంగా వాక్యాన్ని ప్రబోధం చేస్తారు. తర్వాత దానికి కట్టుబడి ఉంటామని విశ్వాస ప్రమాణం ద్వారా దేవుని ఎదుట ప్రామాణ్యం చేస్తూ చివరగా విశ్వాసుల అందరూ కలిసి ప్రార్థన చేస్తాం. వాస్తవానికి దివ్యపూజలో మనం ప్రకటించే దేవుని మాటను కేవలం చదవటం కాదు. అది భక్తుల మధ్యన, భక్తుల కళ్లముందే జరుగుతున్న రక్షణాత్మక సంఘటన అది. ఈ రోజు దేవుడు తన భక్తుల ముందు నిలుచొని, తాను చెప్పదలచిన మాటను వినిపిస్తారు. ఈ దివ్యవాక్యార్చన ద్వారా దేవుని వాక్కు రూపుదైన క్రీస్తు భక్తులును కలుసుకుంటారు. దేవుని వాక్కులో క్రీస్తు సంపూర్ణంగా నెలకొని దర్శనమిస్తారు (దైవార్చన పత్రం నెం. 7).

## దైవవాక్యార్చన - భాగములు

**1. పఠనాలు :** బైబులు నుంచి ఈ పఠనాలను ఎంపిక చేసి, ఓ ప్రత్యేక

పద్ధతిలో దైవార్చన కాలనుగుణంగా అమర్చి ఒక పుస్తకంగా శ్రీసభ రూపొందించింది. దీన్ని "లెక్షనరీ" అంటారు.

2. **ప్రత్యుత్తర గీతం :** మొదటి పఠనం చదివిన తర్వాత, దానికి అనుగుణంగా ప్రత్యుత్తరగీతం ఉంటుంది. భక్తుల స్పందనను వ్యక్తం చేస్తుంది. సాధ్యమైనంత వరకు ఈ గీతమును భక్తులు ఆలాపన చేయాలి. ఆలాపన కుదరని పక్షంలో చెప్పాలి.

3. **అల్లెలూయ నినాదం**: సువార్త పఠనానికి ఇది పరిచయ వాక్యం దీన్ని ఎప్పుడూ పాడాల్సిందే.

4. **ప్రబోధం:** పూజకు ముందే, పఠనాల భావాన్ని క్షుణ్ణంగా పసిగట్టి, అన్ని మెలకువలు తీసుకొని, గురువు ప్రబోధాన్ని సిద్ధం చేసుకోవాలి. దివ్యవాక్కును విన్న భక్తుల క్రైస్తవ జీవనానికి తోడ్పడేలా, ప్రబోధాన్ని మలిచి చెప్పాలి.

5. **మౌనం :** దేవుని వాక్కు ప్రధానంగా మననశీలం గలది. అందువల్ల ప్రతిపఠనం విన్న తర్వాత భక్తులు మవునంగా ఉండి, చెవిన బడిన దివ్యవాణిని ధ్యానించాలి. ఆ తర్వాత గురువు చెప్పే వివరణ వినాలి.

6. **విశ్వాస ప్రమాణం :** విశ్వాస ప్రమాణం చేయడం ద్వారా, భక్తులు దేవుని వాక్కుకు తమ ఆమోదం తెలిపిన వారవుతారు. అటు పఠనం, ఇటు ప్రభోదం రెండూ భక్తులను విశ్వాసంలో దృఢ పరుస్తాయి.

7. **విశ్వాసుల ప్రార్థనల :** విశ్వ శ్రీసభ అవసరాల కోసం, స్థానిక క్రైస్తవ సంఘం కోసం వ్యక్తిగత అవసరాల కోసం, దైవాన్ని ప్రార్థించేందుకు ఈ ప్రార్థనలు తోడ్పడతాయి.

**లెక్షినరీ (పూజా పఠనముల పుస్తకము)**

పూజలో దైవవాక్యార్చన భాగంలో పఠనాలను చదివి, వినిపించడానికి ఉపయోగించే పుస్తకం ఇది. 1969లో మొదటిసారిగా ఈ పఠనాలను పుస్తకాన్ని రూపొందించారు. ఈ పఠనాలన పుస్తకం ముందుమాటలో దేవుని వాక్కుకు సంబంధించిన వేదాంత విషయాలను స్పష్టంగా వివరించారు. దైవ వాక్యార్చనకు సంబంధించిన రకరకాల సేవా కార్యక్రమాలను పేర్కొంటూ, స్పష్టమైన

ఆదేశాలను, మార్గదర్శక సూత్రాలను విపులంగా వివరించారు. లెక్షినరీ ఔన్నత్యాన్ని తెలియజేశారు. దైవవాక్యార్చన తాలూకు అనేక యితర విషయాలు కూడా ముందు మాటలో పొందుపర్చారు.

దేవుని వాక్కు పట్ల ఇస్రాయేలు ప్రజలకు అమితమైన గౌరవ ప్రపత్తులు ఉండేవి. దేవుడు తన దివ్యవాక్కు ద్వారా, వ్యక్తిగతంగా తనను తాను ప్రజలకు బయలుపరచుకున్నారనేది వాళ్ల దృఢనమ్మకం. దేవుని వాక్కు శక్తిపూర్ణమైనది. సృజనాత్మకమైనది. ప్రవక్త ప్రవృత్తి గలది. విమోచనాత్మకమైనది. దేవుని వాక్కుకు ఇలా అనేక గొప్ప సుగుణాలున్నాయని వాళ్లు నమ్మారు. నరరూపమైన దేవుని వాక్కు క్రీస్తు. కనుక, ఈ సుగుణాలన్నీ ఆయనలో సంపూర్ణంగా నెలకొని ఉన్నాయి. వాకకు రూ పంలో క్రీస్తు ఈనాడు కూడా మనతో ఉన్నాడు. దైవార్చన పత్రం ఇలా చెబుతుంది. గుడిలో బైబులు పఠనాలు చదివి వినిపించేవేళ, క్రీస్తు బైబులు మాటల ద్వారా, మనతో మాట్లాడుతారు (దైవార్చన పత్రం వ్యాసం నెం. 7). దైవార్చన పత్రం 51వ నెంబరు ఇలా చెబుతుంది. బైబిలులో దాగి ఉన్న అపార నిధులను క్రీస్తు భక్తులకు విస్తారంగా పంచాలి. కొంత నిర్ణీత కాలంలో మొత్తం బైబులును భక్తులకు పరిచయం చేయాలి.

ఆగమన కాలంతో ప్రారంభించి, అర్చనా సంవత్సరం పూర్తిగా క్రీస్తు మర్మాన్ని వాక్కులో, క్రియలో పుణ్యప్రధమంగా జరుపుకోవాలి. దేవుని వాక్కును ప్రజలకు ప్రకటించినప్పుడు శ్రీసభ నైజం మరింత స్పష్టంగా కనిపిస్తుంది. అందరూ దివ్యవాణిని వింటారు. కొందరు చదివి వినిపిస్తారు. మరికొందరు తమకున్న బోధనా అధికారం వినియోగించి దివ్యవాణిని ఈ దివ్య వాక్యారచన భాగములో వివరిస్తారు.

## దైవార్చనలొ దేవుని వాక్కు

## వాక్కు ప్రకటన చేయు స్థలం

సువార్త ప్రకటన చేయుటకు దేవాలయంలో ఒక ప్రత్యేకమైన ప్రదేశం ఉండాలి. అది విశ్వాసులకు అర్థమయ్యే విధంగా మరియు విశ్వాసులంతా దేవుని వాక్కు అర్థం చేసుకునే విధంగా ఆ ప్రదేశము ఉండవలెను. ప్రతి ఒక్క దైవ వాక్కు ప్రకటించుటకు వివరించుటకు ఒక ప్రత్యేకమైన స్థలము కలదు

దానినే (దివ్యవాక్యాసనం) “అంబో” అని అంటాము అది గ్రీకు భాష నుండి ఉద్భవించింది “దానినే లేచి నిలబడడం” అని అంటారు. “ఆంబో” దైవార్చనలో ఒక పరిశుద్ధ స్థలముగా పిలువబడుతుంది దాని దగ్గర సువార్త పుస్తకము మరియు రోజువారి పఠనాలు పుస్తకం మాత్రమే ఉండవలెను ఇతర ఏ పుస్తకాలు మరియు కాగితాలు ఉండరాదు దేవుని వాక్యము ఈ యొక్క ambo నుండి మాత్రమే ప్రకటించవలెను. దైవ వాక్కు పఠనంలు గీతము పునరుద్ధ యేసు యొక్క ప్రకటన మాత్రమే ప్రకటించబడుతుంది అదేవిధంగా దేవుని యొక్క వాక్కును ప్రకటింపబడుతుంది విశ్వాసుల ప్రార్ధన కూడా ఉపయోగపడుతుంది. దైవవాక్కును ప్రకటించడానికి ambo ఉపయోగించాలి ఇతర ప్రకటనలకై వేరే ప్రదేశాన్ని ఉపయోగించడానికి ప్రయత్నించాలి.

## పరిశుద్ధ పఠనం చదువు ప్రదేశం

దైవార్చనలో దైవవాక్కు ప్రకటన చేయుటకు దేవాలయంలో ఒక ప్రదేశంలో సువార్తను ప్రకటించడానికి ఒక పరిశుద్ధమైన స్థలము కావలెను దీని ద్వారా విశ్వాసులకు దేవుని వాక్కు ఇటువంటి ఆటంకాలు కలగకుండా వారంతా దేవుని వాక్కు పై శ్రద్ధ చూపే విధంగా ఉండాలి. దేవాలయంలో ambo పెట్టు ప్రదేశాన్ని చక్కగా తయారు చేయవలెను మరియు గురువు మరియు పఠనాలు చదివేవారు అందరికీ కనిపించే ప్రదేశంలో పెట్టవలెను.

## దైవ వాక్కు క్రమం

నేటి దైవ వాక్కు పుస్తకం మూడు సంవత్సరాల ఆదివారం పఠనాలతో, అదేవిధంగా రెండు సంవత్సరాల వార దినాల యొక్క పఠనలు ముద్రణ చేయబడి ఉన్నాయి. మూడు పఠనాలు ఆదివారము మరియు మహోత్సవ సమయాలలో ఉపయోగిస్తారు. మొదటి పఠనం పాత నిబంధన నుండి రెండవ పఠనం అపోస్తులల పుస్తకాల నుండి మూడో పఠనం ఒక సువార్త నుండి తీసుకోబడుతుంది.

వార దినములలో రెండు పఠనాలు మాత్రమే తీసుకోబడతాయి.

## పాఠకులు

పాఠకుడు అంటే పఠనాలను చదివే వ్యక్తి. పఠనాలను ప్రకటించే పని

అధ్యక్షుడిగా కాకుండా పరిచర్య ద్వారా సంప్రదాయం ప్రకారం జరుగుతుంది. అందువల్ల పఠనలను ఒక పాఠకుడు చదవాలి, కానీ సువార్తను డీకన్ (ఉపగురువు) లేదా అతను లేనప్పుడు, గురువు చదవాలి. అయితే, ఒక డీకన్ లేదా మరొక గురువు హాజరు కాకపోతే, గురువు స్వయంగా సువార్తను చదవాలి. మరియు అంతేకాకుండా, పాఠకుడు ఎవరూ లేకుంటే, గురువు (Celebrant) ఇతర పఠనాలను కూడా ప్రకటించాలి.

**మొదటి పఠనం**

ఆదివారాలు మరియు ప్రత్యేక వేడుకలలో మూడు పఠనాలను కేటాయించాయి, (అంటే, ఒక ప్రవక్త, ఒక అపొస్తలుడు మరియు ఒక సువార్త నుండి), దీని ద్వారా క్రైస్తవ ప్రజలు దేవుని అద్భుతమైన రూపకల్పన ప్రకారం రక్షణ పని యొక్క కొనసాగింపులో బోధించబడతారు. ఈ పఠనాలను ఖచ్చితంగా పాటించాలి. పాస్కా కాలంలో శ్రీసభ సంప్రదాయం ప్రకారం, పాత నిబంధన నుండి కాకుండా, పఠనం అపొస్తలుల కార్యాల నుండి తీసుకోబడింది (GIRM 357).

**ప్రభువు వాక్కు**

“దేవుని వాక్యం సజీవమైనది మరియు ప్రభావవంతమైనది (హెబ్రీ: 4:12). అది లేకుండా, మన విశ్వాసం నిర్జీవంగా ఉంటుంది. అందుకే లెక్షనరీని ఎత్తి చూపి “ప్రభువు వాక్కు” అని చెప్పమని పాఠకుడిని నిర్దేశించే సూచన లేదు. వెర్బమ్ డొమిని అనేది లిఖిత వచనం కాదు; ఇది లేఖన ప్రకటన.”

“ఇది ప్రభువు వాక్కు” లేఖన పఠనాల ముగింపులో ప్రకటన “ప్రభువు వాక్కు”గా మార్చబడింది మరియు ఇది క్రీస్తు సువిశేషము అనేది క్రీస్తు సువిశేషముగా మారింది (లాటిన్ వచనం వెర్బమ్ డొమిని). దానికి ప్రతిస్పందన ప్రజల నుండి సర్వేశ్వరునికి వందనములు మరియు క్రీస్తువా మీకు స్తుతి కలుగును గాక!

ఈ మార్పు రెండు లక్ష్యాలను సాధిస్తుంది. మొదటిది, వాక్య ప్రార్థన, దివ్య సత్ప్రసాద ప్రార్థనతో సామరస్యంగా తీసుకురాబడింది. యాజకుడు “క్రీస్తు శరీరం” అని చెబుతాడు, “ఇది క్రీస్తు శరీరం” అని కాదు మరియు అదేవిధంగా,

"క్రీస్తు రక్తం" అని చెబుతాడు మరియు "ఇది క్రీస్తు రక్తం" అని కాదు. ఇప్పుడు మనం "ప్రభువు వాక్కు" మరియు "ప్రభువు సువార్త" అని అంటాము.

## దేవునికి కృతజ్ఞతలు

రెండవ శతాబ్దంలో ఇప్పటికే తెలిసిన తొలి క్రైస్తవ కృతజ్ఞతా సూత్రం Deo gratias (దేవునికి కృతజ్ఞతలు). పఠనాల ముగింపులో, ఇది దేవుని వాక్యం అందించిన ప్రయోజనాలకు కృతజ్ఞతను వ్యక్తపరుస్తుంది మరియు పూజ ముగింపులో, ప్రభు శరీర రక్తం నుండి పొందిన కృపలకు కృతజ్ఞతలు తెలుపుతుంది. పాస్కా కొవ్వొత్తి వెలిగించిన తర్వాత గురువు మూడుసార్లు ఇలా ప్రకటిస్తాడు: "క్రీస్తు జ్యోతి", దానికి ప్రజలు మూడుసార్లు స్పందిస్తారు, "సర్వేశ్వరునికి వందనములు".

ప్రార్థనా విధానంలో వాక్య ప్రకటన దేవుని వాక్యాన్ని వినడం మరియు దానికి ప్రతిస్పందించడం అనే సంభాషణాత్మక చర్య కనిపిస్తుంది. మరియు ఆశిస్తుంది. "దేవునికి కృతజ్ఞతలు" అనే మన ప్రతిస్పందన చాలా సరళంగా అనిపిస్తుంది, అయినప్పటికీ "దేవునికి కృతజ్ఞతలు" అని చెప్పడం ద్వారా. ఈ చిన్న ప్రతిస్పందన వేదాంతశాస్త్రం మరియు నిబద్ధత యొక్క సంపదను సూచిస్తుంది. తత్ఫలితంగా, "దేవునికి కృతజ్ఞతలు" అనేది కేవలం 'ధన్యవాదాలు' కాదు, దేవుని ప్రకటించిన వాక్యానికి మన నిబద్ధతను బహిరంగంగా మరియు ఆచారబద్ధంగా ప్రకటించే ప్రశంస. మోషే నిబంధన గ్రంథాన్ని ప్రకటించినప్పుడు ఇశ్రాయేలీయులు చేసిన ఒక నినాదం లాంటిది ఇది: "ప్రభువు చెప్పినదంతా మేము చేస్తాము, మేము విధేయులమై ఉంటాము" (నిర్గమ 24:7).

**మనం మూడు విషయాలను తెలుసుకోవాలి:**

(ఎ) పాత నిబంధనలో దేవుడు మనతో మాట్లాడుతున్నాడు. పాత నిబంధన ద్వారా, ఆయన మనకు తన ప్రేమ, విశ్వాసం మరియు మన బాధ్యతను వెల్లడిస్తాడు.

(బి) పరిశుద్ధ గ్రంథంలో చిత్రీకరించబడిన ప్రజలు నిజమైనవారు. దాని ద్వారా మనం కూడా ఎన్నుకోబడిన ప్రజలమని మనకు గుర్తు చేయబడుతుంది.

(సి) గతంలో జరిగిన సంఘటనలు నేడు మనకు ఏం తెలియజేస్తున్నాయి

అంటే మనం భూమిపై ప్రవాసంలో ఉన్న కొత్త ఇశ్రాయేలీయులు.

## ప్రత్యుత్తర గీతం కీర్తన

"మొదటి పఠనం తర్వాత ప్రత్యుత్తర గీతం (కీర్తన) వస్తుంది, ఇది వాక్య ప్రార్ధనలో అంతర్భాగం మరియు ఇది దేవుని వాక్యంపై ధ్యానాన్ని పెంపొందిస్తుంది కాబట్టి ఇది గొప్ప ప్రార్ధనా మరియు మతసంబంధమైన ప్రాముఖ్యతను కలిగి ఉంటుంది.

క్రైస్తవ ఆరాధనలో లేఖనం నుండి పఠనాలతో కీర్తనలను పాడటం గురించి టెర్టులియన్ ప్రస్తావించాడు. పునీత అగస్టీన్ కీర్తనలపై బోధించాడు, ప్రకటించబడిన పఠనాలలో వాటి ప్రాముఖ్యతను పెంచాడు. కీర్తనను పవిత్ర గ్రంథం నుండి పాడవచ్చు, కానీ దాని వచనం పవిత్ర గ్రంథం నుండి వచ్చినందున దివ్యవాక్యాసనం నుండి చదవాలి.

గమనిక: కీర్తనలు క్రీస్తు రాకముందే ఉన్నటువంటి విలువైన వారసత్వాలు. దానిలో క్రీస్తు ప్రార్థించినవి. ఆయనలో నెరవేరిన కీర్తనలు శ్రీసభ ప్రార్ధనకు చాలా ముఖ్యమైనవి (CCC.2586).

## రెండవ పఠనం

ప్రతీ ఆదివారాలలోను మరియు ఉత్సవాలలోను దివ్యబలిపూజకు రెండవ పఠనం ఉంటుంది. పఠనం చిన్నది మరియు ప్రజలు సులభంగా గ్రహించగలరు. రెండవ పఠనం క్రైస్తవ జీవనానికి సంబంధించినది మరియు నాలుగు సువార్తలు కాకుండా కొత్త నిబంధనలోని ఇతర భాగాల నుండి తీసుకోబడింది.

క్రమం: పునరుత్థాన పండుగ ఆదివారం మరియు పెంతెకోస్తు రోజున తప్ప, ఐచ్ఛికంగా ఉన్న క్రమం అల్లెలుయాకు ముందు పాడబడుతుంది. (GIRM: 64).

**అల్లెలూయ వచనం:** అల్లెలుయా సువార్త ఊరేగింపుతో పాటు వస్తుంది మరియు తపస్సు కాలలో కాకుండా మిగత రోజులలో పాడబడుతుంది. (GIRM.62).

తపస్సు కాల సమయంలో, అల్లెలుయా స్థానంలో, సువార్తకు ముందు భాగం పఠనాల గ్రంథంలో సూచించినట్లుగా చద్దీవబడుతుంది.

(ఎ) తపస్సు కాలం కాకుండా సంవత్సరంలో ప్రతి సమయంలో అల్లెలుయా పాడబడుతుంది. పఠనాల గ్రంథంలో నుండి తీసుకోబడ్డాయి.

(బి) తపస్సు కాలం సమయంలో, అల్లెలుయాకు బదులుగా, పఠన గ్రంథంలో ఇవ్వబడిన సువార్తకు ముందు వాక్యలు పాడబడుతుంది. అల్లెలుయా పాడేటప్పుడు కూర్చోవడం నుండి నిలబడటానికి భంగిమలో గణనీయమైన మార్పు జరుగుతుంది. నిలబడి ఉన్న భంగిమ ఆనందం, భక్తి మరియు అప్రమత్తతను వ్యక్తపరుస్తుంది.

సువార్త ప్రశంసలు దివ్యవాక్యాసనం (GIRM.309) నుండి చెప్పబడవు. దీనిని గాయకుడి స్టాండ్ నుండి లేదా గాయక బృందం ప్రాంతం నుండి పాడవచ్చు.

**తపస్సు కాల సమయంలో/ బయట తపస్సు కాల సమయంలో**

తపస్సు కాల కాకుండా కాల అనుగుణంగా అల్లెలుయా పాడతారు. వచనాల పవిత్ర గ్రంథం నుండి తీసుకోబడ్డాయి.

'సువార్తకు ముందు ఒకే ఒక పఠనం ఉన్నప్పుడు"

అల్లెలుయా చెప్పాల్సిన సమయంలో, అల్లెలుయా కీర్తన లేదా ప్రతిస్పందన కీర్తన తర్వాత దాని వాక్యలతో అల్లెలుయాను ఉపయోగించవచ్చు; అల్లెలుయా చెప్పకూడని సమయంలో, కీర్తన మరియు సువార్తకు ముందు ఉన్న వాక్యాలు లేదా కీర్తన మాత్రమే ఉపయోగించవచ్చు.

**ఉపగురువు లేదా గురువు సిద్ధపాటు**

ధూపం వేసే, గురువు ధూపం పాత్రలో సాంబ్రాణి కొంత వేస్తాడు. ఈలోగా, విశ్వాసులు అల్లెలుయా ద్వారా దేవునికి తమ తెలియజేస్తారు. అప్పుడు సువార్తను ప్రకటించాల్సిన డీకన్ ముందు వంగి, తక్కువ స్వరంతో ఆశీర్వదించి దేవుని వాక్యాన్ని ప్రకటిస్తాడు. డీకన్ లేకపోతే, గురువు చేతులు జోడించి, బలిపీఠం ముందు వంగి, వినబడకుండా ప్రార్థన చేస్తాడు, సర్వశక్తిమంతుడైన దేవా, నా హృదయాన్ని మరియు నా పెదవులను శుభ్రపరచుము, నేను నీ పవిత్ర సువార్తను యోగ్యతతో ప్రకటించగలను.

## సువార్త ప్రకటన

ఒక డీకన్ ఉంటే, అతను సువార్త పుస్తకాన్ని తీసుకువెళతాడు; లేకపోతే, పాఠకుడు దానిని తీసుకువెళతాడు. "ఈ పుస్తకాన్ని రెండు చేతుల్లోనూ కొద్దిగా పైకి ఎత్తి తీసుకెళ్లాలి, కానీ చాలా ఎత్తుగా పట్టుకోకుండా, దానిని ఎప్పుడూ ఒక వైపు నుండి మరొక వైపుకు ఊపకూడదు. ఈ పుస్తకాన్ని మోసుకెళ్ళే ఎవరైనా ఈ పవిత్ర వస్తువు కోసం గర్భగుడి వద్దకు వచ్చినప్పుడు వంగి నమస్కరించడం దివ్యపూజ గ్రంథం పఠనములు చదువు పుస్తకం క్రీస్తుకు చిహ్నం.

పవిత్ర గ్రంథం కాకుండా సువార్తల పుస్తకం మాత్రమే ప్రకటనకు తీసుకువెళతారు. పవిత్ర గ్రంథం (అన్ని పఠనాలను కలిగి ఉన్న పుస్తకం) మాత్రమే ఉంటే, దానిని దివ్యపూజబలి ముందు దివ్యవాక్యాసనం వద్ద ఉంచుతారు. సువార్తల పుస్తకం ఉపయోగించబడకపోతే, పాఠకులు పఠనాలు చదివేవారు మరియు ఇతర వత్తాసు పిల్లలు అనుసరించవచ్చు.

## గురువు ధూపం వేయుట

దివ్యవాక్యాసనం వద్ద, గురువు పుస్తకాన్ని తెరిచి, చేతులు జోడించి, డొమినస్ వోబిస్కుం (ప్రభువు మీతో ఉంటాడు) అని చెబుతాడు, మరియు ప్రజలు స్పందిస్తారు, ఎట్ కమ్ స్పిరిటు టువో (మరియు మీతో కూడా ఉందురు గాక). తరువాత అతను లెక్టియో సాంక్టి ఎవాంజెలి (పవిత్ర సువార్త నుండి పఠనం) అని చెబుతాడు, పుస్తకంపై తన బొటనవేలుతో సిలువ గుర్తును ఉంచుతాడు మరియు  అతని నుదిటి, నోరు మరియు వక్షస్థలంపై, మిగతా అందరూ అలాగే చేస్తారు. గురువు సువార్తల పుస్తకాన్ని ధూపం వేస్తాడు, ధూపం వేస్తే; అల్లెలుయా లేదా ఇతర శ్లోకం పాడేటప్పుడు గురువు ధూపం వేసేటప్పుడు డీకన్ అతనికి సహాయం చేస్తాడు. తరువాత అతను గురువు ముందు లోతైన వంగి ఆశీర్వాదం అడుగుతాడు, ఆ పుస్తకాన్ని కొద్దిగా పైకి ఎత్తి, దైవవాక్యార్చన పీఠము వద్దకు వెళ్తాడు. అతను పుస్తకాన్ని ధూపం వేస్తాడు మరియు సువార్త పఠనాన్ని ప్రకటిస్తాడు.

## సువార్త ప్రకటన

"సువార్త" అనే పదానికి అక్షరాలా "శుభవార్త" అని అర్థం. "సువార్త పఠనం వాక్య ప్రార్థన యొక్క అత్యున్నత స్థానం, సువార్తను వింటున్నప్పుడు సమాజం నిలుస్తుంది (SC.7). నెహెమ్యా పుస్తకంలో, మనం ఇలా చదువుతాము: "ఎజ్రా ప్రజలందరి దృష్టిలో పుస్తకాన్ని తెరిచాడు, ఎందుకంటే అతను ప్రజలందరి కంటే పైన నిలబడి ఉన్నాడు మరియు అతను దానిని తెరిచినప్పుడు ప్రజలందరూ నిలబడ్డారు" (8:5).

## ముగింపు

దివ్యవాక్యార్చన అనేది దివ్యబలిపూజలో ఆధ్యాత్మిక పోషణకు కీలకమైన పాత్రపోషిస్తుంది. ఇది చర్చి జీవితంలో లేఖనాల ప్రాముఖ్యతను నొక్కి చెబుతుంది, విశ్వాసులు పఠనాలు, ప్రతిబింబం మరియు ప్రార్థన ద్వారా దేవుని సందేశంతో నిమగ్నమవ్వడానికి వీలు కల్పిస్తుంది. అవగాహనను లోతుగా చేయడం మరియు సమాజాన్ని పెంపొందించడం ద్వారా ఈ భాగం సమాజాలను వారి విశ్వాసాన్ని జీవించడానికి మరియు తరువాత జరిగే దివ్యబలిలో పూర్తిగా పాల్గొనడానికి సిద్ధం చేస్తుంది. అంతిమంగా, ఇది దేవుని వాక్యం సజీవంగా మరియు పరివర్తన కలిగించేదిగా ఉందనే నమ్మకాన్ని బలపరుస్తుంది, విశ్వాసులను వారి ఆధ్యాత్మిక ప్రయాణాలలో నడిపిస్తుంది.

## సువార్త బోధన (హోమిలీ)

"హోమిలీ" అనే పదం గ్రీకు పదం 'హోమిలియా' నుండి వచ్చింది, దీని అర్థం సంభాషణ లేదా "ఉపన్యాసం". ఈ పదం గ్రీకు క్రియాపదమైన 'హోమిలిన్"లో పాతుకుపోయింది, దీని అర్థం "సంభాషించడం" లేదా మాట్లాడటం". చారిత్రాత్మకంగా, హోమిలీ ఈ సంభాషణ మూలాల నుండి క్రైస్తవ ఆరాధన అనేది అధికారిక అంశంగా పేరు పొందింది, ప్రత్యేకంగా ప్రార్థనా సమయంలో ఇచ్చిన ఉపన్యాసం లేదా ప్రతిబింబాన్ని సూచిస్తుంది.

ద్వితీయ వాటికన్ మహాసభ, పూజ బలిలో ఇది ఒక భాగమని, ప్రత్యేకించి ఆదివారాలు మరియు పండగ దినాలలో (SC 52) ప్రజలు ఎక్కువ మంది వచ్చిన సమయంలో విస్మరించరాదని నొక్కి చెప్పింది. క్రైస్తవ జీవితం యొక్క

పోషణకు సువార్త బోధించడం అవసరం (GIRM 65). సువార్త బోధన అనేది పూజ బలిలో ముఖ్యంగా రోమన్ కాథలిక్ సంప్రదాయాలలో ఒక పీఠాధిపతి యాజకుడు, లేదా ఉపగురువు చెప్పే సువార్త బోధన (C.767). ఇది సాధారణంగా ఆనాటి పవిత్ర గ్రంథము పఠనాలపై ఆధార్పడి ఉంటంది మరియు పవిత్ర గ్రంథ బోధనలను సమాజం యొక్క దైనందిన జీవితాలకు వర్తించే వివరణను అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. విస్తృత వేదాంతపరమైన లేదా సిద్ధాంతపరమైన సమస్యలను పరిష్కరించగల అధికారిక ఉపన్యాసం వలె కాకుండా, ఒక సువార్త బోధన సాధారణంగా ఆచరణాత్మక అనువర్తనం మరియు వ్యక్తిగత జీవితాలపై ఎక్కువ దృష్టి పెడుతుంది.

మన దైనందిన జీవితంలో సువార్త బోధలను అర్థం చేసుకోవడానికి మరియు జీవించడానికి సమాజానికి సహాయం చేయడమే సువార్త యొక్క ఉద్దేశ్యం. ఇది పురాతన గ్రంథాలు మరియు సమకాలీన అనుభవాల మధ్య అంతరాన్ని తగ్గించడానికి ఉపయోగపడుతుంది, సమాజం యొక్క ఆధ్యాత్మిక అవసరాలకు అనుగుణంగా ప్రోత్సాహాన్ని అందిస్తుంది. సువార్త భోదించడం ద్వారా మరియు విశ్వాసుల ప్రత్యక్ష అనుభవానికి వాటిని తెలియజేయడం ద్వారా, వారి ఆధ్యాత్మిక ప్రయాణంలో సమాజాన్ని ప్రేరేపించడం, విద్యావంతులు చేయడం మరియు మార్గనిర్దేశం చేయడం సువార్త బోధన యొక్క లక్ష్యం.

16వ బెనెడిక్ట్ పాపుగారు ఇలా అంటారు, "పూజ బలిలో భాగం మరియు ఇది విశ్వాసుల జీవితాల్లో ఫలాలను ఇవ్వడానికి, దేవుని వాక్యంపై లోతైన అవగాహనను పెంపొందించడానికి ఉద్దేశించబడింది."

## ఎవరు బోధించగలరు?

రోమన్ కాతోలిక్ చర్చిలో, (ఉదా., ఆగమనం, క్రిస్మస్, తపస్సుకాలం, పునరుత్థాన పండుగ మరియు సాధారణ సమయం) సంబంధం లేకుండా సంవత్సరం పొడవునా పూజాబలి సమయంలో ఎవరు బోధించవచ్చనే నియమాలు ఉన్నాయి. ఎవరు ధర్మోపదేశం చేయవచ్చనే మార్గదర్శకాలను మనం ఇక్కడ చూడవచ్చు: నియమిత గురువులు: ఎక్కువగా, సువార్త బోధన సాధారణంగా నియమిత గురువులచే అందించబడుతుంది, ప్రత్యేకంగా

పీఠాధిపతులు, గురువులు మరియు ఉపగురువులు పవిత్ర పూజాబలిలో బోధించడానికి అనుమతించబడతారు. (C. 763-764)

**శ్రద్ధ వహించాల్సిన అంశాలు:**

సాధారణంగా, సామాన్య ప్రజలు పూజాబలి సమయంలో సువార్త బోధన ఇవ్వడానికి అనుమతించబడరు. ధర్మాసనం నియమిత గురువుల కోసం ప్రత్యేకించబడింది, ఎందుకంటే ఇది మతకర్మ ప్రమాణం అవసరమయ్యే ప్రార్థనా చర్యలో భాగం. ఏది ఏమైనప్పటికీ, సామాన్య ప్రజలు ప్రార్థన సేవలు, లేదా ప్రార్థనలను నేర్పించడం వంటివి పూజాబలి వెలుపల చేయవచ్చు. (GIRM 66)

గురువులు, సువార్త బోధన చేసినప్పుడు వారు సిలువ గుర్తుతో ప్రారంభించకూడదు లేదా ముగించకూడదు, ప్రకటనలు ఏమీ చేయకూడదు 'ఆమెన్' చెప్పకూడదు మరియు ప్రార్థన కూడా చేయకూడదు.

**మినహాయింపులు:**

ప్రధాన ప్రార్థనా వేడుకలు లేదా పండగ వంటి కొన్ని సందర్భాల్లో, ముఖ్య అతిథిగా గురువులను లేదా పీఠాధిపతులు బోధించడానికి ఆహ్వానించబడవచ్చు. అప్పుడు నూతనంగా అభిషేకించబడిన గురువులు మరియు ఉపగురువులు వారి ప్రారంభ నియామకాలు మరియు పరిచర్యలో అనుభవాలలో భాగంగా బోధించడానికి అవకాశం ఇవ్వవచ్చు.

చాలా అరుదైన సందర్భాల్లో మరియు ప్రత్యేక అనుమతితో, ప్రత్యేక మతపరమైన అధికారం ఇవ్వబడిన ఒక సాధారణ వ్యక్తి పూజాబలి సందర్భంలో బోధించడానికి అనుమతించబడవచ్చు. అయితే, ఇది చాలా అసాధారణమైనది మరియు సాధారణంగా పిఠాధిపతుల యొక్క స్పష్టమైన అనుమతి అవసరం. (C. 766)

**విశ్వాస ప్రమాణము**

విశ్వాస ప్రమాణము అనేది ప్రత్యేకంగా సువార్త బోధన తర్వాత మరియు విశ్వాసుల ప్రార్థనల ముందు పఠించే విశ్వాస ప్రకటన. ఆదివారాలు మరియు ఇతర వేడుకల్లో, విశ్వాస ప్రమాణమును గురువు మరియు ప్రజలు కలిసి చెబుతారు (GIRM 68). ఇది కతోలిక విశ్వాసం యొక్క ముఖ్యమైన నమ్మకాల

సారాంశంగా పనిచేస్తుంది, క్రైస్తవ మతాన్ని నిర్వచించే ప్రధాన సిద్ధాంతాలను కలుపుతుంది.

పూజాబలిలో విశ్వాస ప్రమాణము యొక్క రెండు విధాలుగా ఉపయోగించబడతాయి: నీసెయా కాన్స్టాంటినోపులు విశ్వాస ప్రమాణము లేదా అపోస్తుల విశ్వాస సంగ్రహము పూజాబలిలో ఉపయోగించవచ్చు. (RM 19) విశ్వాస ప్రమాణము, 325 ADలో మొదటి నైసియా తీర్మానంలో రూపొందించబడింది మరియు అపోస్తుల విశ్వాస ప్రమాణము, విశ్వాసం యొక్క పాత ప్రకటన, రోజువారీ ప్రార్థనల వంటి ఇతర సందర్భాలలో తరచుగా ఉపయోగించబడుతుంది.

## విశ్వాస ప్రమాణము యొక్క ప్రాముఖ్యత (RM 67)

1. విశ్వాస ప్రమాణము యొక్క ధృవీకరణ: ఆదివారం పూజాబలి సమయంలో మనం విశ్వాసాన్ని పఠిస్తున్నప్పుడు మన విశ్వాసాన్ని బహిరంగంగా ధృవీకరించే అవకాశాన్ని సమాజానికి అందిస్తుంది. ఇది క్రైస్తవ మతం యొక్క ప్రధాన సిద్ధాంతాల యొక్క సమిష్టి ప్రకటన, భాగస్వామ్య విశ్వాసాలలో ప్రజాలందరిని ఏకం చేస్తుంది.
2. ప్రార్థనా సందర్భం: విశ్వాస ప్రమాణము సాధారణంగా పఠనాలను అనుసరిస్తుంది. ప్రకటించబడిన దేవుని వాక్యాన్ని సంగ్రహించడంలో మరియు ప్రతిస్పందించడంలో ఈ స్థానం దాని పాత్రను నొక్కి చెబుతుంది. ఇది వాక్య బోధన మరియు దివ్యసప్రసాదం యొక్క ప్రార్థనలను వంతెన చేస్తుంది, మతకర్మ కోసం సన్నాహక విశ్వాసాన్ని ధృవీకరిస్తుంది.
3. ప్రతిబింబం మరియు పునరుద్ధరణ: ఆదివారాలు, “దేవుని యొక్క రోజు” గా మన క్రైస్తవ ఆరాధనలో ప్రత్యేకించి ముఖ్యమైనవి. విశ్వాస ప్రమాణము యొక్క వృత్తి విశ్వాసులు మన విశ్వాసం యొక్క కేంద్ర రహస్యాలను ప్రతిబింబించే ఒక క్షణం, ఈ నమ్మకాలకు మన నిబద్ధతను పునరుద్ధరించండి మరియు మన దైనందిన జీవితంలో మనల్ని జీవించేలా చేస్తుంది.

## విశ్వాసుల ప్రార్థన

విశ్వాసుల ప్రార్థన అనే దివ్యబలిపూజలో ఒక భాగం. అంతవరకు ప్రజలు

దేవుని వాక్యాని ఆలకించి మరియు దాని ద్వారా పోషణ పొందారు, ఇప్పుడు శ్రీసభ మరియు ప్రపంచ అవసరాల గురించి ఆలోచించి, వాటి కోసం ప్రార్థించే స్థితిలో ఉన్నారు. విశ్వాసుల ప్రార్థన, సాధారణ మధ్యవర్తిత్వాల ప్రార్థన అని కూడా పిలుస్తారు, ఇది శ్రీసభ మరియు ప్రపంచం తరపున ఉండే విన్నపాలు అలానే పీడితప్రజాలు ఇంకా స్థానికసంఘపు అవసరాలు యొక్క ప్రార్థనల శ్రేణి (RM.70). పూజాబలి యొక్క ఈ భాగంలో, గురువులు లేదా ఉపగురువులు ఆసనం నుండి ఉద్దేశాలను పరిచయం చేస్తారు మరియు దివ్యా వాక్యార్చన అసనము లేదా ఇతర అనువైన ప్రదేశం నుండి పఠనలుచదివే వ్యక్తి ద్వారా మధ్యవర్తిత్వం చదవబడుతుంది. (RM.71). “ఓ ప్రభూ, మా ప్రార్థన అలకించండివ అనే పదబంధాన్ని తరచుగా ఉపయోగిస్తూ, సంఘం నిలబడి, ప్రతి విన్నపాలుకు ప్రార్థనతో ప్రతిస్పందిస్తుంది. ఉద్దేశాలు సాధారణంగా శ్రీసభ, ప్రపంచం, అవసరమైన వారికీ మరియు మరణించిన వారి కోసం ప్రార్థనలను చేస్తారు.

## దైవవాక్యార్చన

దైవవాక్యార్చనకు సంబంధించిన దివ్యపూజ గ్రంధపు సాధరణ నియమాలు

128. సంఘంప్రార్థన ముగిసిన పిదప అందరు కూర్చుందురు. అవసరానుకూలముగ యాజకుడు దైవవాక్యార్చనకు చిన్న పరిచయపలుకులు చెప్పవచ్చును. పాఠకుడు దైవవాక్యాసనమును సమీపించి, ఇదివరకే దానిమీద ఉంచిన పఠనములు పుస్తకమునుండి మొదటి పఠనమును చదువును. అందరు దానిని శ్రద్ధగా అలకింతురు. పఠనానంతరము పాఠకుడు బిగ్గరగా, “ఇది ప్రభుని వాక్కు” అని చెప్పును. అందరు ప్రత్యుత్తరముగా “సర్వేశ్వరునికి వందనములు” అని చెప్పును. అవసరమైనచో, వారు వినినదానిపై ధ్యానించుటకు అందరు కొంచెము సేపు మౌనము వహింతురు.
129. గాయకుడు లేక ఒక పాఠకుడు కీర్తనలోని వచనములను బిగ్గరగా చదువగా అందరు ప్రత్యుత్తరవచనమును (పల్లవిని) పాడుదురు లేక చెప్పుదురు.
130. సువిశేషమునకు ముందు రెండవ పఠనము ఉన్నయెడల, పాఠకుడు దైవవాక్యాసనము నుండి దానిని ప్రకటించును. అందరు విని, పైన

చెప్పిన విధముగా, పఠనానంతరము ప్రత్యుత్తరమిచ్చుదురు. అవసరమైనచో కొంచెముసేపు మౌనము పాటింతురు.

131. తరువాత, అందరు నిలుచుందురు. దైవార్చనా కాలమునకు అనుగుణముగా అల్లెలూయా లేక వేరొక వచనమును పాడుదురు (చూడుము సంఖ్య 62–64)

132. ధూపమును ఉపయోగించిన యెడల, "అల్లెలూయా" లేక వేరొక వచనము పాడునప్పుడు, యాజకుడు కొంత సాంబ్రాణిని ధూపపాత్రలో వేసి దానిని ఆశీర్వదించును. తరువాత, చేతులు జోడించి, పీఠము వైపుదివ్యహణ గ్రంథవు సాధారణ నియమావళి శిరము వంచి, తనలోతాను విద్వశక్తిగల నీ మశేషమును యోగము అను ప్రార్థనను చెప్పును.

133. సువార్త గ్రంథము పీఠముపై ఉన్న యెడల యాజకుడు దానిని తీసికొని కొంచెము పైకెత్తి పట్టుకొనుచు దైవవాక్యాసనము దగ్గరకు వెళ్ళను సహాయకులు ధూపపాత్రము, వత్తులను చేతబూని ఆయనకు ముందుగా వెల్లుదురు. అక్కడున్న వారందరు క్రీస్తు సువార్తకు గౌరవసూచకముగా దైవవాక్యాననము వైపు తిరిగి నిలుచుందురు.

134 దైవవాక్యాసనము చెంత, యాజకుడు పుస్తకమును తెరచి, చేతులు జోడించి ప్రభువు మీతో నుందునుగాక అనగా, ప్రజలు "మీ ఆత్మతోను ఉండునుగాక" అని ప్రత్యుత్తరమిచ్చుదురు తరువాత. ఆయన "పునీత. ...వ్రాసిన సువిశేషములోని భాగము". అని చెప్పి పుస్తకముపై, తరువాత నొసటిపై. పెదవులపై, రొమ్మునై సీవ గురుతు వేసికొనును. అందరు అతనిని అనుసరించి అట్లే చేయుదురు. ప్రజలు ప్రత్యుత్తరముగా, 'ప్రభువా, నీకు మహిమ కలుగునుగాక'. అని చెప్పుదురు. ధూపము ఉపయోగించిన యెడల, యాజకుడు పుస్తకమునకు ధూపము వేయును (చూడుము: సంఖ్య 276–277) పిదప, సువిశేషమును ప్రకటించి, అది ముగిసిన పిదప, "ఇది ప్రభుని వాక్కు" అని చెప్పుదురు. ప్రజలు ప్రత్యుత్తరముగా, "క్రీస్తువా, నీకు స్తుతి కలుగునుగాక" అని చెప్పుదురు. యాజకుడు పుస్తకమును ముద్దిడి, క్రీస్తు సువిశేష బోధనలు ద్వారా మన పాపములు మన్నింపబడును గాక అని తనలోతాను చెప్పుకొనును.

135. పాఠకుడు లేని పక్షమున, యాజకుడు తానే దైవవాక్యాననమునుండి

పరనము లన్నిట్నీ, అవసరమైనచో. పరనము తరువాతి కీర్తనను చదువును. ధూపము ఉపయోగించిన యెడల దైవవాక్యాసనముచెంతనే యుండి ధూపపాత్రలో సాంబ్రాణి వేసి, శిరము వంచి తనలోతాను సర్వశక్తిగల సర్వేశ్వరా, నేను నీ సువిశేషమును యోగ్యము అని ప్రార్థించును.

136. యాజకుడు అవసరానుకూలముగా దైవవాక్యాసనమువద్దగాని, తన ఆసనము దగ్గరగాని, వేరొక స్థలమువద్దగాని నిలుచుండి ఉపదేశము చేయును. ఉపదేశము తరువాత, కొంత సేపు మౌనము పాటింపవలయును.

137. అందరు నిలుచుండగా, యాజకుడు ప్రజలతో కలసి విశ్వాసప్రమాణము అలాపించును లేక చెప్పును (చూడుము: సంఖ్య 68). "పవిత్రాత్మ ప్రభావమువలన... మానవుడాయెను" అను మాటలు చెప్పినపుడు వలేక ఆలపించు సమయములో అందరు శిరములు వంచుదురు. కాని, మంగళవార్త పండుగ రోజునను, ప్రభువు జయంతి మహోత్సవము నాడును ఈ మాటలు ఉచ్ఛరించునపుడు అందరు మోకరింతురు.

138. విశ్వాసప్రమాణము ముగిసిన పిదప, యాజకుడు తన ఆసనము దగ్గరనే నిలుచుండి ఒక చిన్న ఉపోద్ఘాతముతో ప్రజలను విశ్వాసుల.....ప్రార్థనలో పాల్గొన ఆహ్వానించును. తరువాత, గాయకుడు లేక పాఠకుడు దైవవాక్య పీఠమునుండి లేక వేరొక సముచిత స్థలమునుండి విన్నపములను ప్రకటింపగా, ప్రజలు వాటికి తగిన ప్రత్యుత్తరమిచ్చి విజ్ఞాపనచేతురు. విన్నపములు పూర్తియైన తరువాత, యాజకుడు, చేతులు విడదీసి, ప్రార్థనతో దానిని ముగించును.


బ్రదర్ గొన్నాబత్తుల హేమంత్


బ్రదర్ సంజీత్ ఉత్థాన్ సింగ్


బ్రదర్ శానాపతి ఆనంద్

# ౩. కానుకలను సిద్ధపరచుట

– బ్రదర్ అరికోట్ల భరత్ కుమార్, బ్రదర్ కండి రవీంద్ర,
– బ్రదర్ గోవిందు అఖిల్ జోసఫ్

**పరిచయం:**

“విశ్వాసులతో కూడిన సముదాయం, క్రీస్తుకు తమ జీవతాలను సమర్పించే నిమిత్తం, రొట్టె మరియు ద్రాక్షారసాన్ని బలి పీఠం వద్దకు తీసుకువస్తుంది. ఈ బహుమతులు శారీరకంగా మన కృషికి అలాగే ధర్మార్థ సంపదనలను సూచిస్తాయి. ఆత్మీయంగా మనం దేవునికి అర్పించే మన ఆత్మల, హృదయాల బలి సంకేతంగా ఈ కానుకలు ఉన్నాయి. ఈ సమర్పణ ద్వారా మనం క్రీస్తుతో ఏకమై, ఆయన త్యాగంలోనూ భాగస్వాములవుతాము. మన ఆత్మల శుద్ధికి, సమాజపు పరిశుద్ధతకు ఈ బలిని దేవుడు ఆశీర్వదించమని ప్రార్థనచేస్తూ, ఈ బహుమతులను నిండు హృదయాలతో ఆ దేవునికి అర్పిస్తారు”.

కానుకలను సిద్ధపరచుట యొక్క అసలు అర్థాన్ని తెలుసుకోవడమే నేను ఈ అంశాన్ని ఎంచుకునటకు ప్రధాన కారణం. నేను ఒక కతోలిక గురువుగా తయారవుతున్న ఈ సమయములో దివ్యసంస్కారాల యొక్క ప్రతి భాగాన్ని, ప్రత్యేకంగా ప్రతి రోజు జరిగే ప్రధాన సంఘటనలను సరిగ్గా అర్థం చేసుకోవడం ఎంతగానో అవసరం అందుకే దివ్యబలిపూజ యొక్క ప్రతి భాగాన్ని మరియు దాని ప్రాముఖ్యతను అర్థం చేసుకోవడానికి ఈ అంశాన్ని తీసుకున్నాను.

**కానుకలను సిద్ధపరచుట**

**1. "Preparation of the Gifts" అనే పదం "Offertory" నుండి ఎలా అభివృద్ధి చెందింది?**

'Offertory' అనే పదం లతిను భాషలో "obfero" లేదా "offerre" నుండి వచ్చినది. దీని అర్థం బలిదానం కాదు, కానీ అందించడం, సిద్ధం చేయడం లేదా అందుబాటులో ఉంచడం. "Offertorium" అనే పదానికి

'అర్పణ' మరియు 'బలిపీఠం మీద సమర్పణ' అనే అర్థాలు ఉన్నాయి. ద్వితీయ వాటికన్ మహా సభ తరువాత, "Offertory" అనే పదానికి "Preparation of the Gifts" అనే పదం ప్రత్యామ్నాయంగా ఉపయోగించబడుతోంది.

## అధ్యాయం 1: అర్పణ యొక్క చారిత్రక నేపథ్యం

## అర్పణ పదం యొక్క పరిచయం

అర్పణ అనేది లాటిన్ "ఆఫర్" అనే పదం నుండి వచ్చింది. మరియు ఇది "సమర్పించడం" అనే అర్థాన్ని కలిగి ఉంది. క్రైస్తవత్వం ప్రారంభ కాలంలోనే, దివ్యబలి పూజలో రొట్టె, ద్రాక్ష రసం మరియు ఇతర వస్తువులను సమర్పించడం ఆచారంగా ఉండేది. మధ్యయుగంలో, అర్పణ ప్రత్యేక భాగంగా మారింది.

## Offertory Preparation

ప్రస్తుత కాలంలో, అర్పణ "gifts preparation" (అర్పణలను సిద్ధపరచుట) గా పిలుస్తారు. ఇది దివ్య సత్ప్రసాద ప్రార్థనకు పునాది. పూజ బలిలో పీఠముపైరొట్టె, ద్రాక్ష రసం, కొవ్వొత్తులు, సిలువ వంటి వస్తువులు ప్రత్యేకంగా సిద్ధం చేస్తారు. ఇవన్నీ క్రీస్తు త్యాగాన్ని, దివ్య సత్ప్రసాదంలో ఆయన ఉనికిని సూచిస్తాయి.

కానుకలను సిద్దత అనేది జన సమూహాన్ని సూచిస్తుంది. విశ్వాసుల తాము సమర్పించే అప్పద్రాక్షారసములను మరియు ఇతర బహుమతులను దేవునికి అర్పణగ సమర్పిస్తారు. ఈ రొట్టెలు మరియు ద్రాక్షారసం క్రీస్తు శరీరంగా రక్తంగా మారతాయి.

ఆధునిక కాలంలో కూడా విశ్వాసులు తమ స్వంతంగా రొట్టె మరియు ద్రాక్షారసాన్ని దేవాలయానికి తీసుకువస్తున్నారు. ఇవి క్రీస్తు శరీరంగా మారే సాధనాలుగా ఉపయోగించబడతాయి. ఈ సమర్పణ ప్రక్రియ ద్వారా మానవులు తమ జీవితాల్ని దేవునికి సమర్పించేందుకు అవకాశం పొందుతున్నారు. ఈ విధంగా, ఆదివారాల్లో అర్పించే కానుకలు, విశ్వాసులు దేవాలయానికి సహాయం చేయడానికి మరియు పేదల కోసం బహుమతులు సమర్పించగలుగుతారు.

ఈ సమర్పణ యొక్క అంతరార్థం కేవలం ఆహారాన్ని ఇవ్వడమే కాకుండా, మన జీవితాల్ని కూడా దేవునికి అంకితం చేయడమే దీని యొక్క ప్రధాన ఉద్దేశ్యం.

## 2. బలిపీఠమును సిద్ధపరచడం

బలిపీఠం అనేది దైవార్చనకు కేంద్ర బిందువు ఎందుకంటే దీని మీద కార్పోరల్, దివ్యపూజ గ్రంథం, ప్యూరిఫికేటర్ మరియు ద్రాక్షారస పాత్ర ఉంచుతారు. (GIRM 73)

**కార్పోరల్: తెల్లని వస్త్రం (Corporal)**

ఇది ఒక తెల్ల మేలి వస్త్రం. దీనిని ద్రాక్షారస పాత్ర పైన ఉంచి, తొమ్మిది సమాన భాగాలుగా మడతపెట్టి పరచాలి. పూజ సమయంలో దివ్య సత్ప్రసాద భాగాలు క్రింద పడకుండా నివారించడమే దీని ప్రధాన ఉద్దేశ్యం. దీన్ని కేవలం పూజ్య గురువు మాత్రమే నిర్వహించాలి.

**ద్రాక్షారసపాత్ర (Chalice)**

ద్రాక్షారసపాత్ర అనేది క్రీస్తు రక్తాన్ని సూచించే పవిత్ర పాత్ర. ఇది క్రీస్తు చివరి కడర రాత్రి భోజనంలో పాత్రకు గుర్తుగా ఉపయోగించబడుతుంది.

**ప్యూరిఫికేటర్: తెలుపు వస్త్రం (Purificator)**

ఇది ఒక చిన్న తెల్ల మేలి వస్త్రం. మధ్యలో స్లీవ గుర్తుతో ఉంటుంది ఈ వస్త్రాన్ని గురువు పాత్రలను శుద్ధి చేయడానికి ఉపయోగిస్తారు. ఇవి కాకుండా ఇతర పవిత్ర పాత్రలను పరిశుద్ధ పరచడానికి కూడా వాడతారు

**పాటెన్ (Paten)** – క్రీస్తు శరీరంగా మారే రొట్టె ఉంచే పాత్ర

**ద్రాక్ష రస పాత్ర** – విశ్వాసులకు శరీర రక్తాన్ని పంచేందుకు గురువు వాడతారు.

**పిక్స్ (Pyx)** – అనారోగ్యంతో బాధపడేవారికి దివ్యాసప్రసాదం తీసుకెళ్లే పాత్ర

**సిబోరియం (Ciborium)** – రొట్టెలు ఉంచే పాత్ర

**క్రుయెట్స్ (Cruets)** – ద్రాక్షరసం మరియు నీరు ఉంచే చిన్న పాత్రలు

**లవాబో బౌల్ & తువాల్** – గురువులు చేతులు కడుక్కునే పాత్ర మరియు వస్త్రము.

**ధూపము మరియు సాబ్రాణి పాత్ర** – దేవునికి సాబ్రాణి పొగ వేసే పాత్ర మరియు సామ్రాణి ఉంచే పాత్ర

**పాల్ (Pall)** – ద్రాక్షరసపు పాత్ర పై ఉంచేది.

## 3. కానుకలను తీసుకొనివచ్చే ప్రక్రియ

దివ్యపూజ ప్రారంభంలో రెండవ ప్రధాన భాగం కానుకల సంసిద్ధతతో మొదలవుతుంది దీనిని చాలాసార్లు తప్పుగా "అర్పణ" అని అంటారు రొట్టె మరియు ద్రాక్షారసం పీఠం వద్దకు ప్రదక్షణలో తీసుకువస్తారు పాటలు పాడుతు అర్పణలను తీసుకొనిరావడం మంచిది ఈ రొట్టె మరియు ద్రాక్షారసం పూజలో పాల్గొనేవారందరివీ కావడం ఉత్తమం. అందువల్ల, దివ్య మందసం నుండి దివ్యాసప్రసాదాన్ని తీసుకోవడం నివారించాలి

### ప్రదక్షణ (Procession)

అర్పణల ప్రదక్షణ అనేది ప్రాచీన సంప్రదాయానికి కొనసాగింపు, ఇందులో ప్రజలు తమ ఇళ్ల నుండి రొట్టెలు మరియు ద్రాక్షారసం తీసుకురావడం ఆనవాయితీగా ఉంది. నూతన దివ్యపూజ పుస్తకం ప్రకారం "విశ్వాసులు రొట్టెలు మరియు ద్రాక్షారసాన్ని సమర్పించడం అనుకూలంగా ఉంటుంది" (GIRM 73) కతోలిక శ్రీసభ సత్యోపదేశం ప్రకారం. "ఇవి క్రీస్తుకు సమర్పించబడి, ఆయన బలిని పరిపూర్ణంగా చేస్తాయి". ఈ కానుకలు ప్రజల నుండి వస్తాయని సూచించడానికి వాటిని సంఘం ద్వారా ప్రదక్షణలో ముందుకు తీసుకువస్తారు ముఖ్యంగా, ఇది ప్రజలు తమ జీవితాలనే బహుమతులుగా దేవునికి సమర్పిస్తున్నారన్న సంకేతం

### పదహారవ భక్తినాథ పాపుగారు:

పదహారవ భక్తినాథ పాపుగారు ఇలా చెబుతున్నారు. "మనము పీఠం వద్దకు తీసుకువచ్చే రొట్టె మరియు ద్రాక్షారసంలో క్రీస్తు విమోచకుడు. సృష్టి మొత్తాన్ని స్వీకరించి తండ్రికి సమర్పిస్తాడు".

(SC 47) ప్రకారం విశ్వాసులు తమ జీవితాలను కూడా బహుమతులతో పాటు సమర్పించాలనుకుంటారు. ఆ సమయంలో రొట్టె మరియు ద్రాక్షారసం ఆయన శరీరం మరియు రక్తంగా మారతుండగా వారి జీవితాలు కూడా దేవుని కృప ద్వారా మారాలని వారు ప్రార్థిస్తారు.

### పేదల కానుకలు

కృతజ్ఞతార్చన ప్రారంభంలో విశ్వాసులు పేదల కొరకు కానుకలను

తీసుకొస్తారు. ఇది శ్రీసభ పేదలకు చేసే సేవకు సంకేతంగా ఉంటుంది ఫలాలు, పాలు, తేనె లాంటి ఇతర బహుమతులు కూడా తీసుకురావచ్చు. కానీ ఇవి పీఠం వద్ద ఉంచకూడదు. ఇవి కృతజ్ఞతార్చన బలిపీఠానికి దూరంగా ఉంచాలి. (GIRM 73)

మార్క్ బోయర్ ప్రకారం. "దేవాలయ అవసరాలకు లేదా పేదలకు సహాయ చేసే కానుకలు ముందు. స్వీకరించి ముఖ్యమైన రొట్టె మరియు ద్రాక్షారసం తర్వాత స్వీకరించాలి".

## 4. కానుకలపై ప్రార్థన (Prayer Over the Gifts)

గురువు పీఠం వద్ద నిలబడి రొట్టెతో కూడిన పాత్రను కొంచెం పైకి ఎత్తి, ఈ ప్రార్థన చెబుతారు.

### అప్పమును ఆశీర్వదించుట

"సమస్తమును సృష్టించిన ప్రభువైన సర్వేశ్వరా నీకు స్తుతి కలుగునుగాక ఏలయన మేము అర్పించు ఈ అప్పమును నీ ఉదారత్వము వలన పొందితిమి భూఫలమును మానవ శ్రమ ఫలమునైన ఇది మాకు జీవాహారముగా కానున్నది".

### ద్రాక్షారసంలో నీరు కలపడం

ప్రాచీన గ్రీకు సంస్కృతిలో ద్రాక్షారసంలో నీరు కలపడం ఆనవాయితీగా ఉంది. ఇది క్రీస్తు కూడా కడరాభోజన సమయంలో కూడా ఇలానే చేసారు నీరు మరియు ద్రాక్షారసం కలపడం అనేది క్రీస్తు శరీరం నుండి వచ్చిన రక్తం మరియు నీటిని సూచిస్తుంది ఇది విశ్వాసులందరినీ క్రీస్తుతో కలిపే ప్రక్రియను సూచిస్తుంది.

ఈ ద్రాక్షారసము నీటి కలయిక గొప్ప పరమరహస్యము దీని ద్వారా మానవస్వభావములో భాస్తుడగుటకు చిత్తగించిన ప్రభుని దైవత్వములో మేమును భాగస్థులమగుదుముగాక. "ఈ నీరు మరియు ద్రాక్షారసం కలయిక ద్వారా, మేము క్రీస్తు యొక్క దేవత్వంలో భాగస్థూలమగుదుముగాక".

### ద్రాక్షారసముపై ఆశీర్వాదం

సమస్తమును సృష్టించిన ప్రభువైన సర్వేశ్వరా, నీకు స్తుతి కలుగునుగాక

ఏలయన మేము అర్పించు ఈ ద్రాక్షారసమును నీ ఉదారత్వము వలన పొందితిమి. ద్రాక్షఫలమును, మానవ శ్రమ ఫలమునైన ఇది మాకు ఆధ్యాత్మిక పానుము కానున్నది.

**విశ్వసుల సమాధానము:** “సర్వ సృష్టికర్త ప్రభువా, నీకు ధన్యవాదములు”.

**ఈ కానుకలు మానవుని కృషి ఫలితం:**

ఈ ప్రార్థనలు మనకు ఈ బహుమతులు భూమి నుండి మనకు వచ్చినవని, మరియు మానవుల చేతుల కృషి ద్వారా సిద్ధమైనవేనని తెలిస్తుంది. భూమి మనకు ఎన్నో దశాబ్దాల నుండి అన్నం మరియు పానీయం అందిస్తూ ఉంది. మన ప్రాచీన పూర్వీకులు మొదటి సారిగా మానవ రూపం దాల్చినప్పటి నుండి ఈ భూమి వారికి పోషణ కల్పించింది. కల్పిస్తూనే ఉంది.

ఈ ప్రార్థనలు మన నాగరికతకూ శ్రద్ధను ఇవ్వాలి. మన పూర్వీకులు గోధుమలు మరియు ద్రాక్షను సాగు చేయడంలో నైపుణ్యతను సాధించారు. మంచి దిగుబడుల కోసం ఎన్నో ప్రయోగాలు చేశారు. ఫలితంగా నాణ్యమైన రొట్టె మరియు ద్రాక్షారసం సిద్ధం చేయగలిగారు. ఇవన్నీ దేవునిచే మనకు బహుమతులుగా ఇచ్చిన నైపుణ్యాలు అందుకే. మనం వాటిని తిరిగి దేవునికి సమర్పించడం యుక్తం మరియు సమంజనము.

ఈ భూమికి మరియు కృతజ్ఞతార్చనకు మధ్య గాఢమైన అనుబంధం ఉన్నందున, భూమి ఉత్పత్తినీ సామర్థ్యాన్ని కాపాడుకోవడం మన బాధ్యత. ప్రస్తుత కాలంలో, పర్యావరణ సమస్యలు – వాతావరణ మార్పు నీటి కొరత, కాలుష్యం, మట్టిలో అనేక వ్యర్థ పదార్థాలు కలిశిపోవడం భూమిని ముప్పులోకి నెట్టుతున్నాయి. కృతాజ్ఞాతార్జన ఆధ్యాత్మికత. మనలో దేవుని సృష్టికి గౌరవాన్ని పెంచుతుంది మరియు పర్యావరణ పరిరక్షణ పట్ల మన మనస్సును మేల్కొలిపిస్తుంది.

**5. నిన్ను నీవు రూపుదిద్దుకోడానికి లేదా మార్పు చెందడానికి ప్రభుకి అర్పించుకోవాలి (Offer Yourself to Be Transformed)**

రొట్టె మరియు ద్రాక్షారసంపై జరిగే ప్రార్థనలు వాటి మార్పును సూచిస్తాయి. ఈ కానుకలు క్రీస్తు శరీరం మరియు రక్తంగా మారతాయి. కానీ ఈ మార్పు

స్నేహపూర్వకంగా మనపై కూడా జరగాలి. మనం కూడా ఆ బహుమతులవలె మారాలి అలాగే ఈ పరమ రహస్యమైన కృతజ్ఞత బలిలో మన శరీరాలు, మన ఆత్మలు కూడా మారిపోవాలని మనం ప్రార్థించాలి. మన శరీరంలో ఉన్న బలహీనతలు, అనారోగ్యాలు అన్నీ ఆ రొట్టెలో కలిపి. ఆత్మీయంగా అర్పించాలి. మన అంతర్యుద్ధాలు, బాధలు, గాయాలు అన్నీ ద్రాక్షారసపాత్రలో పోసి, ఆ పవిత్రాత్మ శక్తిచేత మారిపోవాలని ప్రార్థించండి. ఈ దివ్యబలిపూజ క్రీస్తుతో మనకు ఉన్న వ్యక్తిగత సంబంధాన్ని బలపరుస్తుంది.

### ధూపం వేయు ప్రక్రియ (Incensation)

కానుకలపై ప్రార్థన తరువాత గురువు కానుకలకు బలిపీఠమునకు, పీఠం మీద ఉన్న స్లీవకు ధూపం వేస్తారు మరియు వత్తాసు చేసేవారూరు ప్రజలకు ధూపం వేస్తారు. ఈ క్రియ కానుకలను, ప్రజలను పవిత్రపరుస్తుంది (GIRM 276-277) గురువు బహుమతులపై మూడు సార్లు ధూపాన్ని వేస్తారు. బలిపీఠం చుట్టూ నడుచుకుంటూ, స్లీవకు ముగింపు ధూపార్చన చేస్తారు.

### చేతుల శుద్ధి (The Washing of Hands)

గురువు తన చేతులను కడుగుతాడు ఇది శారీరక శుభ్రతకు కాదు. అతని అంతరశుద్ధతకు సూచిక గురువు నిశ్శబ్దంగా ఇలా ప్రార్థిస్తాడు. "ప్రభువా నా అపరాధాలను క్షమించుము, నా పాపాల నుండి నన్ను శుద్ధిపరచుము".

పరిశుద్ధ బైబిల్ గ్రంథం ప్రకారం (ఈజిప్టు నుండి నిష్క్రమణ నిర్గమ 30:18-20). యాజకుల రాగి గరిటె వద్ద చేతులు కడుక్కొని దేవుని పవిత్రతను గౌరవించేవారు ఈ క్రమము కూడా ఇదే భావనతో అనుసరించబడుతుంది.

## 6. కానుకుల సేకరణ ఉద్దేశ్యం

కానుకుల సేకరణ ద్వారా దేవాలయ నిర్వహణ, పేదలకు సహాయం చేయడం. సమాజ సేవను కొనసాగించడం జరుగుతుంది ఇది క్రైస్తవ ధర్మాన్ని దాతృత్వాన్ని ప్రతిబింబిస్తుంది ఈ కానుకుల ద్వారా గ్రామాలలో దేవాలయాలను కట్టించడానికి మరియు వాటి బాగు చేయడానికి వీటిని గురువు ఉపయోగిస్తారు అదేవిధంగా పేద పిల్లలను చదివించడానికి అనారోగ్యంతో బాధపడుతున్న వారినీ సహాయం చేయడానికి ఈ కానుకలను వాడుతారు.

## చేయదగినవి మరియు చేయదగనివి (GIRM 73-79)

1. అర్పణలను మరియు కానుకలను (రుసుము లేదా ఏ వస్తువైనా) విశ్వాసులు తీసుకొని రావాలి
2. తీసుకొని వచ్చిన కానుకలను దివ్యబలి పూజ పీఠం దగ్గరలో ఉంచాలి. పీఠము పైన పెట్టరాదు.
3. కానుకలను తీసుకొని వచ్చే సమయంలో విశ్వాసులంతా నిలబడాలి
4. అప్ప ద్రాక్షా రసములను పైకి ఎత్తకుండా ఆశీర్వదించవలెను.
5. ఎక్కువ మంది గురువులు ఉంటే అవసరమైన ద్రాక్షారసపాత్రలను అర్పణ సమయంలోనే సిద్ధం చేసుకోవాలి
6. కృతజ్ఞతార్చన ముగిసాక క్రీస్తు ప్రభు శరీర రక్తాలను ఒక పాత్ర నుండి మరొక పాత్రకు మార్చరాదు.
7. నీళ్లను ద్రాక్షారసంలో కలిపే సమయంలో నీటిని ఆశీర్వదించకూడదు.
8. కాలి ద్రాక్షారస పాత్రలను కానుకలనుగ కొనిరారాదు
9. పరిశుద్ధ బైబిల్ గ్రంథాన్ని సమర్పించకూడదు.
10. సరిపడా అప్పములు సిద్ద పరుచుకోవాలి.

### కృతజ్ఞతార్చన (దివ్యపూజ గ్రంథము రోమీయ క్రమము పుట సంఖ్య: 581-583)

21. అనంతరము అర్పణగీతము ప్రారంభమగును. ఇంతలో సహాయకులు పూజపాత్రమును, దివ్యపూజ గ్రంథమును, పూజ వస్త్రములను తదితర వస్తువులను పీఠముపై ఉంచుదురు.
22. విశ్వాసులు తాము అర్పించు అర్పణలద్వారా వారు కూడ ఈ అర్పణలో వారు పాత్రధారులనెడు భావమును వ్యక్తపరచుట సమంజసము. కృతజ్ఞతార్చనకు అప్పద్రాక్షరసములను. దేవాలయమునకును పేదలకును ఉపయోగపడు ఇతర కానుకలను తీసికొని వచ్చుట సముచితము
23. యాజకుడు పీఠముచెంత నిలచి, అప్పము ఉన్న పళ్లెరమును తీసికొని, దానిని రెండు చేతులలో కొంచెము పైకెత్తి నెమ్మదిగా ఇట్లు చెప్పును:

**యాజకుడు:** సమస్తమును సృష్టించిన ప్రభువైన సర్వేశ్వరా. నీకు స్తుతి కలుగునుగాక ఏలయన మేము అర్చించు ఈ అప్పమును నీ ఉదారత్వము వలన పొందితిమి భూఫలమును మానవ శ్రమ ఫలమునైన ఇది మాకు జీవాహారముగా కానున్నది. తరువాత అప్పముతో నున్న పళ్లెమును కార్పొరల్ పై ఉంచుతు. అర్పణగీతం పాడనీయెడల యాజకుడు పై ప్రార్ధనను బిగ్గరగా చెప్పవచ్చును అంతమున ప్రజలు తమ ఆమోదమిని ఇట్లు తెలుపుదురు.

**ప్రజలు:** సర్వేశ్వరుడు సర్వకాలము స్తుతింపబడునుగాక

24. డీకను లేక యాజకుడు ద్రాక్షారసము, కొంచం నీటిని పాత్రములో పోయుచు తక్కువ స్వరముతో ఇట్లు చెప్పును.

**డి/యా** : ఈ ద్రాక్షారసము, నీటి కలయిక గొప్ప పరామరహస్యము దీని ద్వారా మానవస్వభావములో భాస్తుడగుటకు చిత్తగించిన ప్రభుని దైవత్వములో మేమును భాగస్థులమగుదుముగాక ఈ నీరు మరియు ద్రాక్షారసం కలయిక ద్వారా, మేము క్రీస్తు యొక్క దైవత్వంలో భాగస్థూలమగుదుముగాకవ

25. తరువాత యాజకుడు పాత్రమును తీసికొని దానిని రెండు చేతులతో కొంచెము పైకెత్తి నెమ్మదిగా ఇట్లు చెప్పును: తరువాత, పాత్రమును కోర్పొరల్ పై ఉంచును.

**డి/యా:** సమస్తమును సృష్టించిన ప్రభువైన సర్వేశ్వరా. నీకు స్తుతి కలుగునుగాక ఏలయన మేము అర్పించు ఈ ద్రాక్షారసమును నీ ఉదారత్వము వలన పొందితిమి ద్రాక్షఫలమును, మానవ శ్రమ ఫలమునైన ఇది మాకు ఆధ్యాత్మిక పానము కానున్నది.

తరువాత, పాత్రమును కార్పొరల్ పై ఉంచుము.

అర్పణగీతమును ఆలాపింపని యెడల యాజకుడు పై ప్రార్ధనను బిగ్గరగా చెప్పవచ్చును. అంతమున ప్రజలు తమ ఆమోదమును ఇట్లు తెలుపుదురు

**ప్రజలు:** సర్వేశ్వరుడు సర్వకాలము స్తుతింపబడునుగాక!

26. తర్వాత, యాజకుడు వంగి నెమ్మదిగా ఇట్లు చెప్పును.

**యా:** ఓ ప్రభువా దీనభావముతో మనస్తాపముతో వచ్చిన మమ్ము

అంగీకరింపుము. ఈ దినము మేము నీ సన్నిధిలో అర్పించు ఈ అర్పణ నీకు ప్రీతికరమగునుగాక'

27. సందర్భానుసారముగా యాజకుడు అర్పణలకును. సిలువకును. పీఠమునకును ధూపము వేసిన తరువాత, డీకనుగాని లేక సహాయకుడుగాని యాజకునకును ప్రజలకును ధూపము వేయును.

28. పిమ్మట, యాజకుడు పీఠము వద్ద నిలబడి చేతులు కడుగుకొనుచు నెమ్మదిగా ఇట్లు చెప్పును

యా: ప్రభువా నా దోషములనుండి నన్ను శుభ్రపరపుము నా పాపములనుండి నన్ను శుద్ధిచేయుము

29. యాజకుడు పీఠము మధ్యలో నిలచి, ప్రజలవైపు తిరిగి, చేతులు విడదీసి, జోడించి ఇట్లు చెప్పును.

సహోదరి సహోదరులారా, నేనును మీరును అర్పించుచున్న ఈ బలి సర్వశక్తిగల పితయైన సర్వేశ్వరునికి అంగికమగునటుల ప్రార్ధింపుము.

ప్రజలు లేచి నిలబడి ఇట్లు ప్రత్యుత్తర మిచ్చెదరు.

**ప్ర:** ప్రభువు తన నామాస్తుతిమహిమాల కొరకును మన ప్రయోజనము కొరకును. తన పవిత్ర శ్రీసభ ప్రయోజనము కొరకును. నీ కరముల ద్వారా ఈ బలిని స్వీకరించుదురుగాక

30. తరువాత, యాజకుడు చేతులు విడదీసి. అర్పణలపై ప్రార్ధనను చెప్పును. అంతట ప్రజలు తమ ఆమోదమును తెలుపుదురు:

**ప్ర:** ఆమెన్

## ముగింపు (Conclusion)

కానుకల సమర్పణ అనేది దివ్యపూజలో ఒక ముఖ్యమైన ఆధ్యాత్మిక భాగం ఇది విశ్వాసుల కృతజ్ఞత. దైవికత. సమాజ సేవకు చిహ్నం ప్రతి క్రైస్తవుడు ఈ ప్రాముఖ్యతను తెలుసుకుని హృదయపూర్వకంగా పాల్గొనాలి దివ్య పూజలో ప్రతి భాగాన్ని అర్థం చేసుకుని, గురువుగా మరింత సేవ చేయడానికి ఇది నాకు మార్గదర్శకంగా నిలిచింది.

బహుమతుల సంసిద్ధత యొక్క అసలు ఉద్దేశం ఏమిటంటే. మనం క్రీస్తు శరీరం మరియు రక్తాన్ని స్వీకరించేందుకు ఆత్మీయంగా సిద్ధపడాలి ఈ సిద్ధతలో మనం నిర్దిష్టంగా తెలుసుకోవలసిన విషయమేమంటే క్రీస్తు మన విమోచకుడు. ఆయన ద్వారానే మానవాళి రక్షింపబడుతుంది.

ఈ "బహుమతుల సంసిద్ధత" కేవలం రొట్టె మరియు ద్రాక్షారసం మార్పు గురించి మాత్రమే కాదు – అది విశ్వాసిని క్రీస్తులో కొత్త సృష్టిగా మారుస్తుంది ప్రతిరోజు దివ్యబలిపూజలో పాల్గొనేవారి జీవితంలో మార్పును తీసుకొస్తుంది. ఎందుకంటే మనం ప్రతి రోజూ క్రీస్తునే ప్రతిబింబించే వ్యక్తులుగా జీవించాల్సిన అవసరం ఉంది.


బ్రదర్ అరికోట్ల భరత్ కుమార్


బ్రదర్ కండి రవీంద్ర


బ్రదర్ గోవిందు అఖిల్ జోసఫ్

❁ ❁ ❁ ❁

# 4. కృతజ్ఞత ప్రార్థన యొక్క చరిత్ర

– బ్రదర్ ఫేబియస్ సెబాస్టిన్, బ్రదర్ కుంచవు వినోద్,
– బ్రదర్ విసెసెంట్ రాజ్ ఎడ్విన్ మోజెస్

## ఉపోద్ఘాతం

కృతజ్ఞత ప్రార్థన అనేది దివ్యపూజబలిలో అత్యంత ముఖ్యమైన భాగం. యాజకుడు దీన్ని దివ్యబలిపూజ మధ్యభాగంలో ఉచ్ఛరిస్తాడు. ఇది కేవలం కృతజ్ఞత వచనమే కాదు, మన పాపక్షమ కొరకు యేసు ప్రభువు చేసిన త్యాగాన్ని, ఆయన మరణాన్ని, పునరుత్థానాన్ని గుర్తుచేసే పవిత్ర క్షణం. కడరా భోజనంలో యేసుప్రభు రొట్టెను, ద్రాక్షారసాన్ని ఆశీర్వదించి, తన శిష్యులకు ఇచ్చిన సందర్భం నుంచి ఈ కృతజ్ఞత ప్రార్థన యొక్క మూలాలను కనుగొనవచ్చు.

ప్రారంభ రోజుల్లో క్రైస్తవులు చింతనతో, కృతజ్ఞతతో, సాధారణ భాషలో దేవుని పొగుడుతూ ఈ ప్రార్థనను కొనసాగించేవారు. అయితే కొన్ని శతాబ్దాల తరువాత శ్రీసభ సంప్రదాయాలు ఏర్పడి, ఈ ప్రార్థనకు ఒక క్రమబద్ధమైన నిర్మాణం వచ్చింది. అందులో సుత్తిగీతము పవిత్రత వందనాలు హోసాన్న పవిత్రీకరణము విశ్వాసుల కోసం ప్రార్థనలు, Doxology క్రీస్తు ద్వారా, క్రీస్తుతో, క్రీస్తునమ (త్రీత్వైక సర్వేశ్వరుని స్తుతి) వంటి భాగాలు కలుపబడ్డాయి.

కృతజ్ఞత ప్రార్థన మనం ఒక్కొక్కరిగా కాకుండా ఒక సంఘంగా, దేవునికి మన జీవితాన్ని సమర్పించే సమయంగా ఉంటుంది. భక్తి, కృతజ్ఞత, మరణం మీద విజయానికి ఆనందం అన్నీ ఈ ప్రార్థనలో వ్యక్తమవుతాయి. కాబట్టి ప్రతి దివ్య బలిలో ఈ కృతజ్ఞత ప్రార్థనను శ్రద్ధతో, భక్తితో మనం అంతర్లీనంగా పాల్గొనడం విశ్వాస జీవనానికి ఎంతో కీలకం.

## కృతజ్ఞత ప్రార్థన యొక్క చరిత్ర

“వారు అపోస్తులుల బోధనయందును, వారి సహవాసమందును, రొట్టెను

త్రుంచుటయందును, ప్రార్థించుటయందును ఎడతెగక ఉండిరి" (అపోస్తులు కార్యములు 2:42). మనం పవిత్ర గ్రంథములో కనుగొనే ఈ పదబంధం కృతజ్ఞత ప్రార్థన యొక్క మూలాలను తెలియజేస్తుంది. భూమిపై మనుగడను సాగిస్తున్న ప్రతి ఒక్క ప్రాణికి ఒక మూలం అనేది ఉంది. అదే విధంగా, ఈ వచనము కూడా కృతజ్ఞతా ప్రార్థనకు ఆధ్యాత్మిక మూలం మరియు ఈ వచనము ప్రారంభ క్రైస్తవులు క్రీస్తు సువార్తను వ్యాప్తి చేయడంలో తమను తాము ఎలా సంసిద్ధ పరచుకున్నారో మనం చూడగలం. ఈ వ్యాసము ద్వారా మేము ముఖ్యంగా కృతజ్ఞతా ప్రార్ధన యొక్క చారిత్రక నేపథ్యాన్ని, మీ ముందు ఉంచాలి అని అనుకుంటున్నాం. ఈ వ్యాసం కేవలము కృతజ్ఞతా ప్రార్థన యొక్క చారిత్రక నేపథ్యన్ని మాత్రమే కాదు, దాని అభివృద్ధి మీదను ఉద్దేశింపబడింది. ఈ వ్యాసానికి కృతజ్ఞతా ప్రార్థనలలో ఉన్న అంశాలతో సంబంధం లేదు.

## 1.1 అపోస్తులుల కార్యములు 2:42-46

వారు అపోస్తలుల బోధయందును, వారి సహవాసమందును, రొట్టెను త్రుంచుటయందును, ప్రార్థించుటయందును ఎడతెగక ఉండిరి. అప్పుడు ప్రతి వ్యక్తిపై భయము ఆవహించెను. అపోస్తలులద్వారా, అనేక అద్భుతములు, ఆశ్చర్య కార్యములు జరుగుచుండెను. విశ్వసించిన వారందరు కలిసి, సమష్టిగా జీవించుచు తమకు కలిగినదానిలో అందరు పాలుపంచుకొనుచుండిరి మరియు వారు తమ స్థిరచరాస్తులను అమ్మి, అందరకును వారివారి అవసరములను బట్టి పంచిపెట్టిరి. వారు ప్రతి రోజు కూటముగా దేవాలయములో కలిసికొనుచు, తమ ఇండ్లలో అందరు కలిసి రొట్టెను త్రుంచుచు, సంతోషము, వినయముగల హృదయములతో భుజించుచు, దేవుని స్తుతించుచు, ప్రజలకందరకును ప్రీతిపాత్రులైరి. ప్రభువునందు రక్షణపొందుచున్న వారిని, ప్రతిరోజు వారితో చేర్చుచుండెను.

## 1.2 బెరెకోత్ (Berekoth), షబ్బత్ (Shabbat) మరియు సెదర్ (Seder)

"రొట్టె విరిచే" వేడుకను చూసే ముందు, మనం బెరెకా అనే హీబ్రూ పదం (బహువచన రూపం బెరెకోత్) అనేది శిష్యులు యూదులుగా సాధారణంగా

తినే షబ్బత్ భోజనం మరియు సెడర్ అని పిలువబడే ప్రత్యేక షబ్బత్ భోజనం యొక్క అర్థాన్ని అర్థం చేసుకోవాలి. గ్రీకులు యూకారిస్టియాగా *(eucharistia)* అనువదించిన బెరెకాను సాధారణంగా "ధన్యులు" అని అనువదిస్తారు. బెరెకా చాలా యూదుల ప్రార్థనలను ప్రారంభిస్తుంది మరియు సాధారణంగా యావే (JHWH) వైపు ప్రధానంగా కేంద్రీకృతమైవుంది. ఈ పదానికే కృతజ్ఞత మరియు ప్రశంసలు అని అర్థాలు కలవు. అయితే, ఇది యావే (JHWH) నుండి వచ్చిన బహుమతులకు ధన్యవాదాలు లేదా కృతజ్ఞతలు వ్యక్తపరుస్తున్నప్పటికీ, బెరెకా అనేది ప్రాథమికంగా మిరాబిలియా దేయి *(Mirabilia Dei)* యొక్క ప్రకటన. మిరాబిలియా దేయి *(Mirabilia Dei)* అనగా దేవుని అద్భుతమైన పనులు అని అర్థం. షబ్బత్ అనే యూదుల ఆచార భోజనంతో మనం "రొట్టె విరుచుట" గురించి మన అవగాహనను ప్రారంభించెదము.

## 1.3 షబ్బత్ భోజనం యొక్క వివరణ

1. సాధారణంగా కుటుంబాలలో లేదా స్నేహితుల చిన్న సమూహాలలో శుక్రవారం సాయంత్రం జరుపుకునే ఈ యూదుల ఆచార భోజనం, క్రీస్తు జన్మింపక పూర్వము కనీసం 100 సంవత్సరాల క్రితం నాటిది. యేసు, తన శిష్యులు చిన్న సమూహాలతో షబ్బత్‌ను సందర్భానుసారంగా జరుపుకునేవారు.

తదుపరి వివరణ లూయిస్ బౌయర్ రాసిన యూకారిస్ట్ నుండి సంక్షిప్తీకరించబడినది. అతను ఈ షబ్బత్ ఆచారానికి ముందు మూడు దశలను వివరిస్తాడు:

1. ఈ షబ్బత్ భోజనం సాంప్రదాయబద్ధంగా చేతులు కడుక్కోవడంతో ప్రారంభమైంది. అప్పుడు, ఇది ఒక ఆచారపరమైన భోజనం. అయితే, ఈ కార్యక్రమానికి హాజరైన ప్రతి వ్యక్తి, వచ్చిన వెంటనే, మొదటి కప్పు ద్రాక్ష రసము సేవిస్తూ, ఈ దీవెనను పునరావృతం చేశాడు: "యెహోవా, మా దేవుడు, విశ్వాధిపతి, ఆయనయే ఈ ద్రాక్షారసం ఫలాన్ని మనకు అనుగ్రహించారు." (యాజకుడు అర్పణ సమయంలో ఇలాంటి సారూప్యమైన ప్రార్థననే పఠిస్తాడు.)

2. ఈ షబ్బత్ భోజనం కుటుంబ పెద్ద లేదా సంఘం యొక్క అధ్యక్షత వహించే సభ్యుడు రొట్టెను విరిచినప్పుడు, ఈ విందులో పాల్గొనేవారికి ఇవ్వవలసిన భోజనం ప్రారంభమవుతుంది. రొట్టె విరిచేటప్పుడు, నాయకుడు ఈ ఆశీర్వాదాన్ని పఠిస్తారు: “యెహోవా, మా దేవుడు,విశ్వ విభుడు, ఈ భూఫలము ఆయన అనుగ్రహమే, ఆయన నిత్యము స్తుతింపబడును గాక.” (మళ్ళీ, యాజకుడు అర్పణ సమయంలో చెప్పే మాటలకు సమానంగా ఉన్నాయి.)

3. ఈ షబ్బత్ భోజనానికి హాజరయ్యే వారు, భోజనం చేసి, భోజన సమయంలో, వంటకాలు మరియు పాత్రలో ద్రాక్షరసాని వడ్డించినప్పుడు, ప్రతి ఒక్కరూ తగిన ఆశీర్వాదాల శ్రేణిని ప్రకటించెదరు. అయితే, ముఖ్యమైన మరియు ప్రధానమయిన ఆచార భోజనం చివరిలో వస్తుంది. కుటుంబంలోని తల్లి (సాధారణంగా) ఆమె ఇప్పటికే సిద్ధం చేసి వెలిగించిన దీపాన్ని తీసుకువస్తుంది. ఆ రాత్రియందు వెలుతురు రావడానికి, వెలుగుల సృష్టిని గుర్తుచేసే పదాలను ఉపయోగించి దీపం ఆశీర్వదించబడుతుంది. దీపాన్ని ఆశీర్వదించిన తర్వాత, వారు సరైన ఆశీర్వాదంతో ధూపం వేస్తారు. తరువాత రెండవని చేతులు కడుక్కోవడం: అధ్యక్షత వహించిన వ్యక్తి, మొదట సేవకుడి చేతుల నుండి లేదా సేవకుడు లేనప్పుడు, బల్ల వద్ద ఉన్న చిన్నవాడి నుండి నీటిని అందుకుంటారు.

(కడరా భోజనంలో యేసు అపోస్తలుల పాదాలను కడిగిన విషయాన్ని గుర్తుచేసుకోండి.)

ఈ ప్రారంభోత్సవాల తర్వాత, అధ్యక్షుడు తన ముందు ఉంచబడిన ద్రాక్షారసం పాత్రలో నీళ్లు కలిపి తన కృతజ్ఞతా కార్యక్రమంలో పాల్గొనమని సహాయం చేస్తున్న వారిని హృదయపూర్వకంగా ఆహ్వానించెదరు, మన దేవుడైన ప్రభువుకు కృతజ్ఞతలు చెల్లిద్దాం.” ఈ భోజనం కోసం గుమిగూడిన వారు ఇలా ప్రతిస్పందించారు: “ఎవరి దాతృత్వం మనకు ఆహారాన్ని ఇచ్చిందో, ఎవరి దయ మనకు జీవితాన్ని ఇచ్చిందో ఆయన ధన్యుడు.” అప్పుడు అధ్యక్షుడు మూడు బెరెకోత్‌ల శ్రేణిని జపిస్తారు, వీటిని బహుశా యేసు ఉపయోగించేవారు మరియు క్రైస్తవ యుగానికి, చాలా ముందు కాలం నాటివిగా, అనిపిస్తుంది.

1. ఈ బెరెకోత్‌లలో మొదటిది మానవుడు పొందిన పోషణకు సంబంధించిన ఒక ఆశీర్వాదం. ఈ ఆశీర్వాదం సృష్టి అంతటికీ అనుగ్రహింపబడుతుంది.
2. రెండవది వాగ్దానం చేయబడిన భూమికి ఒక ఆశీర్వాదం. ఇది సున్నతి ద్వారా పటిష్ట పరచబడిన ఒడంబడిక మరియు తోరా బహుమతికి ఒక ఆశీర్వాదంగా ఉంటూ ఉన్నది. అందువలన ఇది మొత్తం విమోచన చరిత్రకు ఒసగబడే ఒక ఆశీర్వాదంగా ఉంటూ ఉన్నది.
3. మూడవది బెరెకా అనేది పురాతన కాలంలో దేవుని సృజనాత్మక మరియు విమోచన చర్యను సూచిస్తూ, అది ఈనాటికీ కొనసాగి, పునరుద్ధరించబడాలని, మెస్సయ్యా రాకడలో మరియు చివరిగా దేవుని రాజ్యం యొక్క స్థాపనలో అది నెరవేర్చును అని ఒక ప్రార్థన.

షబ్బత్ ఆచారంలోని మూడు బెరెకోత్ ప్రార్థనల యొక్క అంశాలు శతాబ్దాలుగా అన్ని కృతజ్ఞత ప్రార్థనలలో కనిపిస్తాయి, అయినప్పటికీ యూదుల చరిత్రలో యావే (JHWH) యొక్క రక్షణ చర్యలపై మాత్రమే కాకుండా రక్షణలో క్రీస్తు పాత్రపై కూడా దృష్టి సారించాయి.

మొదట, సృష్టి అంతటికి, మరి ముఖ్యంగా జీవన సృష్టికి ఒక విశ్వ ఆశీర్వాదం (కృతజ్ఞత) ఉంది. తరువాత, రక్షణ చరిత్ర మొత్తానికి ఒక ఆశీర్వాదం ఉంది. చివరగా, దేవుని రక్షణ చర్య ఇప్పుడు కొనసాగి, పునరుద్ధరించబడాలని మరియు దేవుని రాజ్యం యొక్క స్థాపనలో, దాని అంతిమ నెరవేర్పును కనుగొనాలని ప్రార్థిస్తున్నాము. అపోస్తలుల కార్యములలో లూకా "రొట్టె విరుచుట" అని పిలిచే ప్రశ్నకు తిరిగి వస్తే, అది యేసు యొక్క యూదు అనుచరుల షబ్బత్ సేవ. కానీ రెండవ మరియు మూడవ బెరెకాలో బహుశా యేసు జీవితం, మరణం మరియు పునరుత్థానం యొక్క రక్షణ చర్యలకు సంబంధించిన సూచనలు ఉండవచ్చు.

## 1.4 "రొట్టె విరచుట"

ఇవన్నీ దివ్య సత్ప్రసాదమును బాగా అర్థం చేసుకోవడానికి మనకు ఎలా సహాయపడతాయి? క్రైస్తవ యూకారిస్ట్ యొక్క తొలి వ్రాతపూర్వక వర్ణనలను మనం పరిశీలిస్తే, శిష్యులందరూ యూదులుగా ఆచరించే షబ్బత్ మరియు

సెడర్ భోజనాలను ఈ పద్ధతికి ఎలా దగ్గరగా అనుసరిస్తుందో మనం చూస్తాము. సెడర్ భోజనంలో "జ్ఞాపకార్థం" మనం అర్థం చేసుకుంటే, తొలి క్రైస్తవులు ఆ సాధారణ అవగాహనను, వారి స్వంత ఆచారాలలో జ్ఞాపకార్థం"కి ఎలా అన్వయించారో మనం చూస్తాము. నేడు మనకు తెలిసిన యూకారిస్ట్ వైపు మనం తిరిగితే, "జ్ఞాపకార్థం" మన విశ్వాసానికి ఎలా అంతర్భాగంగా ఉందో మనం చూడవచ్చు.

## 1.5 క్రీస్తు శరీర రక్తాల యందు విశ్వాసం

అయితే నేడు దివ్య సత్ప్రసాదంలో క్రీస్తు ఉనికిని మనం ఎలా అర్థం చేసుకుంటాము?

మనం ప్రార్థనా మందిరం లేదా దేవాలయములోనికి ప్రవేశించినప్పుడు, విశ్వాసులు రాజకీయ సమావేశానికి వస్తున్నట్లుగా లేదా షాపింగ్ మాల్‌కు వస్తున్నట్లుగా మనము రాము. జ్ఞాన స్నానం పొందిన మరియు ధృవీకరించబడిన క్రీస్తు శరీర సభ్యులుగా మనం గుమ్మిగూడుతాం. క్రీస్తు ఇప్పటికే మన సమావేశంలో ఉన్నాడు. యేసు చెప్పినట్లుగా: "మీలో ఇద్దరు లేదా ముగ్గురు నా నామమున ఎక్కడ సమావేశమైనా, అక్కడ నేను మీ మధ్యన వసించెదను." మనం పఠనాలు మరియు సువార్త ప్రకటనను వినేటప్పుడు, దేవుని వాక్యమైన క్రీస్తు మనకు సముఖంగా ఉంటున్నారు. మనం క్రీస్తుని శరీర రక్తాలు అనగా దివ్య సత్ప్రసాదని స్వీకరించినప్పుడు మనం క్రీస్తులో ఏక సంఘంగా, ఒకే శరీరంగా మారుతున్నాము. చివరగా, మనం దేవాలయము నుండి వెడలినప్పుడు, మనము క్రీస్తు శరీరంలో సభ్యులుగా, క్రీస్తును మనము విరిగి, నలిగిన ప్రపంచానికి పరిచయం చేయడానికి ప్రయాసపడతాము.

## 1.6 వేదాంత పరమైన భావము

దైవార్చన ప్రార్థన అనేది శ్రీ సభ యొక్క అధికారిక బహిరంగ ప్రార్థన మరియు దీనికి ప్రత్యేక సామూహిక మరియు శ్రీ సభ సంబంధిత లక్షణం కలదు. కృతజ్ఞత ప్రార్థన III, సమస్త జీవం మరియు పవిత్ర తండ్రి దేవుని నుండి, యేసు ద్వారా, పరిశుద్ధాత్మ ద్వారా వస్తాయని శ్రీ సభ ధృవీకరిస్తుంది. ఈ బహిరంగ ప్రార్థన దేవుని ప్రజల భాగస్వామ్య విశ్వాసాన్ని వ్యక్తపరుస్తుంది.

"లెక్స్ ఒరాండి (Lex orandi), లెక్స్ క్రెడెండి *(Lex credendi)*" అనే మాటకు అర్ధము శ్రీ సభ ఏమి ప్రార్ధిస్తుందో, దానినే శ్రీ సభ బలంగా నమ్ముతుంది అని అర్థం. నిజమైన ఆరాధన ఎల్లప్పుడూ నిజమైన క్రైస్తవ బోధనను ప్రతిబింబిస్తుంది. దివ్యపూజ ప్రార్ధనలు క్రైస్తవులను యేసు శిష్యులుగా జీవించడంలో మార్గనిర్దేశం చేస్తాయి. ఇది "లెక్స్ వివేండి (Lex vivendi)"కి దారితీస్తుంది, అంటే మనము చేసే ప్రార్ధన, మన జీవితానికి ఒక నూతన ఆకృతిని తీసుకురావాలి. ప్రార్ధన, శిష్యరికం, నాయకత్వం మరియు ఆదివారం దివ్యపూజ అన్నీ క్రైస్తవ జీవితంలో అనుసంధానించబడి ఉన్నాయి. పునీత జాన్ పాల్ II ఆదివారం దివ్యపూజ యొక్క అర్థం మరియు దాని అందాన్ని తిరిగి కనుగొనమని కతోలికులకు పిలుపునిచ్చారు. దివ్యపూజ ద్వారా మనం క్రీస్తును స్వీకరిస్తామని, ఆయన త్యాగాన్ని గుర్తుచేసుకుంటామని మరియు పరలోకం యొక్క ఆనందం మరియు ఆశను పొందుతామని ఆయన బోధించాడు.

## 1.7 కతోలికా శ్రీసభలో క్రీస్తు శరీర రక్తాల చరిత్ర యొక్క ఆరు దశలు

### 1.7.1. పాస్క పండుగ నుండి దివ్య సత్ప్రసాద స్థాపన వరకు

యేసు తన శిష్యులను పాస్కా భోజనాన్ని జరుపుకోవడానికి ఒక గదిని సిద్ధం చేయమని అడిగారు. అపొస్తలులు కూర్చునే చోట కుషన్లతో ఉన్న పొట్టి కళ్ళు కలిగిన టేబుల్‌పై గిన్నెలో ఉప్పు నీరు, చేదు సలాడ్ వంటకం: వారి బానిస రోజులను జ్ఞాపక పరుస్తూ, దాల్చిన చెక్కతో పూసిన ఆపిల్, ఎండుద్రాక్ష మరియు రేగు పండ్లతో కూడిన కంటైనర్: వారు తయారు చేసిన ఇటుకలకు సాదృశ్యముగా ఉంటూ ఉంది. ద్రాక్ష రసం నిండిన పెద్ద గిన్నె, దాని పక్కన పులియని రొట్టె మరియు కాల్చిన గొర్రెపిల్ల పాత్రల్లో తయారు చేయబడ్డాయి. వాస్తవానికి ఈ ఆహారాలు మరియు పానీయాలన్నీ యూదుల ఎర్ర సముద్రమును దాటుటకు ప్రతీకగా ఉంటూ.

యేసు తండ్రి దేవుణ్ణి స్తుతించే కీర్తనతో భోజనాన్ని ప్రారంభించాడు, తరువాత అతను రొట్టెను తీసుకొని, కృతజ్ఞతలు అర్పించి మరియు పాస్క పూర్వ సంప్రదాయాన్ని ఉల్లంఘిస్తూ, దీనిని కొత్త పదాలతో అనుకరించారు: దీనిని తీసుకొని భుజించుడి. ఇది మీ కొరకు ఇవ్వబడిన నా శరీరం." ఈ

రొట్టె ఇప్పుడు అతని శరీరం. ఇదియే శిలువపై అర్పించబడిన క్రీస్తు శరీరం. యేసు రొట్టె విరచడం ద్వారా యూదు సంప్రదాయాలను అతీతంగా వెళ్తూ చేసిన ఈ చర్య వలన ఇది శ్రీ సభ చరిత్రలో మొదటి మరియు నూతన క్రీస్తు శరీర రక్తాల బలి వేడుకగా ప్రారంభమయ్యింది.

ఆ విధముగానే భోజనానంతరం, యేసు ద్రాక్షారసంతో నిండిన పాత్రను తీసుకొని, మళ్ళీ పాస్క సంప్రదాయాన్ని ఉల్లంఘిస్తూ, దీనిని తీసుకుని దీని నుండి పానము చేయుడు..... ఇది నా రక్తం..... ఇది మీ కోసం మరియు అందరి కోసం పాప క్షమాపణ కోసం చిందబడనున్న నా రక్తము" అని అనెను. శిష్యులు ఒకే పాత్ర నుండి త్రాగి, ఒకే రొట్టె స్వీకరించినప్పుడు, వారు క్రీస్తులో వారి ఐక్యతను అనుభవించారు. చివరగా, క్రీస్తు వారికి మరియు వారి తరువాత వారికి దివ్య సత్ప్రసాదానీ జరుపుకునే శక్తిని ఇచ్చాడు: దీన్ని నా జ్ఞాపకార్థం చేయండి." వారందరూ ఒక కీర్తన పాడి మరియు యేసు తన మరణ మరియు పునరుత్థానానికి ప్రయాణాన్ని కొనసాగించాడు. ఈ సందర్భంలో యేసు మనకు దివ్య సత్ప్రసాద సంస్కారాన్ని స్థాపించారు.

### 1.7.2. సంఘ భోజనం నుండి ఆరాధన వరకు

క్రమంగా అపొస్తలులు మరియు వారి శిష్యులు, క్రీస్తు శరీర రక్తాలను క్రమక్రమంగా అభివృద్ధి చేస్తూ వచ్చారు. వారు మొదట దీనిని రొట్టె విరచడం అని పిలిచారు, కానీ సంఘ భోజనంలో దుర్వినియోగం కారణంగా (1 కొరింతీ 11:17-22) మరియు ఈ ఆరాధన చర్యకు మరింత ప్రార్థనాపూర్వకమైన నేపథ్యాన్ని కోరుకున్నందున, ఈ దివ్య సంస్కారం భోజనం నుండి వేరు చేయవలసిన పరిస్థితి నెలకొన్నది. క్రీస్తు పునరుత్థానం జ్ఞాపకార్థం, క్రీస్తు శరీర రక్తాల స్మరణను ఆదివారంకి మార్చారు. సంఘ భోజన స్థానంలో ఆదిమ క్రైస్తవులు లేఖనాల నుండి పఠనాలు తీసుకొని, కీర్తనలను గానము చేయడం మరియు బోధనతో కూడిన వాక్య ప్రార్థనను స్థాపించారు. క్రీస్తు కడరా భోజన సమయంలో పలికిన మాటలను స్మరిస్తూ, దాని చుట్టూ వారు కృతజ్ఞత, స్తుతి మరియు మధ్యవర్తిత్వం యొక్క ప్రార్థనలను జోడించారు. క్రీ.శ. 150 సంవత్సరం నాటికి, పునీత వేదసాక్షి జస్టిన్, దివ్యపూజ యొక్క ప్రాథమిక నిర్మాణం అప్పటికే

అమలులో ఉందని మనకు చెబుతాడు. ఈ కడరా స్మరణ, క్రీ.శ. 313 సంవత్సరం వరకు ప్రజల ఇళ్లలో జరిగాయి. ఆదివారం ఒక పాఠకుడి ద్వారా రెండు పఠనాలు, యాజకుడు ద్వారా ఒక ధర్మోపదేశం, తరువాత కృతజ్ఞత ప్రార్థన మరియు దివ్య సత్ప్రసాదము పంచి ఇవ్వడం ఉన్నాయి. కడరా స్మరణ యొక్క ప్రాథమిక రూపం ఆదిమ క్రైస్తవ సంఘం నుండే ఉందని మరియు 2,000 సంవత్సరాలుగా మనుగడలో ఉందని స్పష్టంగా మనకు తెలుస్తుంది.

### 1.7.3. అభివృద్ధి చెందిన క్రీస్తు శరీరం

313వ సంవత్సరం క్రైస్తవ మతానికి ఒక మలుపు. వేద హింసలు అకస్మాత్తుగా ముగిశాయి. కాన్‌స్టాంటైన్ క్రైస్తవులకు స్వేచ్ఛ ఇచ్చాడు మరియు దివ్య సత్ప్రసాద ఆరాధన కోసం బృహద్దేవాలయాలు నిర్మించడానికి చాలా డబ్బు ఖర్చు చేశాడు. నిరాడంబరమైన గృహ చర్చిలు క్రమంగా ఉనికిని కోల్పోయాయి. ఊరేగింపులు, గర్భ గుడిలో మర్యాదపూర్వక కదలిక, వేలాది మంది స్వరాలను ఉత్తేజపరిచేలా పాడే లిటనీలు, ధూపం మరియు గంటలు, పవిత్ర వస్తువులను ముద్దు పెట్టుకోవడం మరియు శాస్తంగ నమస్కారం ఉపయోగం దివ్య బలిపూజ యొక్క పురాతన నిర్మాణంతో పాటు ఒక నమూనాగా మారాయి. వేడుకలు జరుపుకునేవారు. రోమన్ సెనేటర్‌కు తగిన దుస్తులను ధరించారు. ఫ్యాషన్లు మారిన. చాలా కాలం తర్వాత కూడా వాటిని అలాగే ఉంచినందున, వారి పూజలో ధరించే వస్త్రాలను చివరికి పూజా వస్త్రాలుగా మారాయి. గృహ ఆరాధనపు సాధారణ ప్లేట్లు మరియు కప్పులు, విస్తృతమైన చాలీస్ మరియు పేటెన్‌లుగా మారాయి. ఈ యుగంలో, అగస్టీన్ వంటి ముఖ్యమైన మేత్రానులు దివ్య సత్ప్రసాదము యొక్క వేదాంత శాస్త్రాన్ని అభివృద్ధి చేశారు – అతని ఇతివృత్తం – "క్రీస్తు శరీరం (దివ్య సత్ప్రసాదమ) క్రీస్తు శరీరాన్ని (శ్రీసభను) నిర్మిస్తుంది.

### 1.7.4. దివ్య సత్ప్రసాద స్వీకరణ నుండి చాలా మంది విశ్వాసులు దూరమాయెను

మధ్యయుగ కాలంలో యూరప్ అంతటా అద్భుతమైన బృహద్ద్ దేవాలయాలు పెరిగాయి. రంగురంగుల మతపరమైన ఊరేగింపులు, పవిత్ర

పుణ్యక్షేత్రాలకు తీర్థయాత్రలు, నూతనముగా మతపరమైన ఆచారాల పుట్టుక మరియు మరెన్నో ఈ శతాబ్దాలను విశ్వాస యుగం అని పిలవడానికి దారితీశాయి. అయితే, ఈ కాలంలో, దివ్యపూజలో చురుకుగా పాల్గొనడం తగ్గింది. బలిపీఠం తరచుగా ప్రజల దృష్టి నుండి దాచబడింది. కడరా స్మరణ విందులో సమాజం పాల్గొనాల్సిన అవసరం లేకుండా యాజకులు ప్రార్థనను నిర్వహించారు. ప్రజలు తమ జీవితంలోని చాలా విషయాలకు తమ స్థానిక భాషలను ఉపయోగించడం ప్రారంభించినప్పటికీ, దివ్యపూజ లాటిన్‌లోనే ఉంది. యాజకుని ఆరాధన కోసం క్రీస్తు శరీర రక్తాలను ఎత్తి చూపమని కోరడం ద్వారా, ప్రజలు తమ విరహానికి పరిహారం చేసుకున్నారు. చాలా మంది కతోలికులు దివ్య సత్ప్రసాదమును స్వీకరించడం మానేశారు కాబట్టి దివ్య సత్ప్రసాద ఆరాధన ప్రజాదరణ పొందింది. ఇంతలో, బెరెంగర్ ఆఫ్ టూర్స్ యేసు హోస్ట్‌లో నిజంగా లేడని , ఇది అతని ఉనికికి చిహ్నం మాత్రమే సార్దృశంగా ఉందని బోధించారు. 1215లో శ్రీ సభ క్రీస్తు నిజమైన ఉనికిని ధృవీకరించడం ద్వారా అతని అభిప్రాయాలను తిరస్కరించింది మరియు ఈ సిద్ధాంతానికి మద్దతుగా ట్రాన్స్‌బస్టాంటియేషన్ (రొట్టె యొక్క పదార్థం, క్రీస్తు యొక్క పదార్థం లేదా ఉనికి అవుతుంది) అనే భావనను తెలియచేసింది.

### 1.7.5. దివ్యబలిపూజ సంస్కరణ మరియు ట్రైడెంటైన్ బలిపూజ

శ్రీసభ తన శక్తిని తిరిగి పొందడానికి మరియు 1517లో మార్టిన్ లూథర్ చేసిన సంస్కరణను ఎదుర్కోవడానికి 1545లో ట్రెంట్ మహాసభను ప్రారంభించడానికి 28 సంవత్సరాలు పట్టింది. మహాసభ ఫాదర్లు దివ్య పూజను పునరుద్ధరించాలని పిలుపునిచ్చారు. 1570లో పాపుగారు పాయస్ V ఈ పిలుపుకు ప్రతిస్పందించారు, ఇది లాటిన్ చర్చకి దివ్యపూజ వేడుకకు ప్రామాణిక పుస్తకం ఉండాలని ప్రతిపాదించారు. యాజకుడు బలిపీఠం వద్ద దైవ వాక్యార్చనను మరియు కృతజ్ఞత అర్చనను రెండింటినీ కొనియాడవలెను అని ఆజ్ఞను జారీ చేసారు. దివ్యపూజ టెక్స్ట్ లాటిన్‌లో ఉంది. ట్రైడెంటైన్ దివ్యపూజ యొక్క ఈ ఫార్మాట్ (ట్రెంట్ కోసం పేరు పెట్టబడింది) 1570ల నుండి 1960లలో వాటికన్ II వరకు కొనసాగింది. ట్రైడెంటైన్ దివ్యపూజలో, యాజకుడు, అతని వెనుకకు ప్రజలు ఉండేవారు. యాజకుని నుండి బలిపీఠపు

రెయిలింగ్‌ల ద్వారా ప్రజలు వేరు చేయబడ్డాడు. బలిపీఠం గోడను ఆనుకొని ఉంచబడింది, ఇది 4వ అంతస్తు నుండి పై కప్పు వరకు విలాసవంతంగా అలంకరించబడింది. దేవాలయం మధ్యలో ఒక ఎత్తైన వేదిక ఉండేది, ఇది ప్రసంగం యొక్క ప్రాముఖ్యతను సూచిస్తూ ఉండేది. చాలా మంది ప్రజలు దివ్యపూజను సంగీతం లేకుండా మరియు నిశ్శబ్దంగా, మౌనంగా కొనియాడేవారు. కతోలికులు తమ ఆధ్యాత్మిక దాహాన్ని తీర్చుకోవడానికి ఆధ్యాత్మికత యొక్క కొత్త విద్యాలయాల వైపు మొగ్గు చూపారు: పునీత ఇగ్నేషియస్ యొక్క ఆధ్యాత్మిక సంస్థ, కార్మెలైట్ సంస్థ మరియు పునీత ఫ్రాన్సిస్ డి సేల్స్ సంస్థ. చివరికి, 19వ శతాబ్దంలో, ప్రార్థనా పద్ధతి యొక్క మూలాలకు తిరిగి రావడం అవసరమని స్పష్టమైంది.

### 1.7.6 వాటికన్ II కాలంలోని పూజా విధానం

20వ శతాబ్దం నాటికి, దైవార్చన పునరుద్ధరణ ఊపందుకుంది. రెండవ వాటికన్ మహాసభ (1962–1965) పవిత్ర ప్రార్థనా విధానంపై ఒక సంవిధనాని విడుదల చేసింది. విశ్వాసులు అందరూ పరిపూర్ణముగా, సంపూర్ణ స్పృహతో మరియు చురుకైన భాగస్వామ్యంగా దైవార్చనలో పాల్గొనాలని పిలుపునిచ్చింది. ఆ తర్వాతి ప్రధాన సంస్కరణలు: ప్రార్థనా పద్ధతిని స్థానిక భాషలలో జరుపుకొనుట, యాజకుడు ప్రజల వైపు తిరిగి దివ్యబలిపూజను కొనియాడుట, మరియు సామాన్యులు సైతం చురుకైన పాత్రలు పోషించుట. దివ్య సత్ప్రసాదాని చేతిలో లేదా నాలుకపై స్వీకరించవచ్చు, మరియు రొట్టె మరియు ద్రాక్ష రసం రెండూ అందించవచ్చును. నూతన సంగీత బాణీలు మరియు వివిధ వ్యక్తీకరణ రూపాలు ప్రార్థనా విధానంలోకి ప్రవేశించాయి, ఈ విధంగా క్రైస్తవ ఆధ్యాత్మిక జీవితాన్ని వాటికన్ మహా సభ సుసంపన్నం చేసింది. దివ్య సత్ప్రసాదము మరియు దివ్యబలిపూజ క్రైస్తవ జీవితానికి వమూలం మరియు ఆధ్యాత్మిక శిఖరంవగా ప్రకటించబడ్డాయి.

## కృతజ్ఞతార్చన I & II & III చరిత్ర

### ఉపోద్ఘాతము

కృతజ్ఞతార్చన ప్రార్థన గురువు తన చేతులను పైకి లేపి ఇట్లు చెప్పును,

ప్రభువు నీతో ఉండును గాక మీ మనసులను ప్రభువు వైపు త్రిప్పుము మన దేవుడైన ప్రభువునకు కృతజ్ఞతా తెలుపుదాము.దీనితో కృతజ్ఞతార్చన ప్రార్థన మొదలవుతుంది. ఈ కృతజ్ఞత అర్చన ప్రార్థన దివ్యబలిపూజలో ఒక ప్రత్యేకమైన స్థానమును కలిగి ఉన్నది.

ఇది కృతజ్ఞతార్చన ప్రార్థన. క్రీస్తు ప్రభువుని శరీర రక్తాలను స్వీకరించడానికి ముందు చేసే ప్రార్థన శ్రీసభలో కలిగి ఉంది. చాలా సంవత్సరాలు ఎన్నో ఆదివారాల దివ్యబలిపూజలు నేను చూసి ఉన్నాను ఎంతోమందిని ఈ కృతజ్ఞతార్చిన ప్రార్థన గూర్చి అడిగి ఉన్నాను. అసలు కృతజ్ఞతార్చన ప్రార్థన అనగానేమి దీని అర్థం ఏమిటి? దీనికి సమాధానంగా ఎంతోమంది వేదాంత శాస్త్రులు సమాధానం ఇచ్చి ఉన్నారు. ఇది రొట్టెను ద్రాక్ష రసంను ఆశీర్వదించు మరియు ఎంతో అత్యంతమైన ప్రధానమైన ప్రార్థన మరియు రొట్టె ద్రాక్ష రసము, క్రీస్తు శరీర రక్తాలుగా మారే ప్రక్రియ ఇది ఎంతోమంది క్రైస్తవుల విశ్వాసం. క్రీస్తుని త్యాగం ఈ దివ్యబలిపూజ. కతోలిక శ్రీసభలో దీనికి చాలా నామాలు కలిగి ఉన్నాయి. కృతజ్ఞతార్చన, త్యాగ స్తుతి, పాప మన్నింపు. కానీ క్రైస్తవులకు దివ్యబలిపూజ , కృతజ్ఞతార్చన యొక్క గొప్పతనము ప్రాధాన్యత ఎంతోమందికి తెలియదు.

## ఎందుకు కృతజ్ఞతార్చనలో అప్పమును ఉపయోగిస్తారు.

రొట్టె (అప్పము) ఒక ఆహారం అది మనలను సంరక్షిస్తుంది. జీవించేలా చేస్తుంది. అందుకే క్రీస్తు ప్రభువు, రొట్టె ద్వారా జీవించడానికి, మనల్ని సంరక్షించడానికి రొట్టెను ఎంచుకున్నాడు. రొట్టె ద్వారా తన విశ్వాసుల ఆత్మలను సమృద్ధి పరచడమే కాక, క్రీస్తు ప్రభువు తనను తాను మందసంలో కొలువై ఉన్నాడు. కావుననే క్రీస్తు ప్రభువు దివ్య సత్ప్రసాద రూపంలో మనతో ఉంటూ ఉన్నాడు. పాత నిబంధనలో దేవుడు తాను ఎన్నుకున్న ప్రజలకు వివిధ రూపాల్లో ప్రత్యక్షమయ్యాడు. ప్రేమను చాటుకున్నాడు. అందులో ఒక రూపము రొట్టె కూడా (మొదటి రాజులు 17:13-14). దేవుడు ఎలీషాకు మరియు సరేఫాతు గ్రామంలో ఉండు ఒక విధవరాలుకు కరువు సమయంలో రొట్టె రూపంలో వారికి ప్రత్యక్షమయ్యాడు. ఆ విధవరాలు ఎలీషా చెప్పిన విధంగా చేసింది.

ద్వారా ఆమెకు పిండి మరియు ఓలీవు నూనె సమృద్ధిగా లభించేలా దేవుడు చేశాడు. పాత నిబంధనలో దేవుడు గొర్రె పిల్ల యొక్క బలిని స్వీకరించి ప్రజలను రొట్టె ద్వారా సమృద్ధిపరిచాడు. కానీ నూతన నిబంధనలో క్రీస్తు ప్రభువు భోజనమును మరియు బలిని రొట్ట రూపంలో మలిచాడు ఇది క్రీస్తు ప్రభువుని పాస్కా బలి మరియు ఆధ్యాత్మిక ఆహారం.

## కృతజ్ఞతార్చన ప్రార్థన III చరిత్ర మూలం

కృతజ్ఞతార్చన ప్రార్థన-3ని వాటికన్-2 మహాసభ అనంతరం ప్రవేశపెట్టారు. కొత్త సృష్టికి మూలం. దీనిని ఇటాలియన్ దైవార్చన గురువు అయినా సిప్రియను గారు ప్రవేశపెట్టారు. ఇది సంపూర్ణమైన మరియు స్పష్టమైన పద్ధతిలో వ్యక్తిగత నిర్మాణ అంశాలను ఎలా ఏర్పరచుకోవాలనే దాని ద్వారా ఇది ప్రధానంగా ఉంటుంది. అలా చేస్తూ, అది కేవలం రోమన్ చట్టం మీద ఆధారపడదు, కానీ ప్రార్థన మరియు వేదాంత సంప్రదాయం నుండి ఆలోచనలు మరియు పాఠాలను కూడా కలిగి ఉంటుంది. ఫాదర్ వాగగ్ని ఈ కృతజ్ఞత ప్రార్థన యొక్క పాఠాన్ని అభివృద్ధి చేసే పనిని చాలా చేశారు. 1966లో అతను మూడవ మరియు నాల్గవ కృతజ్ఞత ప్రార్థనలకు చాలా దగ్గరగా ఉన్న రెండు యాంటోరాస్ను అందించే దివ్యబలిపూజలో శ్రీసభ చట్టం యొక్క సంస్కరణకు ఒక ప్రణాళికను ప్రచురించాడు. మూడవ కృతజ్ఞత ప్రార్థన యొక్క ఖచ్చితమైన వచనం తన 1966 ప్రతిపాదనలో ఉన్నవారి నుండి భిన్నంగా ఉంటుంది. తండ్రి, మీరు నిజంగా పవిత్రంగా ఉన్నారు, మరియు అన్ని సృష్టి సరిగా మీరు ప్రశంసలు ఇస్తుంది. అన్ని జీవితం, అన్ని పవిత్రత మీ కుమారుడు, యేసు క్రీస్తు మా ప్రభూ ద్వారా మీ నుండి వస్తుంది, పవిత్రాత్మ పని ద్వారా.

మనలో కొందరు మనల్ని రోమన్ కతోలికులుగా భావిస్తారు, కానీ నిజంగా, కతోలిక యొక్క రోమన్ సంప్రదాయం, కానీ లాటిన్ మాట్లాడే చర్చిలో అనేక ఇతర ఆచారాలలో ఒకటి, దాని యొక్క సొంత శైలి మరియు కృతజ్ఞత ప్రార్థనతో ప్రతి ఒక్కటి. కొన్ని ఇప్పటికీ చుట్టూ ఉన్నాయి. ఈ ప్రార్థనను నిర్మించే రెండు విషయాలు, బలి మరియు పవిత్రాత్మ. త్యాగం అనేది యూకారిస్ట్ యొక్క ముఖ్యమైన అంశం. ఇది ప్రత్యేక ప్రార్థన ద్వారా తెచ్చింది. కృతజ్ఞత ప్రార్థన

3 అంతటా ఇతర పెద్ద అంశాలు పవిత్రాత్మ. అప్పుడు యేసు ఈ త్యాగం యొక్క బాధితుడు మరియు అతను తండ్రి దేవుని ఇచ్చింది, చివరకు ఎవరూ పవిత్ర ఆత్మ గురించి ఆలోచిస్తాడు, అతను తన త్యాగం ద్వారా, అతను రొట్టె మరియు ద్రాక్షరసం యొక్క శరీరం రక్తాలుగా మారుతాయి.

## కృతజ్ఞత ప్రార్థన యొక్క వేదాంతపరమైన అంశాలు

కృతజ్ఞత ప్రార్థన II ఐక్యతను: కమ్యూనిటీని ఒక శరీరం, క్రీస్తులో ఒక ఆత్మ" చేయడానికి పరిశుద్ధాత్మను ప్రేరేపిస్తుంది.

ప్రార్థన: కృతజ్ఞత ప్రార్థన III కమ్యూనిటీ మరియు ఐక్యతగలవారి సభ్యులతో సహా, దేశం మరియు చనిపోయినవారికి మధ్యవర్తిత్వం కలిగి ఉంటుంది.

త్యాగం: కృతజ్ఞత ప్రార్థన III "త్యాగం" మేము ఈ పవిత్ర మరియు జీవన త్యాగంలో మీరు అందించేతో త్యాగం నొక్కిచెప్పారు.

త్రిత్వేక దేవుని కృతజ్ఞత ప్రార్థన III త్రిత్వైక భాషని ఉపయోగిస్తుంది.

## కృతజ్ఞత ప్రార్థన – IV

ఈ ప్రార్థన తూర్పు చర్చి యొక్క సంప్రదాయాల నుండి భారీగా ఆకర్షిస్తుంది (సెయింట్ బేసిల్ యొక్క మరియు బైజాంటైన్ ప్రార్థిల యొక్క అపోస్టోలిక్ రాజ్యాంగ). ఇది చివరి కడరా భోజన కథను అనర్గళంగా, ఇంకా రక్షణ చరిత్ర యొక్క క్లుప్తమైన వివరణ సిద్ధం చేస్తుంది. కృతజ్ఞత ప్రార్థన 4 పదాలలో చాలా గట్టిగా పరిశుద్ధ గ్రంథ వచనాలు ఉన్నాయి, ఇది రోమన్ ఆచారంలో రక్షణ చరిత్ర గురించి చెబుతున్న విభాగం మధ్యలో జరిగిన సంఘటన యొక్క స్థానం. ముందుగానే రెండు భాగాలుగా విభజించబడినట్లుగా ఇది అనిపిస్తుంది. ఏ పూర్వకాలంలో మరియు సంస్కృతులను అనుసరిస్తూ కలిసి మోక్షం యొక్క ప్రణాళికను వివరించే ఒక ఐక్యము కలిగి ఉంటుంది.

కృతజ్ఞత ప్రార్థన 4 చాలా సానుకూలాంశాలు కలిగి ఉంది. ఉదాహరణకు, ఈ క్రింది పదాలను కలిగి ఉంది: "ఈ సమర్పణలో పాల్గొనడానికి, మీ మొత్తం ప్రజలు, మరియు నిజాయితీగల హృదయంతో మిమ్మల్ని కోరుకునే వారందరికీ ఇక్కడకు వచ్చారు." "ప్రజలు" మరియు "అన్నింటిని మీరు కోరుకునేవారు"

నిస్సందేహంగా క్రైస్తవులు మరియు క్రైస్తవులు, వీరిద్దరికి దివ్యాసత్ర్పసాదం ఇవ్వబడుతుంది. ఈ పదము "హొరిజోన్" లో ప్రార్థన యొక్క ప్రార్థన యొక్క "హొరిజోన్" కాథలిక్ లోపలకి పరిమితం కాదు కానీ మానవత్వం యొక్క మొత్తం. Andrances ఇలా చెబుతున్న మరొక మధ్యవర్తిత్వం: "మీ క్రీస్తు శాంతి మరియు అన్ని చనిపోయినవారిలో మరణించినవారిని కూడా గుర్తుంచుకో, ఎవరి విశ్వాసం మాత్రమే తెలుసు." ఈ చివరి పదబంధం, చివరి విశ్వాసం మీకు తెలిసినది" అనేది క్రైస్తవ సమాజంతో వారి విశ్వాసాన్ని పోషించటానికి ఎన్నడూ ప్రజలందరికీ మానవుని సభ్యులను సూచిస్తుంది మరియు ఇంకా దేవుని దయ ద్వారా విశ్వాసాన్ని పొదుపుగా వచ్చారు. కృతజ్ఞత ప్రార్థన-4 నిజంగా మీరు కీర్తి ఇవ్వాలని ఉంది, తండ్రి అత్యంత పవిత్ర, ప్రణాళిక.

## కృతజ్ఞత ప్రార్థన IV

కృతజ్ఞతా ప్రార్థన IV, తూర్పు నుండి రెండు దైవార్చనల ఆధారపడింది బైజాంటైన్ ప్రార్థన - అతను ఎల్లప్పుడూ ప్రపంచంలో తన సొంత వారు ప్రియమైన. అతడు నీకు మహిమపరచబడటానికి వచ్చినప్పుడు, అతని స్వర్గపు తండ్రి, అతను తన ప్రేమ యొక్క లోతును చూపించాడు. వారు భోజనం చేస్తున్నప్పుడు, రొట్టెను తీసుకున్నాడు, రొట్టెను విరిచారు, మరియు తన శిష్యులకు ఇచ్చాడు, ఇలా చెప్పాడు ... "కృతజ్ఞత ప్రార్థన IV యొక్క తూర్పు సంఘం స్పష్టంగా ఉంది: అదే విధంగా, ఇది పునీతుల యొక్క సుదీర్ఘమైన ప్రార్థనతో సహా మరింతగా జోడించడం జరిగింది. మరోవైపు, కృతజ్ఞతా ప్రార్థన IV కేవలం దేవుని మహిమ మరియు గొప్పతనాన్ని తీసుకువస్తుంది, మరియు వివిధ ఒడంబడికలలో అతని పని. ఇది పూర్తిస్థాయి ఉపయోగంలోకి తీసుకురావడానికి ప్రోత్సహించడానికి మంచి కారణం కావచ్చు.

## శ్రీసభలో దివ్యసత్ర్పసాద ఆరాధన

కతోలిక శ్రీసభలో దివ్యసత్ర్పసాద ఆరాధన అనేది ఒక శక్తివంతమైన మరియు భక్తివంతమైన ఆచరణ. ఇది విశ్వాసులకు మరియు క్రీస్తుకు మధ్య లోతైన సంబంధాన్ని పెంపొందిస్తుంది. "దివ్యసత్ర్పసాదం" అనే పదం

యూకారిస్టియ అనే గ్రీకు పదం నుండి వచ్చింది శ్రీసభ ఆచారంలో ఈ పదం క్రీస్తు శరీరం మరియు రక్తాన్ని సూచిస్తుంది. దివ్యసత్ప్రసాద ఆరాధన ద్వారా, కతోలికులు క్రీస్తు శరీరంగా మార్చబడిన దివ్యసత్ప్రసాదం (క్రీస్తు శరీరం) సమక్షంలో సమయాన్ని గడుపుతారు, ఇది నిశ్శబ్ద ప్రార్థన, ఆరాధన మరియు ధ్యాన జీవితం కోసం ఒక నిర్ణీత ప్రాంగణంలో ప్రదర్శించబడుతుంది. ఈ ఆచారం లోతైన వేదాంత ప్రాముఖ్యతను కలిగి ఉంది మరియు శతాబ్దాల శ్రీసభ సంప్రదాయంలో పాతుకుపోయింది. ఇది వ్యక్తిగత మరియు సామూహిక, ఆధ్యాత్మిక ప్రయోజనాలను అందిస్తుంది. దివ్యసత్ప్రసాద ఆరాధన వ్యక్తిగత ఆధ్యాత్మిక వృద్ధిని పెంపొందించడమే కాకుండా, విశ్వాసులను దివ్యసత్ప్రసాదములో కొలువై ఉన్న తమ జీవిత మూలమైన యేసుక్రీస్తుకు దగ్గరగా తీసుకురావడం ద్వారా శ్రీసభ విశ్వాస పటిమను బలపరుస్తుంది.

## దివ్యసత్ప్రసాద ఆరాధన యొక్క చారిత్రక అభివృద్ధి

ఈ కాలంలో అర్థం చేసుకున్నట్లుగా, దివ్యసత్ప్రసాద ఆరాధన ప్రారంభ క్రైస్తవ శ్రీసభలో మూలాలను కలిగి ఉంది. అయితే అధికారిక ఆచారం మధ్య యుగాలలో మరింత స్పష్టంగా ఉద్భవించింది. ప్రారంభం నుండి, దివ్యసత్ప్రసాదము శ్రీసభ జీవితంలో ఒక కేంద్ర స్థానాన్ని ఆక్రమించింది. ప్రారంభ క్రైస్తవులు దివ్యసత్ప్రసాద ఆరాధనను రొట్టె విరుస్తూ మరియు క్రీస్తు రక్తాన్ని పానము చేస్తూ వారి సంఘ ప్రార్థనకు ముఖ్య ఘట్టంగా దీనిని జరుపుకున్నారు. ఈ ఆచారం ముఖ్యంగా క్రీస్తు కడరా భోజన సమయములో చేసిన బోధనలలో మిళితమై ఉంది. అదేవిధంగా ఆదిమ క్రైస్తవ సంఘంలో క్రీస్తు దివ్యసత్ప్రసాదములో నిజముగా కొలువై ఉన్నాడు అని విశ్వసించారు. మొదటి శతాబ్దపు క్రైస్తవ విశ్వాస సమయములో దివ్యసత్ప్రసాద ఆరాధన అనేది దివ్య పూజ సమయంలోనే జరుపుకునే వారు,కానీ ఈ ప్రత్యేక ఆరాధనకు అప్పట్లో ఒక నిర్ణీత విధానం అనేది లేదు. విశ్వాసుల శ్రద్ధ పూర్తిగా దైవార్చనా సాంగ్యాలపైనే ఉండేది. తరాలు మారేకొద్ది ఈ దివ్యసత్ప్రసాద ఆరాధనకు ఒక ప్రత్యేక విధానము అనేది పరిచయం చేయబడి, క్రీస్తు నిజ ఉనికికి తగిన గౌరవ మర్యాదలు పాటించునట్లు ఇది రూపొందించబడింది. కాబట్టి, దివ్యసత్ప్రసాద ఆరాధన అనేది క్రీస్తు నిజమైన ఉనికి యొక్క లోతైన రహస్యానికి

ప్రతిస్పందన. దివ్యసత్ప్రసాదములో క్రీస్తు ఉనికిని గుర్తిస్తారు మరియు గౌరవిస్తారు. ఆరాధన కేవలం మేధోపరమైన వ్యాయామం కాదు, ప్రేమ, ఆరాధన మరియు కృతజ్ఞత యొక్క లోతైన ఆధ్యాత్మిక చర్య. దివ్యసత్ప్రసాదమును ఆరాధించడంలో, కతోలికులు కేవలం రొట్టె ముక్కను గౌరవించడం లేదు, వారు దివ్యసత్ప్రసాదములో తన పూర్తి దైవత్వం మరియు మానవత్వంతో ఉన్న క్రీస్తునే ఆరాధిస్తున్నారు

## a) క్రీస్తు యొక్క నిజమైన ఉనికి: శ్రీసభ బోధన

క్రీస్తు నిజమైన ఉనికి గురించి శ్రీసభ బోధించేదే దివ్యసత్ప్రసాద ఆరాధనకు పునాది. విశ్వాసులు ఆశీర్వదించబడిన దివ్యసత్ప్రసాదము ముందు మోకరిల్లినప్పుడు. వారు సజీవ క్రీస్తు సన్నిధిలో ఉన్నారని నమ్ముతారు. ఈ నమ్మకం లేఖనంలో ముఖ్యంగా యోహాను సువార్తలో (6:51-58) పాతుకుపోయింది. అక్కడ యేసు తన శరీరాన్ని నిజమైన ఆహారంగా మరియు తన రక్తాన్ని నిజమైన పానీయంగా ఇవ్వడం గురించి మాట్లాడాడు కతోలికులకు, ఇది ఒక రూపకం కాదు. కానీ ఇది అక్షరాలా నిజం.

## b) దేవునితో సహవాసం: దివ్యసత్ప్రసాద ఆరాధన అనేది ఒక మార్గం

దివ్యసత్ప్రసాద ఆరాధన దేవునితో మన సహవాసాన్ని మరింతగా పెంచుకోవడం పవిత్రమైన దివ్యసత్ప్రసాదమును ఆరాధించడం ద్వారా విశ్వాసులు క్రీస్తుతో సన్నిహిత సహవాసంలోకి ప్రవేశిస్తారు. దేవుని దగ్గరికి రావాలని మరియు ఆయన సన్నిధి ద్వారా రూపాంతరం చెందాలని ఆయన ఇచ్చే ఆహ్వానానికి ప్రతిస్పందించడానికి ఆరాధన ఒక మార్గంగా మారుతుంది. ఈ నిశ్శబ్ద సమావేశం ద్వారా. విశ్వాసులు లోతైన శాంతి మరియు ఆధ్యాత్మిక పునరుద్ధరణను అనుభవిస్తారు.

## 3. భక్తి మరియు ఆరాధన

దివ్యసత్ప్రసాద ఆరాధన అనేది ఒక చర్య. ఇది దేవుని పట్ల ఉన్న భక్తి మరియు భక్తిని ప్రతిబింబించే ఆరాధన. దివ్యసత్ప్రసాదమును ఆరాధించడంలో విశ్వాసులు దేవుని పవిత్రత మరియు మహిమను గుర్తిస్తారు మరియు ఆయన అన్ని స్తుతులు మరియు గౌరవాలకు అర్హుడని వారు గుర్తిస్తారు. పవిత్ర

దివ్యసత్ప్రసాదము ముందు మోకరిల్లడం, దేవుని గొప్పతనాన్ని వినయంగా గుర్తించడాన్ని సూచిస్తుంది.

## శ్రీసభ జీవితములో దివ్యసత్ప్రసాద ఆరాధన పాత్ర

శ్రీసభ జీవితములో దివ్యసత్ప్రసాద ఆరాధన ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. వ్యక్తిగత విశ్వాసికి మరియు సంఘానికి వ్యక్తిగత స్థాయిలో మరియు విస్తృత సామూహిక స్థాయిలో సహాయపడుతుంది. ఈ ఆచారం శ్రీసభ విశ్వాసాన్ని బలోపేతం చేయడానికి సహాయపడుతుంది. గురుత్వ మరియు మతపరమైన జీవితానికి విశ్వాసులను ప్రోత్సహిస్తుంది మరియు వ్యక్తిగత, సామూహిక పునరుద్ధరణకు ఒక స్థలాన్ని అందిస్తుంది.

a) **వ్యక్తిగత ఆధ్యాత్మిక వృద్ధి:** దివ్యసత్ప్రసాద ఆరాధన విశ్వాసి వ్యక్తిగత పునరుద్ధరణకు తోడ్పడి, ధ్యానములో ప్రార్థనలో మరియు ఆధ్యాత్మికంగా వృద్ధిచెందడంలో సహాయపడుతుంది. దివ్యసత్ప్రసాదము ముందు నిశ్శబ్ద ధ్యానములో ఒకరు క్రీస్తుతో తమ సంబంధాన్ని మరింతగా పెంచుకోవచ్చు, దేవుని సన్నిధిని అనుభవించవచ్చు మరియు ఆయన స్వరాన్ని వినవచ్చు. ఈ ఆరాధన విశ్వాసికి పశ్చాత్తాపపడే అవకాశాన్ని మరియు స్వస్థతకు అవకాశాన్ని అందిస్తుంది. చాలా మందికి, ఇది వారి వ్యక్తిగత పోరాటాలు. భయాలు మరియు ఆశలను ప్రభువు ముందు ఉంచి ఆయన కృప మరియు శాంతిని పొందే సమయం.

b) **శ్రీసభ ఐక్యతను బలోపేతం చేయడం:** దివ్యసత్ప్రసాద ఆరాధన శ్రీసభ యొక్క ఐక్యతను బలపరిచే సామూహిక అంశాన్ని కలిగి ఉంది. దివ్యసత్ప్రసాద ఆరాధన కోసం విచారణలు కలిసి వచ్చినప్పుడు, అది విశ్వాసుల మధ్య సంఘీభావాన్ని పెంపొందిస్తుంది.

3. **యాజకత్వం మరియు సన్యాస జీవిత పిలుపు:** దివ్యసత్ప్రసాద ఆరాధన చాలా కాలంగా దైవాంకిత జీవితముకై పిలుపునివ్వడానిపై ముడిపడి ఉంది. చాలా మంది గురువులు మరియు దైవాంకితులు తమ దైవపిలుపులు దివ్యసత్ప్రసాదము ముందు ఆరాధనలో సమయం గడపడం ద్వారా పెంపొందాయని విశ్వసించి సాక్షమిచ్చారు.

## ముగింపు

దివ్యసత్ర్పసాద ఆరాధన అనేది శ్రీసభ జీవితంలో మరియు ప్రయాణములో కీలక పాత్ర ఎల్లప్పుడూ పోషిస్తూనే ఉంటుంది. ఎందుకు అంటే క్రీస్తే శ్రీసభను స్థాపించాడు మరియు ఎల్లప్పుడూ సదా మీతో ఉంటాను అని ఆయన మాట ఇచ్చాడు. (మత్తయి 28:20). ఈ విశ్వాసముతోనే శ్రీసభ ఎల్లప్పుడూ తన స్థాపకుడు మరియు నాయకుడైన క్రీస్తు నిజంగా దివ్యసత్ర్పసాద రూపములో తనతో కలిసి వాసం చేస్తున్నాడు అని విశ్వసిస్తుంది... అదే విషయాన్ని తన విశ్వాసులకు బోధిస్తుంది.



బ్రదర్ ఫేబియస్ సెబాస్టిన్



బ్రదర్ కుంచవు వినోద్



బ్రదర్ విసెంట్ రాజ్ ఎడ్విన్ మోజెస్

❋ ❋ ❋ ❋

# 5. కృతజ్ఞత ప్రార్థన

– బ్రదర్ బట్టు అజయ్, బ్రదర్ ఆరుగుల్ల రాజేంద్ర,
– బ్రదర్ బొమ్మ ఫ్రాన్సిస్

కృతజ్ఞత ప్రార్థన అనేది పవిత్ర పూజలో కేంద్ర మరియు అత్యంత ముఖ్యమైన భాగం. ఇది కృతజ్ఞత, పవిత్రత మరియు సమర్పణతో కూడిన ప్రార్థన, ఇక్కడ మనం క్రీస్తు త్యాగం మరియు పునరుత్థానాన్ని గుర్తుంచుకుంటాము. కృతజ్ఞత ప్రార్థనను దివ్యపూజ యొక్క కానన్ అని కూడా పిలుస్తారు.

## కృతజ్ఞత ప్రార్థన యొక్క ప్రాముఖ్యత

కృతజ్ఞతప్రార్థన దివ్యబలిపూజకు యొక్క గుండె, వంటిది ఇక్కడ మనం క్రీస్తు ఉనికిని ఎదుర్కొంటాము మరియు ఆయన శరీరం మరియు రక్తాన్ని స్వీకరిస్తాము. ఇది ఐక్యత ప్రార్థన, ఇక్కడ మనం క్రీస్తులో ఒకే శరీరంగా ఏకమౌతాము. కృతజ్ఞతప్రార్థన దేవుని సృష్టి, రక్షణ మరియు పవిత్రీకరణకు మన కృతజ్ఞతను వ్యక్తపరుస్తుంది. ప్రిఫేస్ మరియు 'యూకారిస్టిక్' ప్రార్థన కలిసి ఉంటాయి మరియు అంతర్గతంగా అనుసంధానించబడి ఉంటాయి. దేవుని ఆశీర్వాదం మరియు రక్షణ కోసం అడుగుతూ, తిరుసభ కొరకు ప్రపంచం మరియు మరణించిన వారి కోసం కూడా మనము ప్రార్థిస్తాము.

కృతజ్ఞత ప్రార్థన అనేది ఒక పవిత్రమైన మరియు మధురమైన ప్రార్థన, ఇక్కడ మనం దేవుని ఉనికిని మరియు ప్రేమను అనుభవిస్తాము. పుస్తక రచయిత కృతజ్ఞత ప్రార్థన అంటే మనల్ని రూపాంతరం చెందించి, క్రీస్తుతో మరియు ఒకరినొకరు ఒకటిగా చేస్తుందని స్పష్టంగా చెప్పారు. కృతజ్ఞత ప్రార్థనలో, మనం క్రీస్తు త్యాగం మరియు పునరుత్థానాన్ని గుర్తుంచుకుంటాము మరియు తండ్రికి దివ్యబలిపూజను అందిస్తాము.

## కృతజ్ఞత ప్రార్థన నిర్వచనం

పవిత్ర దివ్యపూజ యొక్క కేంద్ర ప్రార్థన, దీనిని 'కానన్ ఆఫ్ ది మాస్' లేదా 'అనాఫోరా' అని కూడా పిలుస్తారు. కృతజ్ఞత, పవిత్రత మరియు అర్పణల యొక్క ప్రార్థన, ఇక్కడ రొట్టె మరియు ద్రాక్షారసం క్రీస్తు శరీరం మరియు రక్తంగా మారుతాయి. సిలువపై క్రీస్తు బలిని ప్రార్థించే ప్రార్థన.

మొత్తం దైవ ప్రజలతరపున గురువు చేసే సామూహిక ప్రార్థన. లేఖనం, సంప్రదాయం మరియు ప్రారంభ తిరుసభ యొక్క ప్రార్థనా పద్ధతులలో పాతుకుపోయిన ప్రార్ధనా. విశ్వాసులు క్రీస్తుతో మరియు ఒకరితో ఒకరు ఐక్యంగా ఉండే ఐక్యత ప్రార్థన. ఇది పూజలో పవిత్రమైన మరియు గంభీరమైన క్షణం, ఇక్కడ విశ్వాసులు క్రీస్తు ఉనికిని ఎదుర్కొంటారు మరియు పవిత్ర కమ్యూనియన్‌లో ఆయన శరీరం మరియు రక్తాన్ని పొందుతారు.

## 1. కృతజ్ఞతాప్రార్థన యొక్క అంశాలు

ప్రధానంగా ఎనిమిది అంశాలు ఉన్నాయి. అవి: 1. కృతజ్ఞతా భావం 2. స్తుతిగీతం 3. పవిత్రాత్మ ప్రార్థన 4. దివ్యసత్ప్రసాద స్థాపన 5. విశ్వాస రహస్యము 6. సమర్పణ ప్రార్థన 7. విన్నపములు 8 డాక్సాలజీ

### 1.1 కృతజ్ఞత ప్రార్థనకు ముందు

ముందుమాటలో (ప్రిఫేస్) గురువు, దైవ ప్రజల మొత్తం అందరి ప్రభువు చేసిన సకల సృష్టి నిమిత్తం అతని రక్షణ ఫలాల నిమిత్తం లేక ఏదైనా ప్రత్యేక ఉద్దేశం నిమిత్తము తండ్రి దేవుడిని మహిమపరుస్తాడు, ఆరాధిస్తాడు మరియు కృతజ్ఞతలు తెలుపుతాడు. GIRM 79a.

### 1.2 స్తుతిగీతం యొక్క అర్థం

ఇది పరిచయాన్ని సూచిస్తుంది. సామూహికంగా దీని అర్థం "ముందు", దేవుని ముందు ప్రార్థన మరియు సమాజం ముందు ప్రార్థన. ప్రార్థన అనే పదానికి అర్థం, దేవుడు మరియు ఆయన ప్రజల ముందు మాట్లాడటం. సరళంగా చెప్పాలంటే ఇది దేవుని స్తుతి మరియు దేవుని ముందు ప్రకటన. ఐదవ శతాబ్దం నుండి వాటికన్ II వరకు ముందుమాట యొక్క చారిత్రక నేపథ్యం, రోమన్ ఆచారం రోమన్ కానన్ అని పిలువబడే ఒకే ఒక 'యూకారిస్టిక్' ప్రార్థనను కలిగి ఉంది. రోమన్ సంప్రదాయంలో దాని మూలం కారణంగా

దీనిని రోమన్ అని పిలుస్తారు మరియు కానన్ స్థిరంగా ఉన్నందున దానిని మార్చకూడదు.

కృతజ్ఞత ప్రార్థన I అనేది మొత్తం సంఘంతో కలిసి ఉన్నప్పుడు, సరైన సందర్భానుగు ప్రార్థనా రూపం కలిగి ఉన్న స్తుతిగీత ప్రార్థనలు ఉన్నప్పుడు, ఆదివారాల్లో అపొస్తలులు మరియు పునీతుల పండుగలు ఉన్నప్పుడు ఉపయోగించబడుతుంది GIRM 364.

కృతజ్ఞత ప్రార్థన II దాని స్వంత ప్రిఫేస్ కలిగి ఉంది. ఇతర ప్రిఫేస్లతోప్రత్యామ్నాయం చేయవచ్చు. దీనిని వారపు రోజులలో ఉత్తమంగా ఉపయోగించడం మంచిది. ప్రధాన ఇతివృత్తాలు సంగ ఐక్యత.

యూకారిస్టిక్ ప్రార్థన III పవిత్రాత్మపై లేదా చర్చి యొక్క ప్రపంచవ్యాప్త స్వభావంపై దృష్టి పెడుతుంది. ఆనాటి సెయింట్ లేదా విచారణ పాలక పునీతుని పేరును చేర్చడానికి నిబంధన ఉన్నందున దీనిని ఉత్తమంగా ఉపయోగిస్తారు.

యూకారిస్టిక్ ప్రార్థన IV, ఇది గొప్పది మరియు కవితాత్మకమైనది మరియు మార్చలేని ముందుమాటను కలిగి ఉంటుంది. ఈ ప్రార్థన ఇతర ప్రార్థనల కంటే మోక్ష చరిత్రను ఎక్కువగా వివరిస్తుంది. పాత నిబంధన, ప్రవక్తల నుండి చదివినప్పుడు, ఒడంబడికను గురించి ఇది వర్తిస్తుంది.

## 1.3 స్తుతిగీతం యొక్క సాహిత్య వచనం

3వ శతాబ్దంలో రోమ్‌కు చెందిన హిప్పోలిటస్ యొక్క అపోస్టోలిక్ సంప్రదాయంలో కూడా ప్రిఫేస్ (ముందుమాట) యొక్క చారిత్రక భాగం మూడు సంభాషణలను కలిగి ఉంది. దీనికి మూడు భాగాలు ఉన్నాయి: 1. సంభాషణ, 2. స్తుతి ప్రార్థన, 3. సాక్తుస్ (హోసన్న).

### 1.3.1 సంభాషణ

**a. ప్రభువు మీతో ఉండును గాక.**

దీనికి రెండు కారణాలు ఉన్నాయి: 1. ఒక ముఖ్యమైన సందేశం లేదా ఒక చర్య జరగబోతోంది అని అర్థం. 2. రెండవది, విశ్వాసులను ప్రార్థనకు ఆహ్వానించడం. ఉదా: రూతు 2:4, గలతీ 6:8, 2 తిమోతి 4:22, లూకా 1: 26-38.

## వివరణ

"ప్రభువు నీతో ఉండు గాక" అనే మాటల ద్వారా ఏదో గొప్ప విషయం జరగబోతోందని ఈ పదం స్పష్టంగా తెలియజేస్తుంది. ఉదాహరణకు, కన్య మరియకు దూత ఒక గొప్ప శుభవార్త చెప్పే ముందు ఈ మాటలనే పలుకుతుంది, అనుగ్రహ పరిపూర్ణురలా నీకు శుభము. ప్రభువు నీతో ఉన్నారు అని. ఇక్కడ రక్షణ ప్రణాళికలో మరియకు గొప్ప శుభవార్త తెలియజేయబడింది. సిలువ గుర్తు తర్వాత ఈ మాటలతో పవిత్ర దివ్యబలిపుజ ప్రారంభమవుతుంది. మోక్షారోహణమునకు ముందు యేసు చెప్పిన చివరి మాటలు, ఇదిగో లోకాంత్యమువరకు సర్వదా నేను మీతో ఉందును. దీని తర్వాత పవిత్రాత్మ రాకడ జరిగింది. సువార్త లోకమంతా ప్రకటించబడుతుంది.

**b. మీ హృదయాలను ప్రభువైపు త్రిప్పుడు.**

**ఈ మాటలకు నాలుగు ముఖ్య అర్ధలు ఉన్నాయి.**

1. హృదయం అన్ని భావోద్వేగాలు, భావాలు, ఆలోచనలకు కేంద్రం. 2. ఇది ఆధ్యాత్మిక కార్యకలాపాలకు మరియు మానవ జీవితంలోని అన్ని కార్యకలాపాలకు కేంద్రం. 3. చేతులు పైకెత్తడం అనే సంజ్ఞ, చేతులు భౌతికంగా పైకి లేవడం అనేది దేవునిపై మాత్రమే దృష్టి పెట్టాలనే అంతర్గత ఉద్దేశ్యానికి బాహ్య సంకేతం. దీని అర్థం దేవునిపై, ఆయన నివసించే స్వర్గంపై మన దృష్టిని ఉంచడం. 4. ఇది భూమి నుండి స్వర్గాము వైఫనకు కదలికను కూడా సూచిస్తుంది. CCC.2590.

**c. మన దేవుడైన ప్రభువుకు కృతజ్ఞతలు తెలుపుడు.**

ఇది ఖచ్చితంగా ఏమి జరగబోతోందో తెలుపుతుంది సృష్టి మరియు క్రీస్తు రక్షణ ఫలాల కోసం దేవునికి కృతజ్ఞతలు చెప్పడం. కొలొస్సీ 3:17.

ప్రతిస్పందనగా దైవ ప్రజలు ఇది యుక్తము న్యాయను అని జవాబిస్తారు. ఇది మన ఇష్టాన్ని సూచిస్తుంది. గ్రీకు అర్థంలో దీని అర్థం పోలిస్ అంటే ఒప్పందం. ఇయుస్టమ్: చట్టం ప్రకారం చేసిన చర్యల నాణ్యత. నిర్గమ 1:16, రోమీ 8:4.

పునీత థామస్ అక్వినాస్ ఇలా అంటాడు, న్యాయం అంటే మరొకరికి,

అతని లేదా ఆమె హక్కును ఇవ్వడం. కానీ దేవునికి మనం మన జీవితంలో ఆయన నుండి పొందిన అన్ని మంచికి, ప్రపంచంలోని అన్ని మంచి విషయాలకు, ఆయన కుమారుని యొక్క అత్యున్నత బహుమతికి మన జీవితం మొత్తం లో దేవునికి  పూర్తిగా కృతజ్ఞతలు తిరిగి చెల్లించలేము.

## 2. స్తుతి ప్రార్ధన

ప్రజలందరూ ప్రభువును స్తుతించాలీ. (GIRM.79). దివ్యపూజ సమయంలో మనం దేవదూతల గాయక బృందాలలో చేరడం ఇది రెండవసారి. గ్లోరియా, సాంక్టస్. క్రీస్తు జననంలో దేవదూతలు తాత్కాలికంగా పాడినది గ్లోరియా. సాంక్టస్ దివ్య పూజ యొక్క మధ్య భాగంలో ఉంచబడింది. కొన్నిసార్లు ఆగమన కాల  మరియు తపస్సు కాలాలలో  గ్లోరియాను వదిలివేయవచ్చు, అయితే ఏ పూజలోను సాంక్తుస్ ఎప్పుడూ మినహాయించరు.

### 2.1 దివ్య గ్రంథ ఆధారం

పరిశుద్ధుడు, పరిశుద్ధుడు........ (కీర్తన 89:8, యెషయా 6:3, ప్రకటన 4:8 స్వర్గం మరియు భూమి, సంఖ్యాకాండము 14:21, అపొస్తలుల కార్యములు 7:55, ప్రకటన 15:8,  హొసన్నా... కీర్తన 118:25, మత్తయి 21:9, యోహాను 12:21 , కీర్తన 118:26, ఫిలిప్పీ. 2:11.

### 2.2 దళాధిపతి ఆయన ప్రార్ధనలో ప్రాథమిక అంశాలు

ఇది ప్రధానంగా ఐదు ముఖ్యమైన అంశాలను కలిగి ఉంది: 1. ఆరాధన: పవిత్ర పవిత్ర పవిత్ర ప్రభువు 2. బాహ్య ప్రకటనా: సైన్యములకు అధిపతి ఆయన ప్రభువు. 3. స్తుతి: పరలోక భూలోకములు నీ మహిమతో నిండి ఉన్నవి 4. పొగడ్త : ప్రభువు నామంలో వచ్చేవాడు ధన్యుడు. 5. విన్నపం: హొసన్నా, అంటే మమ్మల్ని రక్షించు ప్రభూ.

ఇది ప్రధానంగా లేఖనాధారం నుండి రెండు భాగాలను కలిగి ఉంటుంది. 1. మొదటి భాగం యెషయా 6:3 పుస్తకం నుండి వచ్చింది. ఈ వచనం పురాతన కాలం నుండి యూద ప్రజలలో ఉపయోగించబడింది. ఈ భాగం అత్యున్నత స్వర్గం మరియు దేవదూతల అత్యున్నత హొదా. 2. రెండవ భాగం ధన్యుడు అనే పదంతో ప్రారంభమవుతుంది. ఇది మత్తయి సువార్త 21:9

ప్రకారం సువార్త నుండి తీసుకోబడింది. ఇది యేసు మట్ల ఆదివారం ప్రవేశాన్ని వివరిస్తుంది.

## 3. ఎపిక్లెసిస్ (ఆహ్వానం)

### 3.1 అర్థం

ఈ ప్రత్యేకమైన ప్రార్థనలో, గురువు చేతుల ద్వారా అర్పించబడిన బహుమతులు పవిత్రం చేయబడాలని, అంటే క్రీస్తు శరీరం మరియు రక్తంగా మారాలని పరిశుద్ధాత్మ శక్తిని వేడుకుంటుంది.

### 3.2 సంజ్ఞలు మరియు జ్ఞాపకం

ప్రార్థనలో రెండు ముఖ్యమైన సంజ్ఞలు ఉన్నాయి: 1. గురువు చేతులు జోడించి అప్ప ద్రాక్ష రసాలపై చేతులు విస్తరించడం. 2. సిలువ గుర్తును వేసి బహుమతులను ఆశీర్వదించడం. దివ్య పూజలో ఎపిక్లసిస్ రెండుసార్లు కనిపిస్తుంది.

మొదట, పవిత్రాత్మ ప్రార్థనప్పుడు ముందు, "ఈ బహుమతులను పవిత్రంగా చేయడానికి మీ ఆత్మ వాటిపైకి రావాలి, తద్వారా అవి మా ప్రభువైన యేసుక్రీస్తు శరీరం మరియు రక్తంగా మారతాయి అని ప్రార్థించడం ద్వారా. కృతజ్ఞత ప్రార్థన I & III. గురువు పరిశుద్ధాత్మ ద్వారా తిరుసభను ఒకటిగా ఉంచమని ప్రార్థిస్తాడు,

"క్రీస్తు శరీరం మరియు రక్తంలో పాలుపంచుకునే మనమందరం పరిశుద్ధాత్మ ద్వారా ఐక్యతతో కలిసి ఉండాలి... EP. II

"ఆయన శరీరం మరియు రక్తంతో పోషించబడిన మనం ఆయన పరిశుద్ధాత్మతో నిండి, క్రీస్తులో ఒకే శరీరం మరియు ఒకే ఆత్మగా మారగలమని ప్రసాదించుము". EP. III

## 4. దివ్యసత్ప్రసాద ప్రతిష్ట

క్రీస్తు మాటలు మరియు చర్యల ద్వారా అప్ప ద్రాక్ష రసాలు క్రీస్తు శరీర రక్తలుగా మారుతాయి. క్రీస్తు తన శిష్యులతో తన చివరి భోజనంలో తన శరీరాన్ని మరియు రక్తాన్ని రొట్టె మరియు ద్రాక్షారసం రూపంలో అర్పించి, అపొస్తలులకు తినడానికి మరియు త్రాగడానికి ఇచ్చి, అదే రహస్యాన్ని శాశ్వతం

చేయమని ఆజ్ఞాపించాడు. ఇక్కడ దివ్యబలిపూజ మూలం స్థాపించబడింది. (GIRM.79).

త్యాగం ప్రజల మధ్య జరగాలి, అందుకే త్యాగం స్థాపించబడింది. యేసు చేసిన త్యాగం మరుసటి రోజు సిలువపై జరిగిన సంఘటనకు పూర్వరూపం. పాత నిబంధనలో భవిష్యత్తు సంఘటనలను వర్ణించే ఉదాహరణలు చలా వున్నాయి. GIRM 3.

### 4.1. గతాన్ని స్మరించుకోవడం మరియు వర్తమానాన్ని తిరిగి అమలు చేయడం

ఇది గతంలో జరిగిన దానిని గుర్తుచేసుకోవడమె కాదు. కానీ జరుగుతున్న దానిని అనుభవించాలి. కాలం (వర్తమాన కాలం) ప్రస్తుతం జరుగుతున్న సంఘటనను సూచిస్తుంది. ఇవి యేసు మాటలు కాబట్టి ఎవరూ స్వయంగా ఉచ్చరించకూడదు. దివ్య పూజలో ఏదీ గతంలో జరిగిన దాని నాటకం కాదు. ఇది పూర్తిగా సజీవమైనది మరియు క్రీస్తు యొక్క విమోచన చర్య. పూజలో జరిగే ప్రతిదానిలోనూ, ప్రతి సంకేతం మరియు మాటలోనూ, క్రీస్తు పూర్తిగా ఉన్నాడు. ఆయన గురువునందు, అప్ప ద్రాక్షారసము లోను మరియు విశ్వాసులలో కూడా పూర్తిగా ఉన్నాడు. అందుకే విశ్వాసుల మధ్య క్రీస్తు ఉనికిని అంగీకరించే విశ్వాసులకు ధూపం వేస్తాడు మరియు దేవునికి అర్పించబడిన ధూపంతో వారిని ధూపం వేయడం ద్వారా వారిని పవిత్రంగా చేయాలనే ఉద్దేశ్యంతో కూడా.

### 4.2. అప్ప ద్రాక్షారసములు క్రీస్తు శరీర రక్తకుగా మారు గడియ

మధ్య యుగం వరకు ఏ సమయంలో కచ్చితంగా కానుకలు క్రీస్తు శరీర రక్తాలుగా మారుతాయో చెపోయాలేము. 6వ భక్తినాధ పాపుగారూ, గురువు క్రీస్తు పలికైన మాటలు చెప్పినప్పుడు మారుతాయి అని ప్రకటించారు.

### 4.3. తూర్పు మరియు పశ్చిమ సంఘాల మధ్య వ్యత్యాసం

పాశ్చాత్య సంఘాలు క్రీస్తు మాటలపై దృష్టి పెడుతుంది. తూర్పు సంఘాలుకు, ఎల్లప్పుడూ ముఖ్యమైన క్షణం ఎపిక్లెసిస్. తూర్పు ఆచారాలలో, సంస్థాపన కథనం లేని యూకారిస్టిక్ ప్రార్థనలు ఉన్నాయి. వేదాంతవేత్తలు పరమ రహస్యం యొక్క ఖచ్చితమైన సమయం కోసం వెతుకుతున్నారు. CCC. 1353.

## 4.4. ప్రతిష్ఠ ప్రశ్న

మొట్టమొదటగ, మార్పు క్రమంగా కాకుండా తక్షణమే జరుగుతుంది. 0%– 100% లాగా కాదు, ఒకేసారి 100% గా మారుతుంది. కొంతమంది పూర్వ పండితులు, ఈ రెండు రూపాలు, అంటే, రొట్టె మరియు ద్రాక్షారసాన్ని పవిత్రం చేయడం కోసం, ఒకదానికొకటి చర్య కోసం వేచి ఉన్నాయని, తద్వారా మొదటిది రెండవది ఉచ్చరించే వరకు దాని ప్రభావాన్ని ఉత్పత్తి చేయదని చెప్పారు.

పునీత థామస్ అక్వినాస్ ఇలా అంటున్నాడు,

రొట్టెను పవిత్రం చేయడానికి నేరుగా పదాలు ఉచ్చరించబడతాయి, పవిత్రమైన రొట్టెను ప్రజలందరికీ ఆరాధించమని చూపబడుతుంది, ఇది క్రీస్తు శరీరం అందువల్ల, ద్రాక్షారసాన్ని పవిత్రం చేయడానికి పదాలు ఉచ్చరించే ముందు రొట్టె యొక్క పవిత్రమైన పదాలు వాటి ప్రభావాన్ని చూపుతాయి.

## 4.5. మార్పులోని సారూప్యత సూత్రం

అప్ప స్రాక్ష రసాంలో  క్రీస్తు శరీరం, రక్తం, ఆత్మ మరియు దైవత్వాన్ని పొందుతాయి. దీని అర్థం, రొట్టెలో శరీరం, రసములో రక్తం మాత్రమే కాదు. రెండింటిలో దివ్య శరీరం రక్తం దివ్య ఆత్మ, దైవ స్వభావం ఉంటాయి.

## 4.6. మోకాళ్ళూని ఆరాధించడం

పవిత్ర రొట్టె రసాలను ఆరాధించడానికి సరి అయిన క్షణంపై గొప్ప చర్చ జరిగింది. 1200లో ఇది జరిగింది, రొట్టెపై పవిత్ర పదాల తర్వాత మరియు ద్రాక్ష రస పాత్రపై పవిత్ర పదాల ముందు దైవిక క్షణం జరుగుతుంది. ఇది మోకాళ్ళూని ఆరాధించే సంఖ్యను తీసుకువచ్చింది. చాలీస్‌ను పైకి లేపడానికి దాదాపు ఒక శతాబ్దం పట్టింది ఎందుకంటే, విశ్వాసులు రొట్టెను చూడగలరు, అయితే వారు ద్రాక్షారసపాత్రలో రక్తాన్ని చూడలేరు. ఇది ద్రాక్షారసపాత్రను ఆరాధిస్తున్నట్లు అనిపిస్తుంది. ఇది ప్రజలు మతకర్మను ఆరాధించడానికి మరియు భక్తితో కూడిన భక్తిని పెంపొందించుకోవడానికి దారితీసింది. పదమూడవ శతాబ్దం నాటికి ప్రధాన దృష్టి ఆరాధనపై మరియు స్వీకరించకపోవడంపై మాత్రమే ఉంది. వారు పవిత్ర మైన రొట్టెను చూసినందున ప్రజలు ప్రత్యేక ఆశీర్వాదం పొందాలని ఆశించారు.

**ఇలా మొకరించి ఆరాధించడానికి అర్థం**

ఎ. సిలువపై క్రీస్తు లేపబడిన చిహ్నం.

బి. పవిత్ర రొట్టె వైపు ప్రజల పైకి చూపు: దేవుణ్ణి స్వయంగా చూడటం వారి జీవితంలోని చివరి లక్ష్యాన్ని ప్రజలకు గుర్తు చేస్తుంది.

సి. ఆరాధన (గంట మోగింది). తొలినాళ్లలో గురువు దైవ మండసానికి ఎదురుగా పూజలు నిర్వహించేవారు. ఆయన రొట్టెను తన తలపైకి ఎత్తడం వలన ప్రజలు దానిని ఆరాధిస్తారనేందుకు ఒక సంకేతం.

**విజ్ఞాపన ప్రార్థనలు**

విజ్ఞాపన (మధ్యస్థత) ప్రార్థన ద్వారా, శ్రీసభ తన ఇహలోక సభ్యులందరికీ మరియు ఈ లోకాన్ని విడిచి వెళ్లిన మృతులకూ క్రీస్తు యొక్క శరీరరక్తాల ద్వారా సాధించిన విమోచన మోక్షంలో పాలుపంచుకునే అవకాశం కల్పిస్తూ ప్రార్థన చేస్తుంది. యూదుల ఆచార ప్రకారం, యాజకుడు బలిపీఠం మీద అర్పించే ప్రార్థనలకు గుర్తుగా, క్రైస్తవ సంప్రదాయంలో యాజకుడు చేసే విజ్ఞాపన ప్రార్థనలు ఉన్నాయి.

జ్ఞాన స్నానం ద్వారా, తిరుసభ బిడ్డలుగా మనం క్రీస్తు ప్రభువునికి చేసిన వాగ్దానాలను మళ్ళీ నూత్నకరించుకుంటాము. అలాగే పుత్రుల పుత్రికల (బిడ్డల) కోసం, ముఖ్యంగా జగద్గురువులు, పీఠాధిపతులు, గురువులు, దైవజనులందరితో సహా నీ బిడ్డలందరినీ కనికరించి, నీతో ఐక్యపరచుము అని ప్రార్థించబడుతుంది.

పరమ దివ్యబలిపూజ సంఘ ప్రజల ఐక్యతకు గుర్తుగా నిలుస్తుంది. అలాంటి సంఘఐక్యతకు గుర్తుగా, బలిపూజ సమయంలో విశ్వాసులందరూ పరలోకమందు, ఉత్తరించు స్థలమందు ఉన్న క్రైస్తవులతో కలసి, ఈ లోకాన్ని విడిచినవారితో మూడు కృతజ్ఞతా ప్రార్థనల ద్వారా ఐక్యతగా పాలుపంచుకుంటారు.

**ఒకటవ కృతజ్ఞత ప్రార్థనలో:** అప్ప ద్రాక్షరసాన్ని ఆశీర్వదించక ముందు, జీవించి ఉన్న విశ్వాసుల కొరకు ప్రార్థించబడుతుంది. ఆశీర్వాదానంతరం, ఈ లోకాన్ని విడిచిన విశ్వాసుల కొరకు ప్రార్థన జరుగుతుంది.

**ఇతర కృతజ్ఞతా ప్రార్థనలలో:** ఆశీర్వాదానంతరం విజ్ఞాపన ప్రార్థనలు

చేయబడతాయి. ముందుగా మనం ఈ లోకమందు నివసిస్తున్న వారి కొరకు ఇలా ప్రార్థిస్తాము: ఈ లోకమున యాత్రచేసే నీ తిరుసభని, జగద్గురువులను, మా పీఠాధిపతులను, ఇతర పీఠాధిపతులను, గురువులను, నీవు సంపాదించుకున్న ప్రజలందరిని విశ్వాసమందూ ప్రేమయందూ దృఢంగానిలుపుము ఆ తరువాత:

చనిపోయిన మా సహోదరులను, నీ ప్రేమయందు ఈ లోకాన్ని విడిచిన అందరినీ, నీ రాజ్యంలో చేర్చుమని ప్రభువైన క్రీస్తుని వేడుకుంటాము.

**విశ్వాస ప్రార్థనలు మరియు విజ్ఞాపన ప్రార్థనలు మధ్య తేడా ఉంది:**

- విశ్వాస ప్రార్థనలలో, మన అవసరాల కొరకు దేవునిని వేడుకుంటాం.
- విజ్ఞాపన ప్రార్థన, ముఖ్యంగా దేవుని సేవకుల కోసం ప్రార్థించబడుతుంది.

## అ) జగద్గురువులు మరియు పీఠాధిపతుల పేర్లను పెట్టడం

ప్రతి కృతజ్ఞతా ప్రార్థనలో, మన శ్రీ సభను పరిపాలిస్తున్న జగద్గురువులు మరియు పీఠాధిపతుల పేర్లు గుర్తు చేస్తాం. దీనివల్ల వారి కొరకు ప్రార్థిస్తూ, వారు చేస్తున్న సేవలో దేవుడు వారికి తోడుగా ఉండాలని, సంఘాన్ని సక్రమంగా నడిపించేందుకు శక్తిని ప్రసాదించాలని వేడుకుంటాం. వారి పేర్లను స్మరించడం మనం వారి సేవను గుర్తించి, వారి తోడుభావాన్ని తెలియజేస్తుంది.

ప్రతి గురువు తప్పనిసరిగా జగద్గురువు మరియు తమ పీఠాధిపతుల నామాలను ప్రతి దివ్యబలిపూజలో కృతజ్ఞతా ప్రార్థనలో స్మరించాలి. ఇది గురువు యొక్క బాధ్యత. ఇలా చేయడం ద్వారా జగద్గురువులతో మరియు తమ పీఠాధిపతులతో ఉన్న ఐక్యతను తెలియజేస్తారు.

## బ) కృతజ్ఞతా ప్రార్థనలో పునీతుల పేర్లు

దివ్యబలిపూజలో ప్రత్యేకంగా పునీతుల పేర్లను స్మరిస్తూ, వారి మధ్యస్థతా ప్రార్థన సహాయాన్ని వేడుకుంటాము. మనం వారిని అర్థిస్తే వారు మన కొరకు దేవుని వేడుకుంటారు.

- 1వ కృతజ్ఞతా ప్రార్థనలో: నిత్యకన్య అయిన మరియ తల్లిని, ఆమె భర్త పరిశుద్ధ యోసేపును, అపొస్తులను, వేద సాక్షులను, సకల పునీతులను భక్తితో స్మరిస్తాం.
- 3వ కృతజ్ఞతా ప్రార్థనలో: మరియ తల్లిని, అపొస్తులను, సకల పునీతులను స్మరిస్తాం.

- 4వ కృతజ్ఞతా ప్రార్థనలో: క్రీస్తుతో ఐక్యమవ్వటానికి పిలువబడిన వారి యొక్క మొత్తం విభాగాన్ని ఒకే సమూహంగా గుర్తు చేస్తాం.

**సాధారణంగా:**

- సకల పునీతుల పండుగ రోజున 1వ కృతజ్ఞతా ప్రార్థన వాడతారు.
- సాధారణ రోజుల్లో 2వ కృతజ్ఞతా ప్రార్థన వాడతారు.
- పండుగలు, మహోత్సవాల్లో 3వ కృతజ్ఞతా ప్రార్థన వాడతారు.

**ఇది విశ్వాస రహస్యము**

అప్పము మరియు ద్రాక్షారసపాత్రలు పైకి ఎత్తినప్పుడు విశ్వాసులు ఎలాంటి ప్రార్థన చేయకూడదు ఉదాహరణ: ఓ నా దేవా ఓ నా సర్వేశ్వర. విశ్వాసులు విశ్వాస రహస్యము దివ్య పూజ గ్రంథం నుంచి చెప్పాలి

**ఉదాహరణ:**

ప్రభువా మేము నీ మరణమును ప్రకటించెదము
నీ ఉత్తనమును చాటేదము.
నీవు మరలా వచ్చు వరకు వేచి యుందుము.

**లేక:**

ప్రభువా మేము ఈ అప్పమును భుజించునప్పుడల్లా,
ఈ పాత్రము నుండి పానం చేయునప్పుడల్లా,
నీవు మరలా వచ్చు వరకు నీ మరణమును చాటిదము.

**లేక:**

లోకరక్షక, మమ్ము రక్షింపుము.
నీ సిలువ, ఉత్థానము వలన మమ్ము విమోచించితివి. (GIRM 151.)

## స్తుతి గీతము

స్తుతి గీతములో ద్రాక్షారసపాత్రము మరియు అప్పము మాత్రమే పైకి ఎత్తాలి మిగతా పాత్రలు ద్రాక్షరసపాత్రములు మరియు అప్పములతో పాత్ర పైకి ఎత్తకూడదు మిగతా యాజకులు ఉన్నప్పటికీ కూడా. (GIRM 180.)

**స్తుతి గీత క్రమము మరియు దీని యొక్క అర్థం.**

గురువు ద్రాక్షరాస యొక్క పాత్రను అప్పం యొక్క పాత్రను పైకి ఎత్తి పవిత్రంగా ఈ విధంగా పలుకుతారు,

క్రీస్తుద్వారా, క్రీస్తుతో, క్రీస్తు నందు
సర్వ శక్తి గల పితయైన సర్వేశ్వర,
పవిత్రాత్మతో ఏకమై ఉండు నీకు,
యుగములు గౌరవ మహిమలు కలుగును గాక.
దీనికి విశ్వాసుల సమాధానము
ఆమెన్.

దీనిని తరచుగా గొప్ప ఆమెన్ అని పిలుస్తారు ఎందుకంటే ఇది దివ్య బలి పూజలో ముఖ్యమైన సంఘటన సంఘము మొత్తం కలసి ఏక స్వరముతో పలుకుతారు.

## అర్థం మరియు వేదాంత ప్రాముఖ్యత

త్రీత్వైక స్తోత్రం: విశ్వాసాన్ని స్పష్టంగా వెల్లడిస్తుంది, క్రీస్తు ద్వారా పవిత్ర ఆత్మతో తండ్రికి స్తుతులు ఆరాధనలు కృతజ్ఞతలు తెలుపుతూ తండ్రి అయిన దేవునికి కుమారుడైన యేసు క్రీస్తుక మధ్యవర్తిగా మరియు పవిత్ర ఆత్మతో ఐక్యతతో ఉంటారు అనే వాక్యం చెబుతుంది.

**మధ్యవర్తిగా క్రీస్తు:** ఆయన ద్వారా, ఆయనతో, ఆయనలో అనే పదాలలో కృప మరియు ఆరాధనలు శ్వాసత ప్రధాన యాజకుడైన యేసు క్రీస్తు ద్వారా సాధ్యమవుతున్నాయని కతోలిక అవగాహనను వ్యక్తపరిస్తాయి. ఆయన ఒకే మనసుతో ఐక్యతను పవిత్ర ఆత్మ ద్వారా ప్రదర్శిస్తున్నారు.

**ఆరాధనలో ఐక్యత:** పవిత్ర ఆత్మ ఐక్యతలో శ్రీసభ యొక్క ఆరాధన పరిశుద్ధాత్మ ద్వారా ఏకం చేయబడి పవిత్రం చేయబడిందని నొక్కి చెబుతుంది. ఇది దైవక ఆరాధన యొక్క ఒకే చర్యలో సంఘం.

**ప్రార్థన యొక్క ముగింపు:** దివ్యబలి పూజలు స్తుతి గీతం ప్రార్థన యొక్క ముగింపును సూచిస్తుంది. ఇది క్రీస్తు యొక్క శ్రమలు, మరణం, పునరుత్థానము మరియు ఆరోహణ యొక్క రహస్యాన్ని ఒక చోట చేర్చి దానిని తండ్రికి సంపూర్ణ భలిగా అర్పిస్తుంది.

## దైవార్చన సందర్భాలు:

స్తుతి గీతం పూజలో గురువు ఉపగురువుల సహకారంతో దేవునికి స్తుతి గీతం పాడుతారు అప్ప ద్రాక్షరసము పాత్రలను పైకి ఎత్తి కొని ఇది తండ్రికి

సమర్పిస్తూ సూచిస్తుంది ప్రజలు ఆమెన్ అనేది కేవలం ప్రతిస్పందన కాదు కానీ సమర్పణలు పూర్తి స్పృహ మరియు చురుకైన ఆలోచనతో ఏకాగ్రతతో అర్పణలో పాల్గొంటారు.

## దివ్యబలిపూజ సంకలనము - ముఖ్యమైన భాగములు

## కృతజ్ఞతా ప్రార్థన

78. ఇప్పుడు పూజలో ముఖ్యమైన భాగము ఆరంభ మగుచున్నది. ఇది అత్యంత పవిత్రమైన ప్రార్థన. పూజను సమర్పించు యాజకుడు ప్రార్థనా భావముతో కృతజ్ఞతలు తెలుపు నిమిత్తము ప్రజల హృదయములను ప్రభువువైపునకు త్రిప్పుడని ప్రజలను ఆహ్వానించును. యాజకునితోపాటు తండ్రిని చూచి యేసుక్రీస్తు ద్వారా ఐక్యముగా ప్రార్థించుటకు ప్రజలందరిని కోరుచున్నాడు. విశ్వాసులందరు యేసుక్రీస్తుతో కలసి దేవుని ఘనకార్యములను జ్ఞప్తికి తెచ్చుకొని, బలి సమర్పించుటయే ఈ ప్రార్థనా భావము. యాజకుడు ఈ ప్రార్థనను చెప్పునపుడు విశ్వాసులందరు సవినయముగా, మౌనముగా ఆలకింపవలయును.

79. కృతజ్ఞతా ప్రార్థనలోని ముఖ్యమైన భాగములను క్రింది విధముగ విభజింపవచ్చును.

(1) కృతజ్ఞత చెల్లించుట (ఇది ప్రత్యేకముగ స్తుతిగీతములో వ్యక్తమగుచున్నది: ఇందులో, దైవప్రజలందరి తరపున యాజకుడు తండ్రియైన దేవుని మహిమపరచి, అతడు నెరవేర్చిన రక్షణకార్య మంతటిని స్మరించి, కృతజ్ఞతలు చెల్లించును లేక దైవార్చన కాలములు, ఉత్సవములు లేక ఆ యా దినములకు సంబంధించి రక్షణకార్యములోని ప్రత్యేక అంశమును స్మరించి వందనములర్పించును.

(2) జయగానము: దైవసంఘ మంతయు స్వర్గవాసులతో కలసి మహోన్నతమున హోసాన్నా అను గీతమును పాడును. కృతజ్ఞతా ప్రార్థనలో ఒక భాగముగా నున్న ఈ జయగానమును యాజకునితోపాటు ప్రజలందరు కలసి పాడుదురు లేక చెప్పుదురు.

(3) పవిత్రాత్మ : దైవప్రజలు అర్పించిన కానుకలు పవిత్రీకరింపబడ వలయును. అనగా, క్రీస్తు శరీరరక్తములుగా రూపొందవలయును దివ్య సత్ప్రసాద

విందులో పాల్గొను వారందరి రక్షణమునకు ఈ కానుకలు ఉపకరింపవలయును, అని శ్రీసభ పవిత్రాత్మ శక్తి కొరకు ప్రార్థించును.

(4) ప్రతిష్టాపనము, పవిత్రీకరణము: క్రీస్తుని కడపటి భోజనసమయములో అప్పరస రూపములలో తన శరీరరక్తములను అర్పించి, వానిని భోజనముగను, పానముగను అపోస్తలులకు దయచేసెను. ఈ పరమరహస్యమును కొనసాగింపుడని వారికి ఆజ్ఞ ఇచ్చెను. ఈ విధముగ, కడపటి భోజన సమయమున క్రీస్తు స్థాపించిన బలి, ఇక్కడ క్రీస్తుని వాక్కులతోను, చేతలతోను నెరవేరుచున్నది.

(5) స్మృతి ప్రార్ధన: క్రీస్తు ప్రభుని ఆజ్ఞను అపోస్తలుల ద్వారా స్వీకరించిన శ్రీసభ దానిని నెరవేర్చి, క్రీస్తును, ముఖ్యముగా అతని పవిత్ర శ్రమలను, ఉత్థానమును, మోక్షారోహణమును స్మరించుచున్నది.

(6) అర్పణము: పైన చెప్పినట్లు సంస్మరణను కొనియాడు శ్రీసభ, అనగా ఇక్కడ, ఇప్పుడు సమావేశమైన శ్రీసభ, పవిత్రాత్మద్వారా పరలోకపితకు నిష్కళంక బలివస్తువును అర్పించుచున్నది. ఈ సమయమున విశ్వాసులు నిష్కళంక బలివస్తువును అర్పించుటతో సరిపెట్టుకొనక, తమ్ము తాము అర్పించుకొనుటను అభ్యసింపవలయు నని, తుదకు దేవుడే అందరికి సమస్తముగా నుండుటకు క్రీస్తుని మధ్యవర్తిగ గైకొని, దేవునితో సక్యతను దినదినము పెంపొందించుకొని పరిపూర్ణతను సాధించుకొనవలెనని శ్రీసభ అభిలషించుచున్నది."

(7) విన్నపములు: ఇహపరముల శ్రీసభ అంతయూ కలసి దివ్యసత్ప్రసాద బలిని సమర్పించుచున్నదనియు, క్రీస్తు శరీరరక్తములద్వారా లభించిన రక్షణములో పాలుపంచుకొనుటకు ఆహ్వానింపబడిన శ్రీసభ కొరకును, దాని సభ్యులైన జీవితులు, మృతులందరి కొరకు


బ్రదర్ బట్టు అజయ్


బ్రదర్ ఆరుగుల్ల రాజేంద్ర


బ్రదర్ బొమ్ము ఫ్రాన్సిస్

# 6. సత్ప్రసాద క్రమము

– బ్రదర్ బాసాని ధీరజ్, బ్రదర్ చాట్రగడ్డ కాళ్యణ్
– బ్రదర్ కొలకాని జయ ప్రకాశ్

## సత్ప్రసాద క్రమమునకు సంబంధించిన దివ్యపూజ గ్రంథ సాధారణ నియమావళులు (GIRM)

152. కృతజ్ఞతాప్రార్థన ముగిసిన పిదప, యాజకుడు చేతులు జోడించి, పరలోక ప్రార్థనకు విశ్వాసుల నాహ్వానించును. చేతులు చాచి ప్రజలతోపాటు పరలోక ప్రార్థనను చెప్పును.

153. పరలోక ప్రార్థన ముగిసిన తరువాత, యాజకుడు మాత్రమే, చేతులు చాచి, వప్రభువా, అన్ని కీడులనుండి మమ్ము... అను ప్రార్థనను చెప్పును. కడన ప్రజలు ప్రత్యుత్తరముగా, ఏలయన నిరంతరము నీదే రాజ్యము, నీదే..." అని చెప్పుదురు.

154. తరువాత, యాజకుడు చేతులు చాచి, బిగ్గరగా, శాంతిని మీకు ఇచ్చుచున్నాను..." అను ప్రార్థనను చెప్పును. ఈ ప్రార్థన తరువాత, యాజకుడు చేతులు చాచి మరల జోడించుచు, ప్రజలకు అభిముఖముగ తిరిగి, క్రీస్తు ప్రభుని శాంతి, సమాధానములు... అను మాటలతో ప్రజలకు సమాధానమును తెలుపును. ప్రజలు నీ ఆత్మతోను ఉండునుగాక అని బదులు పలుకును. అటు పిమ్మట, యాజకుడు, ఒకరికొకరము సమాధానమును తెలుపుకొందము,వ అని చెప్పును. పూజకు భంగము కలుగకుండునట్లు యాజకుడు పీఠము దగ్గరనే యుండి పరిచారకులకు సమాధానమును తెలుపును. ప్రత్యేక కారణముచేత మరికొంతమంది ప్రజలకు కూడ సమాధానము తెలుప దలచినచో, పీఠము దగ్గరనే యుండి తెలుపవచ్చును. పీఠాధిపతుల సమాఖ్యలు నిర్ణయించిన సంజ్ఞనే,

అనగా శాంతి, ఐక్యము, ప్రేమను సూచించు సంజ్ఞనే అందరు సమాధానమును తెలుపవచ్చును. ఈ సంజ్ఞను ఆచరించునప్పుడు, ప్రభుని శాంతి, సమాధానములు ఎల్లప్పుడు నీతో నుండునుగాక" అని, చెప్పగా మరియొకరు ఆమెన్" అని సమాధానమును తెలుపవచ్చును.

155. అటు పిమ్మట యాజకుడు అప్పమును తీసికొని దానిని పళ్ళెముపై త్రుంచును. ఒక చిన్న ముక్కను పూజా పాత్రములో జారవిడుచుచు, లోలోన ఈ అప్పద్రాక్షరసముల కలయిక... అను ప్రార్ధనను చెప్పును. ఈ సమయములో, సర్వేశ్వరుని గొట్టెపిల్ల..." (చూడుము: సంఖ్య 83) అను ప్రార్ధనను గాయకబృందముతోపాటు ప్రజలు గానింతురు లేక వల్లెవేయుదురు.

156. తరువాత, యాజకుడు చేతులు జోడించి, అంతరంగములో, ప్రభువైన సర్వేశ్వరా, నేను లోకొను..." లేక ప్రభువైన యేసు క్రీస్తువా...." అను ప్రార్ధనను చెప్పును.

157. ప్రార్థన ముగిసిన పిదప, యాజకుడు మోకాలు వంచి ఆరాధించును. పూజలో ప్రతిష్ఠింపబడిన అప్పమును తీసికొని, ఇదిగో, సర్వేశ్వరుని గొఱ్ఱపిల్ల..." అని చెప్పును. పిమ్మట ప్రజలతోపాటు ప్రభువా, నీవు నా యింట ప్రవేశించుటకు... అను ప్రత్యుత్తర వచనములను చెప్పును.

158. తరువాత, పీఠము ఎదుటనే తిరిగి నిలుచుండి, యాజకుడు తనలోతాను నేను లోకొను క్రీస్తు శరీరము..." అని ప్రార్థించుచు, భక్తితో క్రీస్తు శరీరమును లోకొనును. అదే విధముగా, పూజా పాత్రము అందుకొని, తనలో తాను నేను లోకొను క్రీస్తు రక్తము..." అని ప్రార్థించుచు, భక్తితో క్రీస్తు రక్తము పానము చేయున.

**ఉపోద్ఘాతం**

కనుక, ఈ రొట్టెను భుజీంచునపుడేల్ల, ఈ పాత్ర నుండి పానము చేయునపుడేల్ల ప్రభువు వచ్చువరకు మీరు ఆయన మరణమును ప్రకటింతురు" (1 కొరింతీ 11:26). కావున దివ్య సత్ప్రసాదము క్రీస్తు ప్రభువు మరణం మరియు పునరుత్థానలను స్మరించుకోవడంలో ప్రత్యేక పాత్రను పోషిస్తుంది.

దివ్య సత్ప్రసాదము దివ్య పూజ సారాంశముగా ఉంటుంది. అంటే మనిషికి హృదయం ఎంత ముఖ్యమో దివ్యపూజ లో దివ్యసత్ప్రసాదం అంత ముఖ్యం. క్రీస్తు బలి మనకు మన సహచరుల మధ్య ఐక్యతను నెలకొల్పింది, అదే విధంగా దివ్యపూజ ఫలలను, వరాలు దివ్య సత్ప్రసాదం ద్వారా మనకు ఇవ్వబడతాయి. అటువంటి గొప్ప సత్ప్రసాదాన్ని స్వికరించే క్రమము మానవున్ని శారీరకంగా మరియు అంతరంగంగ సిద్ధాపడేలా చేస్తుంది.

## సత్ప్రసాద క్రమములో ముఖ్య భాగాలు

### 1. ప్రభువు ప్రార్ధనకు పరిచయం

కృతజ్ఞత ప్రార్ధన ముగిసిన తర్వాత, గురువు చేతులు జోడించి, ప్రభువు ప్రార్ధనకు పరిచయాన్ని ఒంటరిగా చెబుతాడు, ఆపై చేతులు చాచి ప్రజలతో కలిసి ప్రార్ధనను ప్రారంభిస్తాడు. (GIRM 152).

### 2. ప్రభువు ప్రార్ధన

ప్రభువు ప్రార్ధన (మత్తయి 6:9-13) అన్ని క్రైస్తవ ప్రార్ధనాలలో ఉపయోగించబడుతుంది. లాటిన్ క్రమములో, గ్రెగొరీ ది గ్రేట్ (క్రీ.శ.604) ప్రభువు ప్రార్ధనను మొదటి సారి దివ్య పూజబలిలో ప్రార్థించారు. 1964వ సంవత్సరంలో 6వ పౌల్ పాపు గారు ప్రభువు ప్రార్ధనను దివ్యపూజబలిలో ప్రార్ధించే అవకాశం కల్పించారు. ప్రభుని ప్రార్ధన ప్రార్ధలాన్నిటిలో ప్రార్ధనలన్నిటిలో సంపూర్ణ ప్రార్ధనగ భావించాలి.

దీన్ని ప్రభువు ప్రార్ధన అంటారు ఎందుకంటే మన గురువు, యేసు ప్రభువు స్వతహాగా నేర్పించారు కనుక. ప్రభువు ప్రార్ధనలో ఏడు విన్నపాలు ఉన్నాయి 1) దేవుని నామము పవిత్రం కావాలని 2) దేవుని రాజ్యం రావాలని 3) దేవుని చిత్తం పరలోకం వలనే భూలోకంలో జరగాలని 4) అనుదిన ఆహారం దయచేయమని 5) దోషాలను క్షమించమని 6) శోధనలో ప్రవేశించకుండా ఉండాలని మరియు చివరిగా 7) కీడులనుండి రక్షించమని. ప్రభువు ప్రార్ధన మనలను పాపం నుండి శుద్ధి చేయమని వేడుకుంటుంది, తద్వారా పవిత్రమైనది పవిత్రమైనదిగా ఇవ్వబడుతుంది (GIRM.81). ప్రభువు ప్రార్ధన అనేది విశ్వాసులందరి ప్రార్ధన కాబట్టి ఇది గురువు లేదా అధ్యక్ష ప్రార్ధన కాదు. దీనిని

అందరూ పఠించాలి లేదా అందరూ పాడాలి. ఇది ప్రభువు ప్రార్థన కాబట్టి, యేసు మనకు బోధించిన విధంగా మార్పులేకుండా ప్రార్థించాలి. మనమందరము ఒకే కుటుంబం అనే భావన ఈ పరలోక ప్రార్థన తీసుకోనివస్తుంది. ముందుగా దేవున్ని ఆరాధించి, అందుకని ఈ ప్రార్థనను ఒకే కుటుంబంలాగా అందరూ అందరి కోసం ప్రార్థన చేస్తారు.

## 3. పాప విమోచక ప్రార్థన (embolism)

ఈ ప్రార్థనలో ప్రతి కిడు నుండి మరియు చెడు మనం విముక్తిని కోసం వేడుకుంటాం. అలాగే పాపం నుండి స్వేచ్ఛ ,మరియు అన్ని బాధల నుండి సురక్షితం కోసం ఈ ప్రార్థనలో వేడుకోవటం ప్రత్యేకం. ఈ ప్రార్థన శాంతి ఆలోచనను ప్రతిబింబిస్తుంది (మా రోజుల్లో మాకు శాంతిని ప్రసాదించు") అనే ఈ ప్రార్థనలో చాలా ప్రాముఖ్యత ఉంది. శాంతి అనగా యుద్ధం లేకపోవడం, కలహాల నుండి విముక్తి లేదా నిశ్శబ్దం మరియు సామరస్యం మాత్రమే కాదు ఇది సంపూర్ణతను సూచిస్తుంది. శాంతి యొక్క నిర్వచనాన్ని ఈ ప్రార్థన సూచిస్తుంది. ఈ ప్రార్థనలో చెడు నుండి స్వేచ్ఛ, మరియు బాధ నుండి విముక్తి కోసం ప్రార్థించడం ద్వారా, విశ్వాసులు శాంతి కోసం ప్రార్థిస్తారు. ఈ విభిన్న వ్యక్తీకరణలన్నీ ఒకటే అర్థం. శాంతి అనేది జీవన నాణ్యత మరియు భావోద్వేగ స్థితి కాదు. ఈ ప్రార్థనలో శోధనలనుండి, కీడులనుండి విముక్తి దయచేయమని వేడుకుంటాం. చివరిగా ఈ ప్రార్థనలో యేసు ప్రభువు యొక్క రెండవ రాక కోసం ఆశిస్తూ ముగించబడుతుంది. ఈ ప్రార్థన పరలోక ప్రార్థన తరువాత చెపుతారు. మనలను సకల సాతాను శక్తుల నుండి విముక్తులను చేసి మన అనుదిన జీవితంలో శాంతి సమాధానాలు దయచేయమని ప్రార్థిస్తూ క్రీస్తు రెండవ రాకడకు ఆనందంతో ఎదురు చూస్తునామంటూ గురువు ప్రార్థన చేస్తాడు.

## 4. Final doxology (దైవ స్తుతి)

"ఎలయన నిరంతరము నీదే రాజ్యము, నీదే మహిమ "డాక్సాలజీ" అనే పదం గ్రీకు డోక్సోలోజియా నుండి వచ్చింది, దీని అర్థం దేవుని మహిమపరచడం లేదా దేవుని స్తుతించడం". కీర్తన 41:14 ఇలా చెబుతోంది: "ఇశ్రాయేలు

దేవుడైన ప్రభువు నిత్యము మరియు ఎప్పటికీ స్తుతింపబడును గాక. ఆమెన్. పునీత పౌలు వివిధ సంఘాలకు తన రచనలలో విటిని చాలాసార్లు ఉపయోగించాడు. దేవునికి, యేసు క్రీస్తు ద్వారా ఎప్పటికీ మహిమ కలుగుగాక" (రోమీ 16:27). ఈ యొక్క దైవ స్తుతిలో మూడు విన్నపాలు ఇమిడి ఉన్నాయి దేవున్ని మహిమపరచడం, అతని పాలన రావడం మరియు దేవుని రాజ్యం రావడన్ని ఈ ప్రార్ధన గుర్తిస్తుంది (CCC.2855).

**5. ఒకరికి ఒకరు శాంతి సమాధానములు తెలుపుకొనుట**

తండ్రి ప్రసాదించిన ఆహారములను (క్రీస్తు రక్తశరీరములను) భుజింపబోయే ముందు మనమధ్య ఉన్నటువంటి మనస్పర్ధలు, గొడవలు, తగాదాలు తొలిగిపోవాలని, దేవునితో మరియు మన సహోదరులతో సఖ్యత కలిగి జీవించి ఉండాలని ఈ అర్చనక్రమము మనకు బోధిస్తుంది. అందుకనే ముందుగా గురువులకు సమాధానం చెప్పి మనం ఇరువైపుల తిరిగి ప్రక్కన ఉన్నవారితో సమాధానం అని చెబుతాం. మనకు ఎవరితోనైన మనస్పర్ధలు ఉన్నయెడల వారిదగ్గరికి వెళ్ళి మనం వారితో సమాధానపడవచ్చు. ఇలా చేయుటం ద్వారా మనమందరము ఒకే దేవుని బిడ్డలమని మనకు అర్ధమవుతుంది.నేటి పూజ క్రమములో శాంతి సమాధానం తెలుపుకోవటం మూడు భాగాలుగా విభజించబడింది. A) శాంతి కొరకు గురువు ప్రార్ధించడం B) సంఘంతో సక్యత కొరకు గురువు ఆశించడం C) ఇతరులతో శాంతి సమాధానములు పంచుకోవటం.శాంతి కొరకు గురువు ప్రార్ధించడం. ప్రభు కడరా భోజన విందులో శిష్యులతో కలిసి ఉన్నప్పుడు శాంతి కొరకు ఐక్యత కొరకు ప్రార్ధించాడు. శాంతిని మీకు అనుగ్రహించుచున్నాను, నా శాంతిని మీకు ఇచ్చుచున్నాను." (యోహాను 14:27) కావున దివ్యబలిపూజ ఐక్యతకు, శాంతికి చిహ్నంగా ఉంటుంది. శాంతి అనే పదం సత్రసాద క్రమములో ఏడు సార్లు ఉండడం అనేది విశేషం.

**6. అప్పమును విరుచుట (Fraction)**

కొత్త నిబంధన కాలంలో, దివ్యపూజబలిని రొట్టెను విరిచే సంజ్ఞగా పరిగనింపబడేది. "రొట్టె విరుచుట" (అపొస్తలుల కార్యములు 20:7; 1 కొరింతీ

10:6) అని పిలుస్తారు, ఇది "లోక రక్షణ కోసం మరణించి తిరిగి లేచిన క్రీస్తు అనే ఒకే జీవపు రొట్టె తో ఐక్యతకు సూచనగ నిలిస్తుంది. (1 కొరింతీ 10:17)" (GIRM 83). క్రీస్తు చర్య బహుశా పస్కా ఆచారం యొక్క ఒక అంశానికి సంబంధించినది. దివ్యబలిపూజలో గురువు విరిచే అప్పము, క్రీస్తు శరీరంలో పాల్గొనడాన్ని సూచిస్తుంది (1 కొరింతీ 10:16), అతను మన వధించబడిన పాస్కా గొర్రెపిల్ల (1 కొరింతీ 5.7).

అప్పమును త్రుంచడం దివ్యబలిపూజలో చాలా శక్తివంతమైన క్షణం. క్రీస్తు ప్రభువు మనతో ఒకటి కావడానికి విరిగిపోయాడు అనే సత్యాన్ని గురువు అప్పమును త్రుంచడం ధ్వారా మనకు అర్ధమవుతుంది . అనేకులమైన మనం క్రీస్తు ప్రభువుని విశ్వసించే మనం ఒకే శరీరం, ఎందుకంటే మనమందరం ఒకే రొట్టెలో పాలుపంచుకుంటాము (1 కొరింతీ 11:16-17). గురువు పల్లెం లోని అప్పమును రెండుగా త్రుంచుతాడు. (GIRM.155) గురువులు మరియు ఉపగురువులు మాత్రమే అప్పమును విరుస్తారు (RS.73).

## 7. అప్పమును ద్రాక్షరసములో కలుపుట (Commingling)

అప్పమును విరిచిన తరువాత ఒక చిన్న ముక్కను ద్రాక్షరసపాత్రలో గురువు వేస్తారు. ఇది క్రీస్తు శరీర రక్తముల ఐక్యతకు గుర్తుగా, సజీవంగా పునరుత్థానమైన యేసుక్రీస్తుని శరీరానికి గుర్తుగా ఉంటుంది. ఈ క్రమము జరిగేటప్పుడు ప్రజలు సర్వేశ్వరుని గొఱ్ఱెపిల్ల లోకపాపములు... అనే ప్రార్థనను గురువు జపిస్తారు. ఈ ఆచారం ఒకప్పుడు పులియని రొట్టెను పూజలో ఉపయోగించే సమయంలో ఉద్భవించింది. రోమ్ నగరంలో పెద్ద సంఖ్యలో క్రైస్తవులు ఉన్నందున, పాపుగారు ఒక నిర్దిష్ట ఆదివారం నాడు పూజను జరుపుకున్నప్పుడు వారందరూ పాల్గొనలేకపోయారు. అందువల్ల పాపు గారు తాను పవిత్రం చేసిన అప్పమును ఇతర దేవాలయాలకు అనుచరులను పంపేవారు. రోమ్ నగరంలోని ఇతర గురువులు ఈ అప్పము యొక్క భాగాన్ని పూజ సమయంలో ద్రాక్షా రస పాత్రలో ఉంచేవారు ఇది ఐక్యతకు మరియు సహవాసానికి చిహ్నంగా జరుపుకునేవారు. ఈ పవిత్ర ప్రార్థనా పద్ధతిలో, పవిత్ర రొట్టెలో కొంత భాగాన్ని ఒక ఆదివారం నుండి మరో ఆదివారం వరకు భద్రపరిచేవారు, ఇది పూజాదికాల ఐక్యతను సూచిస్తుంది. గురువు పవిత్ర

రొట్టెలోని ఒక భాగాన్ని తీసుకొని విరిచే సమయంలో బలిపీఠంపై ఉంచే ఆచారాన్ని పవిత్ర ప్రార్థన అని పిలుస్తారు. ఈ ప్రక్రియ రక్షణ పనిలో ప్రభువు శరీరం మరియు రక్తం యొక్క ఐక్యతను సూచిస్తుంది, అనగా యేసుక్రీస్తు శరీరం, సజీవుడు మరియు మహిమాన్వితుడు (GIRM.83). రొట్టె మరియు ద్రాక్షారసం యొక్క ప్రత్యేక పవిత్రతలు క్రీస్తు మరణాన్ని సూచించే రక్తం నుండి శరీరాన్ని వేరు చేయడాన్ని సూచిస్తున్నట్లే, వేరు చేయబడిన వాటి కలయిక మరియు తిరిగి కలపడం పునరుత్థానం చేయబడిన మరియు స్వర్గపు గొర్రెపిల్ల యొక్క ఐక్యతను సూచిస్తుంది. మరణం మరియు పునరుత్థానం యొక్క ఔనత్యాన్ని అర్థం చేసుకునేలా చేస్తుంది మరియు దానిని అనుభవించేలా చేస్తుంది.

## 8. సర్వేశ్వరుని గొర్రెపిల్ల ప్రార్థన

పాప క్షమాపణ కోసం ప్రాణత్యాగం చేసిన గొర్రెపిల్లగా క్రీస్తు ప్రభు మారాడు. పాత నిబంధనలోని పాస్క గొర్రెపిల్లతో యేసును అనుసంధానించడం ఈ ప్రార్థన లోని ముఖ్య ఉద్దేశం. (నిర్గమ 10:11). ప్రతి పాస్క విందు అనేది పాత నిబంధనలోని గొప్ప రక్షణ సంఘటన, దీని ద్వారా ఇశ్రాయేలీయులు బానిసత్వం నుండి విముక్తి పొందారు, వాగ్దాన దేశానికి నడిపించబడ్డారు మరియు దేవుని ప్రజలుగా ఏర్పడ్డారు.సువార్తలలోని దేవుని గొర్రెపిల్ల యొక్క ప్రతిరూపం స్పష్టంగా కనిపిస్తుంది. పాస్కా సిద్ధపాటు రోజున మధ్యాహ్నం (యోహాను 18:28, 19:14) పిలాతు యేసుకు మరణశిక్ష విధించాడు, ఆ సమయంలో గురువులు ఆలయంలో పాస్కా గొర్రెపిల్లలను వధించడం ప్రారంభించారు. సిలువ వేయబడిన తర్వాత, సైనికులు లేఖనాల నెరవేర్పుగా యేసు ఎముకలలో దేనినీ విరగొట్టలేదు (యోహాను 19:36). ఈ సూచన నిర్గమకాండము 12:46 మరియు సంఖ్యాకాండము 9:12 లకు అనుగుణంగా ఉంటుంది, ఇక్కడ పాస్కా గొర్రెపిల్ల ఎముకలు ఏవీ విరగొట్టకూడదు. బాప్తిస్మమిచ్చు యోహాను తన బహిరంగ జీవిత ప్రారంభంలో యేసును లోక పాపాలను తీసివేసే దేవుని గొర్రెపిల్ల (యోహాను 1:29) అని పిలిచాడు. చంపబడిన గొర్రెపిల్ల, అయినప్పటికీ విజయం సాధించినది, పునరుత్థానమైన క్రీస్తు యొక్క ప్రతిరూపం.

దివ్యపూజలో గొర్రెపిల్ల ప్రతిమను చేర్చారు, దీనిని స్వర్గపు ప్రార్థనలో పూజిస్తారు మరియు మూడు సందర్భాలలో గొర్రెపిల్ల అనే నిర్వచనం దివ్యబలి పూజలో వివరించబడింది: (ఎ) గ్లోరియాలో (ప్రభువైన దేవుడు, దేవుని గొర్రెపిల్ల, తండ్రి కుమారుడు, మీరు లోక పాపాలను తొలగిస్తారు, మాపై దయ చూపండి) (బి) సత్ప్రసాద క్రమములో అప్పము విరిచేటప్పుడు చేసే ప్రార్ధన (సర్వేశ్వరుని గొర్రెపిల్ల, లోక పాపాలను తొలగిస్తారు, మాపై దయ చూపండి) (సి) ఇదిగో సర్వేశ్వరుని గొర్రెపిల్ల, ఇదిగో లోక పాపములను పరిహరించు ప్రభువు గోర్రెపిల్ల విందుకు పిలవబడినవారు ధన్యులు అనే ఈ మూడు సందర్భాలలో గొర్రె పిల్ల అనే నిర్వచనం వాడడం విశేషం.

## 9. గురువు సిద్ధపాటు ప్రార్థన

క్రీస్తు శరీరాన్ని మరియు రక్తాన్ని ఫలవంతంగా స్వీకరించడానికి గురువు నిశ్శబ్దంగా పలికే ప్రార్థన ద్వారా తనను తాను సిద్ధం చేసుకుంటాడు. విశ్వాసులు కూడా అదే సమయంలో, నిశ్శబ్దంగా ప్రార్థిస్తారు" (GIRM.84). ఈ ప్రార్థన కేవలం గురువు మాత్రమే తక్కువ స్వరంతో చేతులు జోడించి నిశ్శబ్దంగా పఠిస్తాడు. గురువు నిండు మనసుతో యేసు ప్రభు శరీర రక్తాలను స్వీకరించాలని ఉదేశ్యంతో శ్రీసభ ఈ ప్రార్ధనను ప్రవేశపెట్టింది.

## 10. దివ్య సత్ప్రసాదమునకు ఆహ్వాన ప్రార్ధన

గురువు : ఇదిగో దేవుని గొర్రెపిల్ల, ఇదిగో పాపాలను పరిహరించు ప్రభువు గోరెపిల్ల విందుకు పిలువబడినవారు ధన్యులు. అనే ఈ ప్రార్ధన లోని మొదటి వాక్యం బాప్తిస్మ యోహాను ఇచ్చిన సాక్ష్యం ఆధారంగా తీసుకొనబడింది యేసు తన శిష్యులలో కొంతమందికి (యోహాను 1:29, 36) పలికిన సందర్భంలోనివి అయితే ఆహ్వానంలోని మిగిలిన పదాలు దర్శన గ్రంథ (19:9) పుస్తకం నుండి వచ్చాయి.

గొర్రెపిల్ల భోజనానికి పిలువబడినవారు ధన్యులు అనేది మన దివ్యపూజ యొక్క కోణాన్ని మరియు పరలోకంలో ప్రార్థనా విధానాన్ని మనకు గుర్తు చేస్తుంది. గురువు మాటలకు ద్వంద్వ ప్రాముఖ్యత ఉంది: (ఎ) సమాజానికి పిలుపు, మరియు (బి) రాజ్యంలో గొర్రెపిల్ల విందుకు మన ఆహ్వానాన్ని గుర్తు

చేస్తుంది. ఈ ప్రార్ధన లో రెండు ముఖ్యమైన మార్పులు ఉన్నాయి. మొదటిది ఇది దేవుని గొర్రెపిల్ల అనేది ఇదిగో దేవుని గొర్రెపిల్లవతో మార్పు చేయబడింది.

**11. ప్రతిస్పందన: "ప్రభూ, నేను యోగ్యుడిని కాదు"**

గురువు మరియు ప్రజలు కలిసి ఇలా ప్రతిస్పందిస్తారు: ప్రభూ, మీరు నా ఇంటిలోకి ప్రవేశించడానికి నేను అర్హుడిని కాదు, కానీ మీరు ఒక్క మాట పలికిన, నా ఆత్మ స్వస్థత పొందుతుంది." వాస్తవానికి, ఇది నిజంగా గురువు మరియు ప్రజలకు మధ్య సంభాషణ కాదు. ప్రభువు ఉనికిని ధృవీకరించడానికి మరియు వారి అనర్హతను ప్రకటించడానికి ప్రజలు ఈ ప్రార్ధన చెపుతారు. విశ్వాసులు మరియు గురువు కలిసి పలికే అరుదైన సందర్భాలలో ఇది ఒకటి.

ప్రభూ, నేను యోగ్యుడను కాను..." అనే ప్రతిస్పందన తన సేవకుడిని స్వస్థపరచమని యేసును అడిగిన శతాధిపతి మాటలను ప్రతిధ్వనిస్తుంది (లూకా 7:6-7, మత్తయి 8:5-13). ఈ సమయంలో, మనం శతాధిపతిలాగే లోతైన విశ్వాస స్థాయికి పిలువబడ్డాము. దివ్య పూజ గ్రంధము అనేక బైబిల్ సూచనలను కలిగి ఉంది మరియు అనేక సందర్భాల్లో, ఇది లేఖనాల నుండి వచనాలను ఉపయోగిస్తుంది. ప్రతిస్పందనలో ఉపయోగించిన పదాలు పూర్తిగా, ఒకే ఒక్క మినహాయింపుతో, సువార్తల నుండి వచ్చాయి.నా సేవకుడు అనే మాటలు నా ఆత్మ గా మార్పు చేయబడింది. క్రైస్తవులు అందరూ కుడా శతధిపతి విశ్వాసం, వినయం కలిగి ఉండటానికి పిలువబడ్డం నిజానికి, మనం నివసించే ప్రదేశంలోకి ఆయన ప్రవేశించడానికి మనం అర్హులం కాదని యేసుకు చెబుతున్నాము. మనం పాపంలో జీవిస్తున్నాము. ఇది మన శరీరంలోని ఒక నిర్దిష్ట భాగం గురించి కాదు. మనం శతాధిపతి వినయాన్ని అనుకరిస్తున్నాము.

ప్రస్తుత దివ్య పూజ గ్రంధం మునుపటి నేను స్వస్థత పొందుతాను అనే పదానికి బదులుగా నా ఆత్మ స్వస్థత పొందుతుంది అనే వ్యక్తీకరణను ఉపయోగిస్తుంది. కొత్త అనువాదం మునుపటి దానికంటే మరింత ఖచ్చితమైనది. దేవుని శ్వాస ద్వారా ఇవ్వబడిన మన భాగాన్ని, "నా ఆత్మ ఆయన మనల్ని జీవింపజేస్తుంది" అని సూచించడం ద్వారా మనం మనందరినీ సూచిస్తాము.

చాలా మంది అది ఏదో ఒక విధంగా శరీరంలో ఉందని అనుకుంటారు. నిజానికి, అది మరొక మార్గం. ఆత్మ శరీరానికి రూపాన్ని ఇస్తుంది.

## ముగింపు

దివ్యసత్ప్రసాదమును స్వీకరించడం ద్వారా మనము పరలోకవిందును ముందుగానే భుజించినవారమౌతాము. ఎందుకంటే అది పరలోక తండ్రియొక్క కుమారుని శరీర రక్తములు. మనమందరము దివ్యబలిపూజలో సత్ప్రసాదము లోకొనుట, తీసుకోవటం ద్వారా మనమందరము క్రీస్తుతో ఐక్యంగా ఉన్నామని తెలియజేస్తుంది.

దివ్యసత్ప్రసాదము తీసుకునేటప్పుడు గాయక బృందంవారు క్రైస్తవ ఐక్యతను చాటే గీతములను, క్రీస్తుశరీర రక్తములకు సంబంధించిన పాటలను పాడవచ్చు కాని అందరికి తెలిసిన పాటలైతే బాగుంటుంది. ఎందుకంటే అందరు ఏకస్వరముతో దేవున్ని స్తుతించవచ్చు.

క్రీస్తు శరీరరక్తములను స్వీకరించటం ద్వారా అవి మన పరలోక ప్రయాణానికి పోషణగా ఉంటూ, పరలోకవిందును ముందుగానే రుచిచూసేటట్లు చేస్తుంది. అప్పద్రాక్షరూపములలో మన హృదయంలోకి వేంచేసిన ఆ క్రీస్తుప్రభుని మనమందరము ఆరాధించి, స్తుతించాలి. తరువాత సత్ప్రసాద స్వీకరణానంతర ప్రార్థనతో ఈ సత్ప్రసాదక్రమము ముగుస్తుంది.



బ్రదర్ బాసాని ధీరజ్



బ్రదర్ చాట్రగడ్డ కాళ్యణ్



బ్రదర్ కాలకాని జయ ప్రకాష్

# 7. దివ్య సత్ప్రసాదము స్వీకరించు క్రమము

– బ్రదర్ బలసాని ప్రభుదాస్, బ్రదర్ పసల కళ్యాణ్ కుమార్,
– బ్రదర్ ఆవుల రవి కిషోర్

**ఉపోద్ఘాతం**

## 1. ప్రధాన యాజకుడు మొదటగా ప్రభువు శరీరమును గైకొనవలెను

ప్రధాన యాజకుడు అనగా పూజను సమర్పించిన గురువు మొదటగా క్రీస్తు శరీర రక్తాలుగా మారినా అప్పము, ద్రాక్షారసమును సేవించెదరు. గురువు పెద్ద అప్పమును త్రుంచిన పిదప ద్రాక్షారసములో ముంచి దివ్య ఆహారమును సేవించెదరు. ఇలా అప్పమును ద్రాక్షారసములో ముంచడం లేదా అద్దడాన్ని ఆంగ్లంలో "Intinction" అని అంటారు. ఈ చర్య ద్వారా క్రీస్తు ప్రభువు పరిపూర్ణంగా అప్ప ద్రాక్ష రస రూపంలో ఐక్యమై ఉన్నారని మనకు స్పష్టం చేస్తూ ఉంది. పూజను సమర్పించిన గురువు ఈ అప్పమును భుజించుటకు ముందుగా తక్కువ స్వరముతో "ప్రభువుని శరీర రక్తములు నాకు నిత్యజీవమునుకు చేర్చును గాక" అని చెప్పి అప్పద్రాక్ష రసములను సేవిస్తారు. కొన్ని ప్రత్యేక సందర్భాలలో చిన్న స్ట్రా వంటి పైపు ద్వారా లేదా స్పూన్ ద్వారా కూడా ఈ పవిత్ర భోజనమును గురువులు స్వీకరించుటకు శ్రీసభ అనుమతిని ఇస్తుంది (GIRM.283).

మొదటగా క్రీస్తు శరీర రక్తములను గురువులే తీసుకోవాలా? అని ప్రశ్నిస్తే దానికి సమాధానము అవును అని మనము తెలుసుకోవాలి. ఎందుకంటే అప్ప ద్రాక్ష రసములను బలి అర్పణము గావించి, క్రీస్తు శరీర రక్తాలుగా మార్చిన యాజకుడు మాత్రమే మొదటగా క్రీస్తు శరీర రక్తములను స్వీకరించుటకు అన్ని విధముల యోగ్యమైన వ్యక్తి (RM.97). ఇలా మొదటగా ప్రజలకు కాకుండా గురువులు ప్రభు భోజనమును సేవించుట ఎంత మాత్రమూ అధికారపు చర్యగా భావించకూడదు ఎందుకంటే గురువు అనేవాడు క్రీస్తు

ప్రభువును ప్రజలకు అప్ప ద్రాక్షా రస రూపంలో అందజేసే సేవకుడు మాత్రమే. (మార్కు 9:35)

## 1.1 పెద్దఅప్పమును గురువులు మాత్రమే ఎందుకు సేవిస్తారు?

ప్రభుని శరీరము పెద్ద అప్పములో, చిన్న అప్పములు రెండింటిలోనూ పరిపూర్తిగా మిళితమై ఉంటుంది. మరి ఎందుకు పెద్ద అప్పమును గురువులకు, చిన్న అప్పమును ప్రజలకు ఇస్తారు? దీనికి సమాధనం శ్రీసభ చరిత్ర పుటలలో మనకు లభ్యమవుతుంది. పూర్వము ఆదిమ క్రైస్తవులు రొట్టె విరుచుటలో పాల్గొనినప్పుడు ఒకే పెద్ద రొట్టెను, ముక్కలుగా చేసి క్రీస్తు దేహముగా స్వీకరించేవారు. ఆ తదుపరి 11, 12వ శతాబ్దాలకు వచ్చేసరికి దివ్యబలి పూజలో పాల్గొంటున్న భక్తుల సంఖ్య పెరిగే కొద్దీ పెద్ద అప్పము పూజను సమర్పించే యాజకునికి మరియు చిన్న అప్పములను ప్రజల కొరకు వినియోగించడం ఆనవాయితీగా జరుగుతూ వచ్చింది. ట్రెంట్ మహాసభలో (1545- 1563) ఈ ఆనవాయితిని అధికారంగా జారీ చేసింది. ఇలా పెద్ద అప్పమును గురువునకు చిన్న అప్పమును ప్రజల కొరకు వినియోగించడంలో ఆధ్యాత్మికపరమైన అర్థం కూడా దాగి ఉంది అని మనము గ్రహించాలి. దివ్యబలి పూజలోని పెద్ద అప్పము క్రీస్తు ప్రభువు శ్రీసభకు ఒక శిరస్సుగా ఉన్నాడని సూచిస్తుంది. (కోలస్సీ 1:18) బలి పూజను అర్పించే గురువు క్రీస్తు స్థానంలో ఉన్నాడు. వాస్తవానికి దివ్యబలి పూజలో ప్రభువే తనకు తాను తండ్రి దేవునకు అర్పించుకుంటున్నాడు. అందుకని ఈ లోతైన భావానికి గురుతుగా, గురువులు పెద్ద అప్పమును పైకెత్తి చూపిస్తారు. దీని ద్వారా క్రీస్తు ప్రభువు మన అందరి కొరకు తాను బల్యార్పణం గావించుకున్నాడని సూచిస్తుంది. అందుకనే గురువు పెద్ద అప్పమును గైకొనెదురు ఇదే ఈ చర్య యొక్క ప్రధాన ఉద్దేశం. ఇంకా ఇలా చేయడం వెనుక కొన్ని ఆచరణాత్మక కారణాలు కూడా ఉన్నాయి. గురువు అప్పమును పైకెత్తినప్పుడు అందరికీ కనిపించుటకు వీలుగా ఉండుటకు గాను ఈ పెద్ద అప్పాన్ని వినియోగించడం జరుగుతుంది. సిలువలో మరణించిన క్రీస్తును అందరూ చూడగలిగే విధంగా ఉండాలని దీని యొక్క భావం. అదే విధంగా పెద్ద అప్పము సకల మానవాళి ఐక్యతను కూడా సూచిస్తుంది.

చిన్న అప్పము ప్రజలకు మాత్రమే ఇవ్వడానికి గల అంతరార్థం. చిన్న అప్పం క్రీస్తు శరీరంలోని సభ్యులను సూచిస్తుంది. ఇది విశ్వాసులు క్రీస్తుతో గల ఏకత్వాన్ని మరియు పరస్పర సంబంధాన్ని సూచిస్తుంది. చిన్న అప్పంను వినియోగించడంలోనూ కొన్ని ఆచరణాత్మక కారణాలు కూడా ఉన్నాయి. చిన్న అప్పుము అయితే ఎంతో మంది విశ్వాసులకు సులభముగా అందించుటకు వీలుగా ఉంటుంది, నిల్వ చేయుటకు వీలుగా ఉంటుంది విరగడం లేదా వ్యర్థమవుటకు చాలా తక్కువ అవకాశం ఉంటుంది.

## 1.2 ప్రధాన యాజకుడు దివ్యబలిపూజలో క్రీస్తు శరీర రక్తములను స్వీకరించని యెడల ఏమవుతుంది?

గురువు దివ్యబలిపూజలో కేవలం అప్ప ద్రాక్షా రసములను క్రీస్తు శరీర రక్తాలుగా మార్చుటతో సరిపోదు. ప్రభుని శరీర రక్తాలను భుజించాలి అప్పుడే బలిపూజ పరిపూర్తి అవుతుంది. లేకపోతే ఆ బలిపూజ దైవార్చన పరంగా చెల్లదు (Can.909) ఎందుకంటే కడరా భోజనముందు ప్రభువే స్వయముగా "ఇది నా శరీరము గైకొనుడు.... ఇది నా రక్తము పానము చేయుడు.... దీనినినా జ్ఞాపకార్థము చేయుడు" (లూకా 22:19- 20) అని చెప్పి ఉన్నారు. ఇంకా లోతుగా చెప్పాలంటే గురువు అర్పించిన ప్రభు శరీరాలను గైకొన్నప్పుడు మాత్రమే పవిత్ర దివ్యబలిపూజ పరిపూర్తి అవుతుంది, ఇందులో గురువే అర్పించువాడు గురువే స్వీకరించువాడు.

## 1.3 బలిపీఠము నుండి దివ్యసత్ప్రసాదమును గైకొనుట

దివ్యబలిపూజను అర్పించు గురువులు మరియు పూజలో పాల్గొనే విశ్వాసులు ఇరువురు కూడా పూజలో అభిషిక్త గురువులు చేత నూతనంగా ప్రభు శరీర రక్తాలుగా మారిన అప్పద్రాక్ష రసములను మాత్రమే స్వీకరించాలి (GIRM.85). మొదటగా పూజను అర్పించిన ప్రధాన గురువులు, తదుపరి ఇతర గురువులు కూడా వరుస క్రమంలో బలిపీఠము నుండి ప్రభుని శరీర రక్తాలను రెండింటినీ స్వీకరించాలి. సహ గురువులు వారు కూర్చున్న స్థానం నుండి కాక ఖచ్చితముగా బలిపీఠము దగ్గరికి వచ్చి దివ్యాహారమును గైకొనాలి. అత్యవసరమైతే తప్ప దివ్య మందసములో ఉన్న ప్రభువు శరీరమును దివ్య బలి

పూజలో స్వీకరించకూడదు. పూజను అర్పించు గురువు మొదటగానే విశ్వాసులు ఎంతమంది పూజలో పాల్గొంటారు అని అంచనా వేసి సరిపడా అప్పములను అర్పించాలి. మిగిలిపోతే దివ్య మందసములో భద్రపరచవచ్చు, తక్కువైతే దివ్య మందసము నుండి తీసుకొని ప్రజలకు ఇవ్వవచ్చునులే అనే ఆలోచన ధోరణి ఎంత మాత్రము ఉండకూడదు.

ఎందుకంటే దివ్య మందసము అనేది ఎప్పుడంటే అప్పుడు తెరిచి ఆహారామును సరఫరా చేసే ఆహార నిలయము కాదు. అందులో సాక్షాత్తు పరమ తండ్రి యొక్క తనయుడు, దివ్యనాధుడైన క్రీస్తు వసించు, పవిత్ర వాస స్థలము, మనకు కృపా నిలయము. దివ్య మందసము స్థాపనకు గల కారణం చారిత్రాత్మకంగా ఎంతో అర్థం కలిగి ఉంది. తొలి క్రైస్తవులు మిగిలిపోయిన ప్రభు శరీరమును వ్యాధిగ్రస్తులకు ఇంట్లోనే ఉండిపోయిన వృద్ధులకు ఇవ్వడానికి ప్రత్యేకమైన ప్రదేశాలలో, ఇంటిలో ఉంచేవారు. మధ్యయుగం నాటికి దేవాలయాల్లో దివ్య మందసమును స్థాపించడం, అందులో పవిత్ర అప్పములను భద్రపరచడం చేయడం జరిగింది. మొదటగా, దివ్య మందసమలో ఉన్న ప్రభు శరీరాన్ని వ్యాధిగ్రస్తులకు మరియు పూజకు రాలేక ఇంటి దగ్గర ఉండిపోయిన వృద్ధులకు మరియు బహిరంగ దివ్య సత్ప్రసాద ఆరాధనకు ఉపయోగకరంగా ఉండేటట్లు మాత్రమే స్థాపించడం జరిగింది. కానీ నేడు విశ్వాసుల ప్రయోజనాలను పరిగణలోనికి తీసుకొని కొన్నిసార్లు ప్రభువు శరీరములను దివ్య బలి పూజలో దివ్య మందసములో భద్రపరచడం, దివ్య మందసం నుండి తీసుకుని ప్రజలకు ఇవ్వడం జరుగుతూ ఉంది (CCC.1379). కానీ వాస్తవానికి గురువులు విశ్వాసులు అందరూ అప్పుడే పూజలో ప్రభువుని శరీర రక్తాలుగా మారిన అప్ప ద్రాక్షారసములను మాత్రమే సేవించాలి.

## 2. ప్రభు శరీర రక్తములను గైకొనుటకు ముందు ఉపవాసం

క్రీస్తునాధుని దివ్య శరీర రక్తములను భక్తి ప్రపత్తులతో లోకొనుటకు విశ్వాసులు తగిన రీతిలో సంసిద్ధత పడాలి. అందులో ముఖ్యమైన ఒక అంశం మన శారీరిక నియంత్రణ అనగా ఉపవాసం చేయడం. ప్రతి విశ్వాసి కూడా దివ్యసత్ప్రసాదమును లోకొనుటకు ముందు ఉపవాసమును ఆచరించాలని

కతోలిక శ్రీసభ బోధిస్తుంది. (CCC.1324). ఇలా ఉపవాస ఆచరణ నియమం, తొలి క్రైస్తవుల నుండి ఉండేది. మధ్యయుగపు కాలం నాటికి అర్ధరాత్రి నుండి ఉపవాసం చేసే విధంగా ఆచరణను తెచ్చిపెట్టారు. ట్రెంట్ మహాసభ (1545 – 1563) ఈ ఉపవాస నియమమును మూడు గంటలు చేసే విధంగా నియమం చేసింది. తదుపరి ద్వితీయ వ్యాటికను మహాసభ (1962–1965) ఈ ఉపవాసమును దివ్య సత్ప్రసాదము లోకొనుటకు ముందు, ఒక గంట చేస్తే చాలు అని కొత్త నియమం తెచ్చింది. ఈ నియమం అనారోగ్యంగా ఉన్నవారికి వర్తించదు. ఎందుకంటే ప్రభువు కోరుకునేది కేవలం శారీరక త్యాగం మాత్రమే కాదు, ఆధ్యాత్మిక సంసిద్ధత కూడా అని శ్రీసభ దృఢంగా విశ్వసిస్తూ ఉంది. అందుకే పునీత పౌలు గారు ఈ విషయమును గూర్చి తన లేఖలో హెచ్చరించారు, "కనుక అయోగ్యముగా ప్రభువు రొట్టెను ఎవడైనా తినినా లేక ఆయన పాత్ర నుండి త్రాగిన అతడు ప్రభువు శరీరమునకు రక్తమునకు వ్యతిరేకముగా పాపము చేయుచున్నాడు." (1 కొరింతీ 11:27). కనుక విశ్వాసులు దివ్య సత్ప్రసాదమును లోకునుటకు ముందు శ్రీసభ నియమించిన విధానంలో ఉపవాసమును తప్పనిసరిగా ఆచరించాలి. ఇలా చేయడం ద్వారా మనము క్రీస్తు ప్రభువుని శరీర రక్తాలను యోగ్య రీతిలో గైకొనగలం. ప్రభుని శరీర రక్తాలను విశ్వాసులు ఒకే దినములో రెండుసార్లు బలి పూజలు స్వీకరించవచ్చు. కానీ రెండింటిలో ఒక బలి పూజలో మాత్రం, సంపూర్ణంగా పాల్గొని ప్రభువుని శరీర రక్తాలను గైకొనాలి. అత్యవసర పరిస్థితులలో, అనగా వ్యాధిగ్రస్తుల అభ్యంగనము అప్పుడు మాత్రమే, ఒకే రోజులో మూడవసారి కూడా కతోలిక విశ్వాసి దివ్య సత్ప్రసాదమును స్వీకరించగలరు (Can.917).

## 3. దివ్య సత్ప్రసాద గీతం

గురువు ప్రభువుని శరీర రక్తాలను గైకొనిన తరువాత విశ్వాసులకు ప్రభు శరీర రక్తాలను అందించు సమయములో దివ్య సత్ప్రసాద గీతాన్ని ఆలపించెదరు. ఖచ్చితంగా ఈ సమయంలో ఒక పాటను మాత్రమే పాడాలి, అనే నియమాన్ని శ్రీసభ దృఢంగా సూచించడం లేదు. దైవార్చన పూజా క్రమము యొక్క నియమావళి ప్రకారము (GIRM.86,87) గురువు ప్రభు శరీర రక్తములు గైకొనునప్పుడు లేదా తరవాత సత్ప్రసాద గీతము మొదలవుతుంది. ఈ గీతం

యొక్క ఉద్దేశ్యము సంఘము యొక్క ఏకత్వాన్ని ప్రతిబింబించడం మరియు సామూహిక స్వభావాన్ని చూపించే విధంగా ఉంటుంది. అందరూ ఏక కంఠంతో ప్రభుని స్వీకరిస్తున్నామని సంతోష, ఉల్లాసాలతో భక్తి యుతంగా ఈ గీతాన్ని ఆలపించాలి. ఈ గీతము స్థానిక మేత్రానుల సమైక్యమండలి ద్వారా ఆమోదం పొందినదై, దైవార్చన కట్టుబాటులను అతిక్రమించకుండే విధంగా ఉండాలి. పాటలోని భావజాల ప్రభుని శరీర రక్తాలకు సంబంధించినదై ఉండాలి. (GIRM 87) ఈ యొక్క గీతమును ప్రజలందరూ దివ్య సత్ప్రసాదమును స్వీకరించు అంతవరకు పాడిన యెడల, ఎటువంటి అంతరాయం ఉండదు. ఒకవేళ గీతం పాడకపోయిన యెడల దివ్య పూజ గ్రంథము (రోమన్ మిస్సల్) లో ఇచ్చిన Communion Antiphon ని, ప్రజలు లేక లెక్టర్ చదువవచ్చు. లేకపోతే యాజకుడు దివ్య సత్ప్రసాదాన్ని స్వీకరించిన పిదప, ప్రజలకు ఇవ్వకముందు తానే స్వయంగా చదవవచ్చు. ఈ రెండు జరగకపోతే ప్రజలు ప్రభు శరీర రక్తాలను స్వీకరించిన పిదప తమ స్థలములోనే కూర్చుని నిశ్శబ్దంగా, భక్తి యుతంగా ప్రార్థించుకోమని శ్రీసభ ప్రోత్సహిస్తూ ఉంది.

## 2. పవిత్ర దివ్య సత్ప్రసాదమును పంపకం మరియు స్వీకరణ

### 1. పవిత్ర దివ్య సత్ప్రసాద పరిచారకత్వము చేయుటకు అర్హులైన వారు

### 1.1 గురువు

గురువు, ఒక నియమిత మంత్రిగా, పవిత్ర దివ్య పూజ్యలో కేంద్ర పాత్ర పోషిస్తాడు. దివ్యబలిపూజలో యాజకుని యొక్క ప్రాథమిక మరియు ప్రత్యేకమైన పాత్ర ఏమిటంటే, పూజ సమయంలో రొట్టె మరియు ద్రాక్షారసాన్ని పవిత్రం చేయడం, వాటిని క్రీస్తు శరీరం మరియు రక్తంగా మార్చడం (కాథలిక్ వేదాంతశాస్త్రంలో ఈ ప్రక్రియను ట్రాన్స్‌బస్టాంటియేషన్ అని పిలుస్తారు). ఒక నియమిత యాజకుడు లేదా బిషప్ మాత్రమే ఈ మతకర్మ చర్యను చెల్లుబాటు అయ్యేలా చేయగలరు.

### 1.2 ఉప గురువుల పాత్ర

ఉప గురువులు విశ్వాసులకు దివ్య సత్ప్రసాదమును పంపిణీ చేయడంలో సహాయం చేస్తారు. దివ్య సంస్కారమును గౌరవంగా మరియు దైవార్చన

నిబంధనల ప్రకారం ఇవ్వబడుతుందని నిర్ధారిస్తారు. ఉప గురువులు బలిపీఠమును సిద్ధం చేయడంలో, సువార్తను ప్రకటించడంలో మరియు దివ్యబలి సమయంలో గురువుకీ సహాయం చేయడంలో కూడా పాత్ర పోషిస్తారు, దైవార్చన సేవ యొక్క సరైన నిర్వహణలో సహకరిస్తారు.

### 1.3 పూజలో దివ్యసాత్ర్రసాదాన్ని పంచుటకు సహాయం చేసే సహచరుల పాత్ర

దివ్యసత్ర్రసాదాన్ని పంచిపెట్టడంలో అసాధారణ సహచరులు తమ పాత్రను అర్థం చేసుకోవడానికి మరియు అవసరమైన గౌరవాన్ని అర్థం చేసుకోవడానికి సరైన శిక్షణ పొందాలి. వీటితోపాటు వారు దైవార్చన నిబంధనలు మరియు దివ్యసంస్కారము యొక్క ప్రాముఖ్యతను అర్థం చేసుకోవాలి. వారి పాత్ర దివ్యసత్ర్రసాదమును సమర్ధవంతంగా మరియు గౌరవంగా పంచటమే. దివ్యసత్ర్రసాదమును గౌరవంగా నిర్వహించడం మరియు దైవార్చన నిబంధనలను పాటించడం.

## 2. పంచుట మరియు స్వీకరణ విధానం

### 2.1 సంప్రదాయ పంచుట పద్ధతులు

### 1. నాలుకపై (on the tongue)

దివ్యసత్ర్రసాదమును నాలుకపై స్వీకరించడం అనేది దివ్యసంస్కారం పట్ల లోతైన గౌరవాన్ని సూచించే విధంగా పరిగణించబడుతుంది. ఇది దివ్యసత్ర్రసాదంలో క్రీస్తు యొక్క వాస్తవిక, యదార్ధమైన సాన్నిధ్యాన్ని విశ్వసించడాన్ని ధ్రువపరుస్తుంది. ఈ పద్ధతిలో దివ్యసత్ర్రసాదమును తగిన విధంగా నిర్వహించేందుకు పంచే వ్యక్తులు జాగ్రత్తగా మరియు ఖచ్చితంగా ఉండాలి. నాలుకపై స్వీకరించడం ద్వారానే, అభిషేకించబడిన అప్పము యొక్క చిన్న పదార్థాలు కూడా కింద పడకుండా నిరోధించవచ్చు.

### 2. చేతిలో (on the Hand)

Communicant (స్వీకరించేవాడు) ఒక చేయిని మరొకటిపై ఉంచి అప్పముకు ఒక సింహాసనం వలె రూపొందిస్తాడు. గురువు అప్పమును స్వీకరించే వాని చేయిపై ఉంచుతాడు, తర్వాత కమ్యూనికెంట్ వెంటనే దాన్ని స్వీకరిస్తాడు.

ఈ పద్ధతి చాలా చోట్ల సాధారణమైనదైనా, చేతులు శుభ్రంగా ఉండటం మరియు దివ్యసత్ప్రసాదమును వెంటనే స్వీకరించడం చాలా అవసరం, లేకపోతే దివ్యసత్ప్రసాదము అవమానానికి (sacrilege) గురయ్యే ప్రమాదం ఉంది.

## 2.2 విశ్వాసంతో స్వీకరణ

### తయారీ

కమ్యూనికెంట్లు (స్వీకరించేవారు) కృపా స్థితిలో ఉండాలి మరియు కమ్యూనియన్ స్వీకరించకముందు తమను ఆధ్యాత్మికంగా సిద్ధం చేసుకోవాలి. ఈ పద్ధతిలో, చావైన పాపాలను ఒప్పుకోవడం (confession) మరియు గౌరవంతో ముందుకు రావడం ఉంటాయి.

### ముద్రలు మరియు అంగీకారాలు

GIRM (General Instruction of the Roman Missal) ప్రకారం, సరైన ముద్రలు (నిలబడి) మరియు అంగీకారాలు (ఉదాహరణకు స్వీకరించే ముందు తలవంచడం) చూపడం ద్వారా గౌరవం తెలియజేయాలి.

స్థానిక ఆచారాలు కొన్ని నిర్దిష్ట పద్ధతులను సూచించవచ్చు, కానీ ముఖ్యాంశం దివ్యసత్ప్రసాదమును గౌరవంతో స్వీకరించడం .

## 2.3 కమ్యూనియన్ ప్లేట్ యొక్క పాత్ర

### ఉద్దేశ్యం

కమ్యూనియన్ ప్లేట్ అనేది మంత్రివర్యుడు కమ్యూనియన్ పంపిణీ సమయంలో ఆశీర్వదింపబడిన అప్పమును రక్షించేందుకు ఉపయోగిస్తారు, ప్రత్యేకంగా కమ్యూనికెంట్ నాలుకపై హోస్ట్‌ను స్వీకరిస్తున్నప్పుడు. దివ్య సత్ప్రసాదము నుండి ఏమైనా పదార్థాలు పడితే అవి ప్లేట్‌లో పడతాయి మరియు గౌరవంతో ప్రదర్శించబడతాయి.

### వినియోగం

సాధారణంగా కమ్యూనియన్ పంపిణీ సమయంలో ఉపయోగించ బడుతుంది. ఈ ప్లేట్‌ను కమ్యూనికెంట్ యొక్క మొహం క్రింద ఉంచుతారు, తద్వారా ఏమైనా దివ్యసత్ప్రసాద పదార్థాలు పడితే అవి అందులోనే పట్టబడతాయి. ఈ విధంగానే, యుకరిస్టు యొక్క పవిత్రతను కాపాడడంలో ఇది కీలక పాత్ర వహిస్తుంది.

## 3. గౌరవ సూచక సంకేతాలు (Signs of Reverence)

### 3.1 మోకాళ్లపై కూర్చోవడం మరియు నిలబడటం

#### మోకాళ్లపై కూర్చోవడం

పరిశుద్ధ దివ్యసత్ర్పసాద సన్నిధిలో మోకాళ్లపై కూర్చోవడం అనేది సంప్రదాయ ఆరాధనా స్థితి, ఇది అభిషేకిత అప్పములో క్రీస్తు యొక్క వాస్తవిక సన్నిధిని అంగీకరించటానికి భౌతిక సంకేతంగా పరిగణించబడుతుంది.

#### నిలబడటం

నిలబడటం అనేది దివ్యసత్ర్పసాద స్వీకరణలో అంగీకరించబడిన మరో భక్తిపూర్వక స్థితి. ఇది సమూహంగా మరియు చురుకైన ఆత్మీయ భాగస్వామ్యాన్ని సూచిస్తుంది. కొన్ని ప్రాంతాలలో ఇది సాధారణ ఆచారంగా ఉంటుంది.

### 3.2 తలవంచడం మరియు ఇతర భక్తిసూచక అంగీకారాలు

#### తలవంచడం (Bowing)

కమ్యూనియన్ స్వీకరించేముందు తలవంచడం అనేది ప్రభువు సన్నిధిని గుర్తించడాన్ని తెలియజేసే సంకేతం. ఇది వినమ్రత మరియు భక్తి యొక్క వ్యక్తీకరణ.

#### ఇతర అంగీకారాలు

తలవంచడానికి తోడు, పవిత్ర సిలువ గుర్తు సంకేతం చేయడం లేదా చేతులను ప్రార్థనా ముద్రలో ఉంచడం వంటివి కూడా ఉపయోగించవచ్చు. ఈ అంగీకారాలు యూకరిస్టు పట్ల భక్తిని మరియు గౌరవాన్ని వ్యక్తపరచే విధంగా ఉంటాయి.

### 3.3 దైవార్చన నియమాలు – స్వీయ దివ్యసత్ర్పసాద స్వీకరణ పై నిషేధం

స్వీయ దివ్య సత్ర్పసాద స్వీకరణ (Self-service) అనగా వ్యక్తులు తామే స్వయంగా కమ్యూనియన్‌ను తీసుకోవడం. దివ్యసత్ర్పసాద పంపిణీదారుని చేత అందుకోకుండా స్వీకరించడమే.

కాథలిక్ చర్చిలోని దైవార్చన నియమాల ప్రకారం, సత్ర్పసాదము యొక్క పవిత్రత మరియు క్రమశిక్షణను పరిరక్షించడానికి ఈ ఆచారం అనుమతించబడదు. దివ్యసంస్కారము పంపిణీ సాధారణ మంత్రివర్యులచే లేదా అసాధారణ మినిస్టర్లచే జరగాలి.

## 4. ఆమెన్ అని చెప్పడం - ప్రభువు శరీరము/రక్తము స్వీకరణలో

### 4.1 ఆమెన్ అనే ప్రతిస్పందన యొక్క ప్రాముఖ్యత

పవిత్ర దివ్యసత్ప్రసాదమును స్వీకరిస్తూ మినిస్టర్ ప్రభువు శరీరము లేదా ప్రభువు రక్తము అని చెప్పినప్పుడు, కమ్యూనికెంట్ ఆమెన్ అని స్పష్టంగా, గౌరవంగా స్పందించాలి.

ఇది క్రీస్తు సత్ప్రసాదములో వాస్తవికంగా ఉన్నారనే విశ్వాసానికి భక్తిపూర్వక అంగీకారం (Affirmation of Faith) అయిన సంకేతం.

సమయం మరియు ఉచ్చారణ (GIRM 161 ప్రకారం)

GIRM 161 ప్రకారం,

గురువు ప్రభువు శరీరము లేదా ప్రభువు రక్తము అని చెప్పిన వెంటనే ఆమెన్ అని స్పందించాలి. ఈ ప్రతిస్పందన స్పష్టంగా, భక్తిశ్రద్ధతో ఉండాలి, అది నిస్సారంగా కాకుండా, దివ్యసంస్కారము యొక్క సత్యాన్ని నమీ మనస్ఫూర్తిగా ఉండాలి.

అవమానకర వాడుకను నివారించాలి

GIRM 161 సూచించేదేమిటంటే, ఆమెన్ అన్న పదాన్ని తక్కువగా భావించకూడదు, దీన్ని సరదాగా లేదా నిర్లక్ష్యంగా పలకరాదు.

అది సరైన అర్థం మరియు గౌరవంతో పలకాలి.

ఆమెన్ అనేది దివ్యసత్ప్రసాదము సాక్షాత్తు క్రీస్తు స్వరూపాన్ని అంగీకరించే ఆత్మీయ ప్రకటనగా ఉండాలి.

## 3. పవిత్రమైన పాత్రల శుద్ధికరణ (Purification)

### 1.1. పవిత్రమైన రొట్టె మరియు శుద్ధికరణ

పవిత్రములైన పాత్రములను బలిపీఠము దగ్గర నుంచి సహోగురువులు వెంటనే తీసుకోకూడదు. ఆ పాత్రలను పూజను సమర్పించే గురువు చేతిలో నుండి తీసుకోవలేను. ప్రభువు శరీరము మరియు ద్రాక్షరసములను విశ్వాసులకు అందించిన పిమ్మట మిగిలిన ముక్కలను గురువు పవిత్రముగా అంతయు స్వీకరించాలి. ద్రాక్షరసమును రెండవసారి సహగురువులకు అందించడం మంచిది కాదు. అలా చేయడం వల్ల రెండు పర్యాయములు ప్రభు శరీర

రక్తములను స్వీకరించనట్లుగా ఉంటుంది. ఒకెసారి ప్రభు శరీర రక్తములను భక్తి శ్రద్ధలతో స్వీకరించాలి. ఒక వేళ విస్వాసులకు అప్పము, ద్రాక్షరసము ఇచ్చునప్పుడు క్రిందపడితే గురువు మాత్రమే వాటిన తీసి ఆ విశ్వాసికి ఇవ్వాలి. ద్రాక్షరసము పడిన చోట వెంటనే తెల్లని వస్త్రముతో ఆ స్థలంను కడిగి ఆ నీరును పాత్రలను శుభ్రపరచు గదిలో పారవేయాలి. విశ్వాసులకు దివ్యసత్ప్రసాదమును అందించిన పిమ్మట ఒకవేళ ద్రాక్షరసము మిగిలినట్లైతే వెంటనే గురువు స్వీకరించాలి. ఒకవేళ పవిత్రీకరించబడిన రొట్టె మిగిలియుంటే గురువు స్వీకరించాలి లేదా దివ్యమందసమునందు భద్రపరచాలి.

## 1.2. Credence table పూజ పాత్రములను ఉంచుటకు ఉపయోగించుబల్ల

ఈ బల్లను బలిపీఠము ప్రక్కన లేదా పవిత్ర స్థలంలో ఉంచవలెను. పవిత్రమైన పాత్రలు మరియు పవిత్రమైన వస్త్రాలను ఉపయోగించే ఒక చిన్న బల్ల. పూజ ప్రారంభము నుండియే, పూజ పాత్రలు, వస్త్రాలు, చేతులు కడుగుకొను పాత్ర ఈ బల్లపై ఉంచుకోవచ్చు. దివ్యసత్ప్రసాద స్వీకరించిన అనంతరం గురువు లేద డీకన్ ఈ బల్ల దగ్గరికి వచ్చి మర్యాదపూర్వకంగా ఈ పాత్రలను శుద్ధిచేస్తారు.

## 1.3. పవిత్ర పాత్రలను శుద్ధిచేయడం

విశ్వాసులకు దివ్యసత్ప్రసాదము అందించిన పిమ్మట గురువు లేదా డీకన్ బలిపీఠము లేదా క్రిడన్స్ టేబల్ దగ్గరికి వచ్చి పాత్రలను శుద్ధి చేస్తారు. ద్రాక్షరస పాత్రను శుభ్రపరచునప్పుడు గురువు నిశ్శబ్ధముగా *Quod one Sunpsimus* అనే వచనాన్ని మననం చేస్తు ద్రాక్షరసమును స్వీకరించి ఆ పాత్రను తెల్లని వస్త్రాముతో శుద్ధిచేయాలి. ఈ పూజ పాత్రలను గురువు, డీకన్ లేదా అర్చక విద్యార్థి మాత్రమే వాటిని శుద్ధిచేయాలి. మిగిలియున్న ద్రాక్షరసమును ఆ పాత్రను శుద్ధిచేయువారు మాత్రమే స్వీకరించాలి. ఈ పాత్రలను గురువు బలిపీఠ మధ్యలో నిల్చొని శుద్ధిచేయడం ద్వార క్రింద ఉన్నటువంటి విశ్వాసుల భక్తి శ్రద్ధలకు అటంకంగా ఉంటుంది. కాబట్టి వీటిని త్రగిన స్థలములో లేదా నిర్ణయించిన బల్ల దగ్గరకు వెళ్ళి శుద్ధిచేయడం మంచిది. ఒక వేళ తగిన సమయంలో ఈ పాత్రలను శుద్ధి చేయలేకపోతే ఆ పాత్రలంనింటిని దైహికమైన వస్త్రములో భద్రపరచి పూజ అనంతరం వెంటనే ఈ పాత్రలను శుభ్రపరచలి.

## పాత్రలను శుద్ధిచేయడం, శుభ్రపరచడం మధ్య వ్యత్యాసం

- శుద్ధిచేయడం అనగా పూజ సమయములో పాత్రలను శుద్ధిచేయండం.
- శుభ్రపరచడం అనగా విడిగా ఉన్న సమయములో పవిత్రమైన వస్తువులను, పాత్రలను శుభ్రపరచడం.

## 2. దివ్యసత్ర్పసాదార్చన తరువాత నిశ్శబ్ధ మరియు స్తుతి ప్రార్థనల వివరణ

దివ్యసత్ర్పసాదార్చన ముగిసిన అనంతరం గురువు మరియు, విశ్వాసులు కొంత సమయము నిశ్శబ్ధంగా ఉండి ప్రార్థన చేసుకోవాలి. ఈ ప్రత్యేక సమయాన్ని ప్రార్థనకు కేటాయించాలి. ఒకవేళ భక్తుల పాటలు పాడవలసి వస్తే ఏదైన మంచి భక్తియుక్తమైన భజన గీతాన్ని ఆలపించడం మంచిది. ఆ గీతం కూడ స్తుతిగీతమై ఉండాలి. సముచితమైన సంగీతం ప్రశాంతమైన క్షణాలకు తోడుగా ఉండాలి. ఈ పవిత్రమైన క్షణాలకు ప్రకటనల ద్వార భంగపరచకూడదు. ఆ సమయాన్ని వేరే ఏ ఇతర అనవసర విషయాలకు కేటాయించకుండా నిశ్శబ్ధ ప్రార్థనకు కేటాయించాలి.

### 2.1. ప్రకటనలు మరియు కానుకలు

సత్ర్పసాద స్వీకరణానంతర ప్రార్థన అనంతరం ఎదైన ప్రకటనలు ఉంటే ఆ సమయములో చెప్పవలెను. సామాన్యముగా గురువు ప్రకటనలు చేస్తారు. ఒకవేళ డీకన్ ఉన్నచో గురువు సమక్షములో చదువవలెను. ప్రకటనలు చేయడానికి ఇదే తగిన సమయము. కొన్ని సందర్భాలో సత్ర్పసాద స్వీకరణానంతర ప్రార్థన కంటే ముందుగా చదువుతుంటారు. అలా కాకుండా సత్ర్పసాద ప్రార్థన అనంతరం చెప్పడం మంచిది. కొన్ని ప్రాంతలలో ప్రకటనలు చేస్తున్న సమయంలో రెండవసారి కానుకలు అర్పిస్తుంటారు. అర్పణ సమయం మినహా ఇతర సమయంలో కానుకలు అర్పించడంకాని, స్వీకరించడం కాని చేయకూడదు.

## దివ్యసత్ర్పసాద స్వీకరణనంతర ప్రార్థన

దివ్యసత్ర్పసాద స్వీకరణానంతరం గురువు బలిపీఠం చెంతకు వచ్చి చేతులు చాచి ప్రార్థనను చెబుతారు. విస్వసులు బదులుగా 'ఆమెన్' అని సమాధానమిస్తారు.

## దివ్యసత్ప్రసాద క్రమమునకు సంభందించి రోమను క్రమములోని దివ్యపూజ గ్రంథంలో ఉన్న సాధారణ నియమాలు

### దివ్యసత్ప్రసాదము

84. క్రీస్తు శరీరరక్తములను ఫలవంతముగ స్వీకరించు నిమిత్తము యాజకుడు మౌనముగా ప్రార్థించి తనను తాను సిద్ధపరచుకొనును. ఆ సమయములో, విశ్వాసులు కూడ మౌనముగా ప్రార్ధించి తమ్ము తాము సంసిద్ధ మొనర్చుకొందురు. యాజకుడు పవిత్రమైన అప్పమును పళ్ళెరముపై లేక దివ్యరసపాత్రముపై కొంచెము పైకెత్తి పట్టుకొని ప్రజలకు చూపించి, వారిని క్రీస్తు విందులో పాల్గొనుమని ఆహ్వానించును. విశ్వాసులతో పాటు సువార్తా వాక్యములను ఉపయోగించి. వినమ్రతా ప్రార్ధనను చెప్పును.

85. అదే పూజలో ప్రతిష్ఠింపబడిన పవిత్రమైన అప్పమునుండి యాజకుడు, విశ్వాసులు క్రీస్తు శరీరమును స్వీకరించుటయు, అనుమతింపబడినప్పుడెల్ల పాత్రమునుండి (చూడుము: సంఖ్య 283) క్రీస్తు రక్తమును స్వీకరించుటయును ఉపయుక్తము. ఈ విధముగ ప్రత్యక్షముగ నెరవేరుచున్న దివ్యబలిపూజలో పాల్గొనుచు, దివ్యసంస్కార చిహ్నముల ద్వారా తమ ఐక్యమును చాటుచున్నారు.

86. యాజకుడు, విశ్వాసులు దివ్యసత్ప్రసాదమును స్వీకరించునప్పుడు సత్ప్రసాద గీతము ఆలపింపబడును. ఏక కంఠముతో పాడు ఈ గీతము విశ్వాసుల ఆధ్యాత్మిక ఐక్యమును సూచించుచున్నది. హృదయ ఉల్లాసమును వ్యక్తము చేయుచున్నది. సత్ప్రసాదము స్వీకరించుటకు ప్రదక్షిణగా వెళ్లువారిని ప్రేమలో ఐక్యపరచుచున్నది. యాజకుడు దివ్యసత్ప్రసాదము లోకొను నప్పుడు ఈ గీతము ప్రారంభమై, అవసరానుకూలముగ విశ్వాసులందరు సత్ప్రసాదము స్వీకరించునంత వరకు కొనసాగును. సత్ప్రసాదము స్వీకరించిన తరువాత కూడ ఒక పాట ఉన్నచో, సత్ప్రసాదగీతమును తగిన సమయములో ముగింపవలయును. గాయకబృందము కూడా సులభముగా సత్ప్రసాదము స్వీకరించునట్లు శ్రద్ధ వహింపవలయును.

87. దివ్యసత్ప్రసాద సమయములో, రోమీయ అనుక్రమ కీర్తనల పుస్తకము నుండి పల్లవిని కీర్తనతోపాటు లేక కీర్తన లేకుండ పాడవచ్చును. సామాన్య కీర్తనల పుస్తకమునుండి కీర్తనతోపాటు పల్లవిని పాడవచ్చును. లేక పీఠాధిపతుల సమాఖ్య అనుమతించినచో వేరొక సముచిత గీతమును పాడవచ్చును. దీనిని గాయకబృందము లేక విశ్వాసులతో కలసి గాయకబృందముగాని లేక గాయకుడుగాని పాడవచ్చును. ఏ గీతమును లేనియెడల, దివ్యపూజ గ్రంథములోని సత్ప్రసాద వచనమును విశ్వాసులందరు లేక వారిలో కొందరు లేక ఒక పాఠకుడు చదువును. లేనిచో యాజకుడు తాను సత్ప్రసాదము స్వీకరించిన తరువాత, విశ్వాసులకు సత్ప్రసాదము పంచక ముందు ఈ వచనమును చదువును.

88. దివ్యసత్ప్రసాదము స్వీకరించుట ముగించిన తరువాత యాజకుడు, విశ్వాసులు అవసరానుకూలముగ కొంచెము సేపు మౌనముగా ప్రార్థింతురు. అవసరమును బట్టి విశ్వాసుల సంఘమంతయు కలసి ఒక స్తుతిగీతమునుగాని, ఒక పాటనుగాని, ఒక కీర్తననుగాని ఆలాపించును.

89. దైవప్రజల ప్రార్థనను పరిపూర్తి చేయుటకును, సత్ప్రసాద క్రమమును ముగించుటకును, యాజకుడు సత్ప్రసాద స్వీకరణానంతర ప్రార్థనను చెప్పును. ఈ ప్రార్థనలో ఇప్పుడు కొనియాడబడిన పరమరహస్య ఫలముల కొరకు ప్రార్థింతురు.


బ్రదర్ బలసాని ప్రభుదాస్


బ్రదర్ పసల కళ్యాణ్ కుమార్


బ్రదర్ ఆవుల రవి కిషోర్

❋ ❋ ❋ ❋

# 8. దివ్యబలిపూజ ముగింపు క్రమము

– బ్రదర్ తిప్పాన యువ చైతన్య, బ్రదర్ చింతా జార్జ్

## ఉపోద్ఘాతం

కతోలిక దివ్యబలిపూజ ముగింపు క్రమం సాధారణంగా చిన్న భాగంలా కనిపించినప్పటికీ, ఇది ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఘట్టం. ఇది కేవలం ముగింపు మాత్రమే కాదు, విశ్వాసులను తమ దినచర్యలో ప్రభువుతో జీవించేందుకు పంపే ఆత్మీయ ఆహ్వానం కూడా. ఇది ఆశీర్వాదం మరియు పంపివేయుట అనే రెండు భాగాలతో కూడి ఉంటుంది. దివ్య సత్ప్రసాదాన్ని స్వీకరించిన విశ్వాసులు, ఇప్పుడు అదే ప్రభువుని తమ మాటల్లో, కృషిలో, జీవనశైలిలో ప్రతిఫలించాల్సిన అవసరం ఉంది. ఈ ముగింపు క్రమం ద్వారా శ్రీసభ, విశ్వాసులకు ఒక పిలుపునిస్తుంది అదేమిటి అంటే మీరు పొందిన దైవానుభూతిని బయట ప్రపంచానికి చూపండి. ఈ ఘట్టం శ్రీసభలో భాగమైన ప్రతి విశ్వాసిలో ఏకత్వాన్ని, పాలుపంచుకున్న పరిచర్య పట్ల స్పష్టతను నాటుతుంది. ఇది దివ్య సత్ప్రసాదం ద్వారా మానవులందరినీ ఒకే దేవునిలో కలిపే కృషికి గుర్తుగా నిలుస్తుంది. తుద ఆశీర్వాదం ద్వారా విశ్వాసులు దైవ సంరక్షణతో ముందుకు సాగేందుకు ఆశీర్వదించబడతారు. అంతేకాదు, ఈ ముగింపు క్రమం మన ఆరాధనలో దైవ సన్నిధిని అనుభవించడమే కాదు, ఆ అనుభవాన్ని ప్రపంచంలో భాగస్వామ్యం చేయాలనే బాధ్యతను మనపై ఉంచుతుంది. ఇది విశ్వాసుల ఆత్మీయ పయనాన్ని బలపరుస్తుంది మరియు ప్రేరేపిస్తుంది.

## చారిత్రిక అభివృద్ధి

దివ్యబలిపూజ యొక్క ముగింపు క్రమం అనేది శతాబ్దాలుగా శ్రీసభలో రూపాంతరం చెందుతూ, ఆధ్యాత్మికంగా, దైవార్చనగా పరిపక్వతను సాధించిన

భాగంగా పరిగణించబడుతుంది. దీనికి అనేక చారిత్రిక దశలున్నాయి. శ్రీసభ అభివృద్ధి చెందిన విధానాన్ని ఇది ప్రతిబింబిస్తుంది కూడా.

### 1. ప్రాథమిక శ్రీసభ (క్రీ.శ. 1వ-4వ శతాబ్దాలు)

ఆదిమ క్రైస్తవ సమాజం అత్యంత సరళమైన ఆరాధన సంప్రదాయాన్ని అనుసరించేది. **డడాకె, జస్టిన్ మార్టిర్ యొక్క ఫస్ట్ అపాలజీ వంటి గ్రంథాల్లో** కనిపించేది ఏమంటే, క్రైస్తవులు దేవుని వాక్యం వినేవారు, దివ్య సత్ర్పసాదం పొందేవారు. అయితే ముగింపు క్రమం చాలా తక్కువగా ఉండేది, అయినా అది ఆత్మీయంగా గాఢమైనదే. అపోస్తలిక చట్టంలో ఇచ్చిన సమాచారం ప్రకారం, దివ్య సత్ర్పసాదం స్వీకరించిన తరువాత డీకన్ ఇలా పలికేవాడు: "ప్రభుని ద్వారా దేవునికి నమస్కరించుడి, ఆశీర్వాదం పొందుడి." ఆపై పీఠాధిపతి ఒక దీర్ఘ ఆశీర్వాద ప్రార్థన చేయగా, చివరగా డీకన్ ఇలా ప్రకటించేవాడు: "సమాధానంతో వెళ్లుడి."

### 2. మధ్యయుగ కాలం నుండి ద్వితీయ వాటికన్ మహాసభలు వరకు

5వ శతాబ్దం తరువాత **శ్రీసభ విస్తరించడంతో, దైవార్చన మరింత నిర్మితంగా మారింది.** ఒర్డో రోమానస్ ప్రీమస్ అనే ప్రాచీన దైవార్చన గ్రంథం ప్రకారం, దివ్యసతప్రసాదం తరువాత అర్చ్‌డీకన్ ప్రజలకు ఈవిధంగా ప్రకటించేవాడు: *"Ite, missa est"* 'దివ్యబలిపూజ ముగిసింది, వెళ్లుడి.

ప్రజలు స్పందనగా: "Deo gratias" 'దేవునికి కృతజ్ఞతలు అని పలికేవారు.

"రోమన్ మిస్సలు"లో ఈ సమయంలో ప్రత్యేక ఆశీర్వాదాలు, ముగింపు ప్రార్థనలు, గీతాలు చేరాయి. ఈ ముగింపు ఘట్టం అప్పటి నుండి ప్రత్యేకమైన సూత్రీకృత రూపాన్ని పొందింది.

### 3. ద్వితీయ వాటికన్ మహాసభలు అనంతరం

1962-1965 మధ్య జరిగిన ద్వితీయ వాటికన్ మండలి సమయంలో Sacrosanctum Concilium అనే దైవార్చన సంస్కరణ పత్రం వెలువడింది. దీని ద్వారా దివ్య పూజాబలిలో విశ్వాసుల భాగస్వామ్యం పెరగాలనే ఉద్దేశంతో, ముగింపు క్రమాన్ని మరింత స్పష్టంగా రూపొందించారు. 1969లో విడుదలైన రోమన్ మిస్సల్ ఆధారంగా ముగింపు క్రమం నాలుగు ప్రధాన భాగాలుగా అమలులోకి వచ్చింది:

1. తక్షణ ప్రకటనలు
2. తుది ఆశీర్వాదం
3. పంపివేయుట
4. బలిపీఠం

కొన్ని సందర్భాల్లో ముగింపు గీతం కూడా జోడించబడుతుంది. ఈ విధంగా దివ్య సత్ప్రసాదం అందుకున్న విశ్వాసులు, జీవితం ద్వారా ప్రభువును ప్రత్యక్షంగా వ్యక్తీకరించేందుకు శ్రీసభ ద్వారా పంపబడుతున్నారు.

## 4. వేదాంతపరమైన భావార్థం

దివ్యబలిపూజలో ముగింపు క్రమం ఎంతో చిన్నదిగా ఉండే భాగంగా అనిపించినా, దీని వేదాంత అర్థం ఎంతో ప్రభావవంతమైనది. ఇది కేవలం పూజకు ముగింపు ఇవ్వడమే కాకుండా, దివ్య సత్ప్రసాదాన్ని స్వీకరించిన విశ్వాసులకు జీవన మార్గాన్ని సూచించే పరిచర్య పిలుపు కూడా.

### 4.1. పరిచర్యకు పిలుపు

ముగింపు క్రమంలో చెప్పబడే వాక్యం "వెళ్లుడి, దివ్యబలిపూజ ముగిసింది" లేదా "ప్రభువు సువార్తను ప్రకటించండి"

ఇవి పరిపూర్ణ పరిచర్య ఆహ్వానాలు. ప్రభువు మట్లాడిన మాటలు. మత్తయి 28:19-20 వాక్యాల్లో ఆయన స్వయంగా చెప్పాడు: "వెళ్లి సమస్త జనులను నా శిష్యులుగా చేయుడి." దివ్యసత్ప్రసాదం ద్వారా పొందిన శక్తితో, విశ్వాసులు ఇప్పుడు ప్రభువు ప్రేమను ప్రపంచానికి ప్రకటించడానికి వెళ్తారు.

### 4.2. ఆశీర్వాదం 'కృప మరియు సంరక్షణ

ప్రారంభంలో తెలియ చేసిన విధంగా, ముగింపులో కూడా ఆశీర్వాదం ద్వారా శ్రీసభ విశ్వాసులకు దేవుని కృపను అంధజేస్తుంది. ఇది కేవలం అనుమతిచ్చే పదం కాదు, ఆత్మీయ బలాన్ని కలిగించే అనుగ్రహ సూచన. కథోలిక సత్యోపదేశం (CCC 2626) ప్రకారం, ఆశీర్వాదం అనేది దేవుని ప్రత్యక్షతను స్వీకరించే మానవ హృదయ స్పందన. ఇది ప్రార్థనలో అనుసంధానమయ్యే స్థితి. బలిపూజలో మొదటివారి ఆశీర్వాదాన్ని స్వీకరించిన విధంగా, తుదలో కూడా మేము దేవుని దయతో బయటికి బయలుదేరుతాము.

## 4.3. దివ్యసత్ప్రసాదం ఆధారంగా మార్పు

లూకా 24:30-33లో ఉన్న ఎమ్మావూస్ శిష్యుల అనుభవం గమనించదగినది. వారు యేసుతో కలిసి యాత్ర చేశారు, ఆయనను రొట్టెలను విరుస్తున్నప్పుడు గుర్తించారు. వెంటనే తిరిగి వెళ్లి ఆయనను ప్రకటించారు. ఇదే అనుభవం ప్రతి బలిపూజ అనంతరం విశ్వాసులకు ఉద్దేశింపబడి ఉంది. విశ్వాసులు దివ్యసత్ప్రసాదం ద్వారా ప్రేమ, సేవ, మరియు సాక్ష్యం ద్వారా ప్రభువును ప్రదర్శించే జీవితం వైపు మార్పు చెందుతారు.

## 4.4. ఆత్మీయ మరియు సంఘాత్మక మార్పు

రోమీ 12:1-2లో అపొస్తలుడు పౌలు చెప్పినట్టు, మనం మన శరీరాన్ని "సజీవ యాగముగా" అర్పించాలి. బలిపూజలో పొందిన దయ మన జీవితమంతా ప్రభువుకు అర్పించాలనే పిలుపు. ఇది వ్యక్తిగత మార్పే కాక, శ్రీసభ సభ్యులుగా సంఘమంతటినీ ప్రభువు రూపంగా నిర్మించాలనే పిలుపు కూడా.

## 4.5. పరలోకం వైపు దృష్టి

ముగింపు క్రమం మన గమ్యస్థానాన్ని కూడా గుర్తు చేస్తుంది. దేవునితో శాశ్వత ఐక్యం. దివ్య సత్ప్రసాదం పరలోకంలోని ఆ మహా విందుకు ఒక రుచి. కాబట్టి, ఈ క్రమం ద్వారా మనం కేవలం ఈ లోకానికి సేవ చేయడం మాత్రమే కాదు, పరలోక రాజ్యాన్ని ఆకాంక్షిస్తూ సాగిపోతున్న యాత్రికులం అని గుర్తు చేస్తుంది.

## 5. దివ్యబలిపూజ ముగింపు క్రమంలోని నిర్మాణం

దివ్యబలిపూజలో ముగింపు క్రమం చాలా సరళమైనదైనా, దీని లోతు మరింత గొప్పది. దీన్ని దైవార్చనలో చివరి ఘట్టంగా కాకుండా, క్రైస్తవ పరిచర్య ఆరంభంగా చూస్తే దీని విలువ మరింత స్పష్టమవుతుంది. దీని నిర్మాణం ముఖ్యంగా నాలుగు భాగాలను కలిగి ఉంటుంది 'అవే: తక్షణ ప్రకటనలు, తుది ఆశీర్వాదం, పంపివేయుట, మరియు బలిపీఠ అభివందనం.

## 5.1. తక్షణ ప్రకటనలు

ఈ ప్రకటనలు సాధారణంగా దివ్యసత్ప్రసాదం అనంతరం, తుద ప్రార్థనకు ముందు జరుగుతాయి. అవి ముఖ్యంగా సంఘ జీవితం, పరిషత్ కార్యక్రమాలు, లేదా మతబోధనకు సంబంధించిన సమాచారాన్ని అందించేవి. ఇవి పొడవైన ప్రసంగాలు కావు. హోమిలీ మాదిరిగా ఉండకూడదు. అవి ప్రజలను ఉద్దేశించి, వారిలో స్పష్టతను, సంఘపాలక బాధ్యతను అందించాలి.

## 5.2. తుది ఆశీర్వాదం

తుద ఆశీర్వాదంలో ప్రభువుతో చివరి శుభాశీస్సులు నింపబడతాయి. ఇది నాలుగోసారి "ప్రభువు మీతో ఉండునుగాక" అనే సంభాషణతో ప్రారంభమవుతుంది. ఈ ఆశీర్వాదం విశ్వాసులపై దేవుని శాంతిని, బలాన్ని, అనుగ్రహాన్ని కలుగజేస్తుంది.

**తుద ఆశీర్వాదం నాలుగు విధాలుగా ఉండవచ్చు:**

1. సాధారణ ఆశీర్వాదం – సాధారణ దినాలలో గురువులు వాడే త్రియేక దేవుని నామములో ఆశీర్వాదం.
2. ప్రత్యేక (సోలం) ఆశీర్వాదం – పర్వదినాల్లో, ఉత్సవాల్లో మూడు వాక్యాలుగా ఇచ్చి ప్రతి దానికీ "ఆమెన్" అనే ప్రజల స్పందనతో ఉంటుంది.
3. ప్రజలపై ప్రత్యేక ప్రార్థన – పాస్క ఆయత్తు, పాస్క కాలం లేదా ప్రత్యేక సందర్భాల్లో ప్రజలపై ప్రత్యేకంగా ప్రార్థించబడే రూపం.
4. పీఠాధిపతి ఆశీర్వాదం – అత్యంత ఘనంగా, క్రియాశీల సంభాషణలతో కూడి ఉంటుంది:

పీఠాధిపతి: ప్రభువు నామము స్తుతింపబడునుగాక.

ప్రజలు: ఇప్పుడను, ఎప్పుడును, సదాకాలము స్తుతింపబడునుగాక.

పీఠాధిపతి: ప్రభువు పేరిట మనకు సహాయము కలదు.

ప్రజలు: అతడే పరలోకమును, భూలోకమను సృష్టించెను.

పీఠాధిపతి: సర్వశక్తిగల సర్వేశ్వరుడు పిత, పుత్ర, పవిత్రాత్మ మిమ్ము ఆశీర్వదించునుగాక.

ప్రజలు: ఆమెన్.

## 5.3. పంపివేయుట

ఈ భాగంలో గురువు ప్రజలకు అర్ధవంతమైన, పరిచర్య దిశగా పంపే శుభవాక్యాన్ని పలుకుతారు. దివ్యపూజ గ్రంథం అధికారికంగా ఉన్న నాలుగు వాక్యాలు:

1. దివ్యబలిపూజ సమాప్తమైనది. సమాధనముతో వెళ్ళుము.
2. సమాధనముతో వెళ్ళి ప్రభుసువార్తను ప్రకటింపుము.
3. సమాధనముతో వెళ్ళి మీ జీవితములద్వార ప్రభువును మహిమ పరపుము.
4. సమాధనముతో వెళ్లుము.

ఈ వాక్యాలు విశ్వాసులను క్రీస్తు బోధనను జీవించమని పిలిచే ఆత్మీయ ఆజ్ఞలు.

### పరిచర్యకు పిలుపు

దివ్యబలిపూజలో పంపివేయుట అనేది కేవలం ఒక అనుమతిచ్చే ప్రకటన కాదు 'ఇది శ్రీసభ తమ విశ్వాసులను ప్రపంచంలోకి పంపే మిషనరీ ఆజ్ఞ. ఇది ప్రతి ఒక్కరినీ బలిపూజలో పొందిన దయను బయటి ప్రపంచంలో జీవించడం కోసం పిలుస్తుంది.

లాటిన్ వాక్యం "Ite, missa est" అంటే: "వెళ్లుడి, దివ్యబలిపూజలో ముగిసింది." కానీ ఇది కేవలం ఒక ముగింపు కాదు. ఇక్కడ "missa" అనే పదం "పంపబడుట" అనే అర్థాన్ని సూచిస్తుంది. అంటే విశ్వాసులు దివ్యబలిపూజలో ప్రభువుని స్వీకరించి, ఇప్పుడు ప్రభువు కోసం పంపబడుతున్నారు.

పాపుగారు బెనెడిక్ట్ XVI తన అపోస్తలిక ప్రబోధంలో (Sacramentum Caritatis, 51) ఇలా చెప్పారు:

**"Ite, missa est అనే వాక్యం ఒక ముగింపు కంటే ఎక్కువ 'ఇది విశ్వాసుల పరిచర్య శుభప్రారంభం."**

ఈ వాక్యాలు మిస్సలులో అధికారికంగా ఉన్నాయి.

ఇవి ప్రతి ఒక్కరికీ వ్యక్తిగతంగా కూడా, సంఘపరంగా కూడా ఒక పిలుపు. ఈ వాక్యాలు శ్రీసభ ద్వారా ప్రభువు వారిని జీవన సాక్ష్యానికి పంపుతున్నదిగా భావించవచ్చు.

అపొస్తలుల కార్యములు 1:8–10 లో ప్రభువు శిష్యులను పంపించాక, వారు "ఏమి చేయాలి?" అనే ప్రశ్నలో ఉంటే, దేవదూతలు మీరు ఎందుకు స్వర్గం వైపు చూస్తున్నారు?" అని అడిగారు. అదే విధంగా, బలిపూజలో ప్రభువుని స్వీకరించిన మనం ' ఇప్పుడు ప్రపంచంలో ఆయనను ప్రత్యక్షంగా చూపించాల్సిన పిలుపును పొందాము.

**ఈ వాక్యాలు మనకు ఒక కొత్త బలాన్ని ఇస్తాయి**

బలిపూజ ముగిసింది 'జీవితం మొదలవుతోంది.

ప్రభువుతో గడిపిన సమయం 'ఇప్పుడు ప్రభువుకోసం గడిపే జీవితం.

## దేవునికి కృతజ్ఞతలు (ప్రతిస్పందన)

Deo Gratias అనే లాటిన్ పదబంధం "దేవునికి కృతజ్ఞతలు" అనే అర్థాన్ని ఇస్తుంది. ఇది 1 కోరింతీ 15:57, 2 కోరింతీ 2:14 నుండి ఉద్భవించినదిగా పూజా సందర్భంలో వినబడుతుంది. దివ్యబలిపూజ ముగింపులో గురువు చిసమాధానంతో వెళ్లండి" అంటారు, ప్రజలు "దేవునికి కృతజ్ఞతలు" అని స్పందిస్తారు. అంటే పూజ ముగిసింది అని కాదు, దేవుని నుండి ఎన్నో అనుగ్రహాలను పొందినందుకు మనం కృతజ్ఞతలు ప్రకటిస్తాం. దేవునికి ఎందుకు కృతజ్ఞత చెబుతాము?

## విశ్వాసానికై

దైవవాక్యాన్ని వినడం, ధర్మోపదేశాన్ని శ్రవించడం ద్వారా మన విశ్వాసం బలపడుతుంది. ఈ విశ్వాసమే మమ్మల్ని ఒక సమూహంగా పూజలో పాలుపంచుకునే స్థాయికి తీసుకొచ్చింది. ఈ విశ్వాసమే మనకు దేవుని శక్తిని గ్రహించేందుకు దారి చూపుతుంది.

## స్మరణ (మెమోరియల్)

పూజలో విశ్వసనీయులను, పుణ్యాత్ములను, మరణించిన వారిని స్మరిస్తారు. ఇది జీవుల మధ్యా మరియు పరలోక స్థితిలో ఉన్న వారి మధ్యా ఆధ్యాత్మిక బంధాన్ని వ్యక్తపరచుతుంది.

## పునీతుల స్మరణ

పుణ్యుల ప్రాతినిధ్యం, వారి జీవనశైలిని ఆదర్శంగా తీసుకొని, క్రీస్తు నీతి జీవితాన్ని స్మరించడం ద్వారా మన జీవితాల్లో పవిత్రత కోసం శ్రమించేందుకు ప్రేరణ పొందుతాము.

## దేవునికి కృతజ్ఞతలు – కృతజ్ఞత వ్యక్తీకరణం

కథొలికా విశ్వాసంలో కృతజ్ఞత అనేది పాశ్చాత్య నైతికత కంటే భిన్నంగా, ఇది దేవుని స్థిరమైన ఉనికిని, అనుగ్రహాల పట్ల మన లోతైన స్పందనను తెలియజేస్తుంది.

## "దేవునికి కృతజ్ఞతలు" – వేదాంత ప్రాముఖ్యత

"యూకరిస్టువ అనే పదం గ్రికు పదమైన *"Euxaplotia"* నుండి వచ్చింది, దీని అర్థం కృతజ్ఞతవ. యూకరిస్టు అనేది కృతజ్ఞతతో కూడిన ప్రార్థన – సృష్టి, విమోచన, పరిశుద్ధాత్మ కానుకకు కృతజ్ఞత.

పాపు రెండవ జాన్ పాల్ గారి ప్రకారం దివ్యసత్రుసాధం, కృతజ్ఞత అనేది ఆధ్యాత్మిక జీవితానికి ప్రాణాధారం. ఈ కృతజ్ఞత వ్యక్తీకరణ విశ్వాసంలో జీవించమనే పిలుపు. ఇది దేవుని అనుగ్రహాలను గుర్తించి, సేవలో మన జీవితాన్ని సమర్పించమనే ఆహ్వానం. ఇది సంతోషమును, ప్రేమను మన జీవితాల్లో పెంపొందిస్తుంది.

## 5.4. బలిపీఠానికి వినయ వందనం మరియు నిష్క్రమణ

పూజ ముగింపులో బలిపీఠానికి వినయవందనం చేయడం ద్వారా బలిపీఠ స్థల పవిత్రతను గుర్తించి, క్రీస్తు ప్రతినిధిగా బలిపీఠాన్ని గౌరవించడం జరుగుతుంది.

## బలిపీఠ చిహ్నాత్మకత

బలిపీఠం ఒక నిర్మాణం మాత్రమే కాదు, ఇది క్రీస్తును, కల్వరి బలిని, కడరా భోజనము సూచిస్తుంది. ఇది త్యాగ పూరితమైన జీవితాలని మరియు సమాజంలొ అనేక మందిని ఒకే మనస్కులుగా కలుపుతుంది. వినయవందనం గురువులు, సహాయకులు బలిపీఠాన్ని నమస్కరించడం లేదా ముద్దుపెట్టడం ద్వారా క్రీస్తును గౌరవిస్తారు. ఇది దివ్యబలిపూజ కృతజ్ఞత తెలిపే గౌరవ సంకేతం.

## శిరస్సు వంచి నమస్కారం

బలిపీఠాన్ని సమీపించే సమయంలో శిరస్సు వంచి నమస్కారం చేయడం ద్వారా అమిత గౌరవాన్ని వ్యక్తపరచటం జరుగుతుంది.

## ముద్దు పెట్టడం

గురువు బలిపీఠాన్ని ముద్దుపెట్టడం ద్వారా క్రీస్తుతో ఉన్న సన్నిహిత సంబంధాన్ని గుర్తిస్తాడు.

## నిష్క్రమణ మరియు విరమణ

## విరమణ ప్రదర్శన

సిలువ మోయు వ్యక్తి ముందుండి, గురువులు, సహాయకులు మరియు చివరగా ప్రజలు బయటకు వెళ్లే విరమణ ప్రదక్షిణ – విశ్వాసంలో యాత్రను ప్రతిబింబిస్తుంది.

## నిష్క్రమణ ప్రాముఖ్యత

ఇది సాధారణ ముగింపు కాదు. ఇది జీవితంలో విశ్వాసాన్ని జీవితంగా మార్చే ఒక పిలుపు – సువార్తను మోసుకెళ్లే బాధ్యత.

## లోతైన వేదాంతం దృష్టికోణం

నిష్క్రమణ ప్రవేశంలో కంటే సరళమైనది.

I. ఎమ్.సి.నమరా ప్రకారం: ఎక్కువ మంది గురువులు ఉన్నపుడు – ప్రధాన యాజకుడు బలిపీఠాన్ని ముద్దుపెట్టి నిష్క్రమిస్తే సరిపోతుంది. బలిపీఠం వద్ద దివ్య మందసం ఉన్నపుడు – ప్రధాన యాజకుడు ముందుకు వచ్చి నమస్కరిస్తారు, ఇతరులు తమ స్థానాల్లోనే నమస్కరిస్తారు. తక్కువ మంది ఉన్నపుడు – అందరూ ఒకే స్థలంలో నిలబడి ఒకేసారి నమస్కరిస్తారు.

II. పీటర్ ఎల్లియట్ ప్రకారం: నిష్క్రమణ గీతం ఎక్కువసేపు పాడబడితే, ఇద్దరొకజతగా వచ్చి నమస్కరిస్తారు. బలిపీఠానికి లేదా దివ్య మందసాన్నీ చూస్తూ అందరూ ఒకే సమయంలో నమస్కరిస్తారు, అనంతరం శాంతియుతంగా విడిపోయి పూజ వస్త్రాలు విప్పుతారు.

పూజ అనంతరం “దేవునికి కృతజ్ఞతలు” అనే స్పందన విశ్వాసానికి ఒక ప్రాణమయమైన ధృవీకరణ. ఇది ప్రతి విశ్వాసి హృదయంలో లోతుగా ప్రతిధ్వనించాలి. ఈ మాటల ద్వారా మనకు దేవుని వరాలు గుర్తు చేయబడి,

ఆ కృతజ్ఞతను సేవద్వారా వ్యక్తపరచాల్సిన కర్తవ్యాన్ని గుర్తుచేస్తుంది. మనకు లభించిన అనేక ఆశీర్వాదాలపై నిరంతర ధ్యానానికి ఇది ప్రేరణ కలుగజేస్తుంది. ఈ నిజమైన కృతజ్ఞతాభివ్యక్తి విశ్వాసుల జీవితాన్ని మార్చి, సంతోషం, సంఘం యొక్క దృఢమైన బంధం, ప్రేమ అనే ఆత్మీయ భావనలను పెంపొందిస్తుంది.

ముగింపులో పాడే గీతం సమాజంలోని ప్రతి విశ్వాసికి సువార్త ప్రబోధకులుగా తమ బాధ్యతలను నిర్వర్తించాలనే పిలుపును బలపరుస్తుంది. అంతేకాదు, ఇది ఆనందభరితమైన మరియు గంభీరతతో కూడిన వీడ్కోలుగా నిలిచింది, విశ్వాసులు తమ జీవితాల్లో విశ్వాసాన్ని ఆచరించేందుకు ప్రపంచంలోకి పంపబడే క్షణాన్ని గుర్తుచేస్తుంది.

బలిపీఠ పూజ నుండి సువార్త పరిచర్య వైపు మార్పు అనేది శ్రీసభ బోధనలో ఒక ముఖ్యమైన అంశం. ఇది దేవుని అనుగ్రహానికి మూలం మాత్రమే కాక, కార్యాచరణకు పిలుపు కూడా అని స్పష్టం చేస్తుంది. "దేవునికి కృతజ్ఞతలు" అనే పదబంధం ఈ మార్పును ప్రతిబింబిస్తూ, దివ్యబలిపూజలో పొందిన ప్రేమను, ఆశీర్వాదాలను ఇతరులతో పంచుకునే బాధ్యతను విశ్వాసులకు గుర్తుచేస్తుంది. శ్రీసభ బోధన ఎప్పటికీ ఈ సత్యాన్ని నిర్ధారిస్తూ, విశ్వాసులను తమ పరిచర్యకు సన్నద్ధులుగా చేసి, వారి దైనందిన జీవితాల్లో కృతజ్ఞతా భావాన్ని మరియు సేవా మనోభావాన్ని పెంపొందించే శక్తిని అందిస్తుందని చెబుతుంది.

**ముగింపు**

దివ్యబలిపూజలో ముగింపు క్రమం అనేది ఒక ఆత్మీయ ఘట్టం మాత్రమే కాక, ఒక దైవసన్నిధి నుండి జీవిత సాక్ష్యానికి మార్గం. ఇది దేవుని ప్రేమను అనుభవించిన విశ్వాసినకి, ఆ ప్రేమను ప్రపంచానికి ప్రతిఫలించాలనే పరిచర్యలోనికి పంపించే ఒక గొప్ప ఆహ్వానం.

తుది ఆశీర్వాదం ద్వారా శ్రీసభ, విశ్వాసులపై దేవుని కృపను ప్రసరింపజేస్తుంది. వెంటనే వచ్చే పంపివేయుట వాక్యాలు ఈ కృపను జీవితంలో వ్యక్తీకరించమని స్పష్టంగా సూచిస్తాయి. ఇది ఒక విధంగా జీవితం కోసం ఆత్మీయ నియామకం.

**ఈ ముగింపు క్రమం మనకు గుర్తు చేసేది:**

- మీరు దైవ సన్నిధిలో ఉన్నారు – ఇప్పుడు మీరు దైవ పిలుపుతో ప్రపంచంలోకి వెళ్తున్నారు

- మీరు శాంతిని పొందారు – ఇప్పుడు మీరు శాంతిని పంచాలి
- మీరు దివ్యసత్ప్రసాదాన్ని స్వీకరించారు – ఇప్పుడు మీరు దివ్యసత్ప్రసాదంగా జీవించాలి

ఈ విధంగా, దివ్యపూజాబలి ముగింపు అనేది ఒక తుది ఘట్టం కాదు ‘అది క్రీస్తుతో జీవించే కొత్త ప్రారంభం.

మన జీవితమంతా ఒక బలిపూజగా మారాలనే పిలుపు ఇందులో నిక్షిప్తమై ఉంది.

ఈ బలిపూజ ముగియగానే ప్రపంచంలోని బలిపీఠంపై మన సేవ ప్రారంభమవుతుంది.

“మీరు శాంతిలో పంపించబడినవారు – వెళ్ళుడి, జీవించండి, ప్రకటించండి.”

## ముగింపు క్రమము

**90. (GIRM) ముగింపు క్రమము క్రింది విధముగా నుండును:**


1. అవసరానుకూలముగ సంక్షిప్త ప్రకటనలు.
2. యాజకుడు ప్రజలకు శుభములు పలికి ఆశీర్వదించును. కొన్ని ప్రత్యేక సందర్భాలలో, ప్రత్యేక రోజులలో ఈ ఆశీర్వాదమునకు ముందు యాజకుడు ప్రజలపై ఆశీర్వచన ప్రార్థనను లేక ప్రత్యేక దీవెనలు చెప్పును.
3. దేవుని స్తుతించి, మహిమ పరచుచు, సత్క్రియలు ఆచరించుటకు దివ్యసంఘమును ఆహ్వానించుచు యాజకుడు లేక డీకను ముగింపు మాటలతో శుభములు పలుకును.
4. యాజకుడు, డీకను పీఠమును ముద్దాడిన తరువాత, యాజకుడు, డీకను, ఇతర సహాయకులు ప్రణామముతో పీఠమునకు సమస్కరించి నిష్క్రమింతురు.




బ్రదర్ తిప్పాన యువ చైతన్య



బ్రదర్ చింతా జార్జ్


INRI




భక్త యోహాను ప్రచురణలు

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం

రామంతపురం, హైదరాబాదు - 500 013. ఫోన్ : 91-040-29561761, 29561762

e-mail: stjohnshyd2@gmail.com | www.stjohnseminaryhyd.org

Printed at : Jeevan Institute of Printing